

జనవరి '65
75 పైసలు




వీనస్ పిక్చర్స్ సమర్పించు అశోక్ మూవీస్
సుమంగళి
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు ❖ నిర్మాత గోవిందరాజన్
రచన ఆత్రేయ ❖ సంగీతం మహదేవన్
స్టుడియో శ్రీసారథి (హైదరాబాద్) ❖ నవయుగ విడుదల
డిస్ట్రిబ్యూటర్స్ అవీక్ ప్రభాస్ ఎంటర్‌ప్రైసెస్

# తొలిమాట

పాఠకులకు నవ సంవత్సరారంభంలో నవాభినందనలు. ఈ సంవత్సరమంతా మీకు సంక్రాంతి పండుగలా సరదాగా గడిచిపోతుంది. ఇది మా జ్యోతిష్యం. 81 వ పేజీలో మాదిరి 'జ్యోతి'ష్యం కాదు.

♦ ♦ ♦

30 వ పేజీ చివరలో ఒక చిన్న అచ్చుతప్పు. '... ...కొన్నాళ్ళ క్రిందట కీర్తిశేషులైన..' వాక్యంలో 'కొన్నేళ్ళ క్రిందట' అని చదువుకో మనవి.

'కరుణ కుమార' (శ్రీ కందుకూరి అనంతం) స్వర్గస్థులైంది డిసెంబరు 1956 లో. పల్లెసీమల ప్రజల సుఖదుఃఖాలను, వారి హృదయాలను మథించి కమ్మని కథలసుధలు తీసిన 'కరుణ కుమార' కథ 'అర్ధరూపాయి'ని పాఠకుల కందించ గలిగినందుకు సంతోషిస్తున్నాము.



సంక్రాంతి ముగ్గు

ఫొటో: ఎమ్. ఎ. మోహనరావు, విజయవాడ.

♦ ♦ ♦

'ఉత్తరాయణం' శీర్షికను గడచిన రెండు సంచికలలో స్థలాభావంచేత వేయలేక పోయాము. ఈ సంచికనుంచి అది యథాతథంగా వెలువడుతుంది.

[signature]

మేనేజింగ్ ఎడిటర్, "జ్యోతి"







సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

విడిప్రతి వెల : 75 పైసలు — ఏడాది చందా : 9 రూపాయలు

సంపుటి 3 జనవరి 1965 సంచిక 1


# ఇదిగో వరుస....



ముఖచిత్రం : "పాండవ వనవాసం"లో ఎన్. టి. రామారావు.

ఇన్నర్‌కవర్స్ : "మంగమ్మశపథం" సెట్స్‌పై ఎల్. విజయలక్ష్మి,
"పాండవ వనవాసం"లో హేమా మాలిని.


మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

సంపాదక వర్గం :

నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

# ఉత్తరాయణం

"జ్యోతి" దీపావళి సంచిక ఆశించినంత ఆనందం కలిగించలేదు. "సెక్రటరీ" అద్భుతంగా వుంది. కాని మీరు కథను మంచి రసపట్టులో ఆపేస్తూ డిటెక్టివ్ కథలలోకన్న ఎక్కువగా సస్పెన్సును పోషిస్తున్నారు. అందుకని మీమీద చాలా కోపంగావుంది. కాని ఇంత చక్కటి పద్ధతితో పాఠకులలో ఉత్సుకతను రేకెత్తిస్తున్నందుకు అభినందించాలనిపిస్తూంది. ఏం చేయమంటారు? ఇంకా చాలా చాలా మంచి కథలను వేస్తున్నందుకుగాను మీకు మా అభినందనలు. శిఖరాలూ-సరిహద్దులూ అనే కథను మొదట చూచినప్పుడు (అంటే చదవటానికిముందు) ఏం బాగుంటుంది లెద్దూ! అనుకున్నాముగానీ చదివిన తరువాత మాఅభిప్రాయాన్ని మార్చుకోవలసివచ్చింది. "ఆదర్శాలూ-అనుభవాలూ" కూడా చాలా బాగుంది. రచయిత్రికి అభినందనలు. అభినందనలు అనే మాట విరివిగా వాడేస్తున్నాం. దానికి కారణం జ్యోతి ఆకర్షణలే.

మధు, కిరణ్,
బాపట్ల.

డిసెంబరు సంచికలోని 'ఆదర్శాలు - అనుభవాలూ' కథానిక నన్నెంతో ఆకర్షించింది. చదువుతోన్నప్పుడు అప్రయత్నంగా నాకళ్ళ నీళ్ళు నిలిచేయి. రచనలో ఓ మలుపు. రచయిత్రికి నా హృదయపూర్వక అభినందనాలు.

గౌరీశంకర్,
విశాఖపట్టణం.

దీపావళి సంచికను అనుకున్నంత అందంగా తయారు చేయలేకపోయారు. '63 దీపావళి సంచికతో పోల్చిచూస్తే నాగలోకానికి నక్కకియున్నంత తేడా కనిపిస్తుంది. అందమైన ముఖ చిత్రముతో '63 దీపావళి సంచిక విడుదల అయిన పదిరోజులలోనే అన్నీ అమ్ముడు పోయాయి. కానీ ఈ '64 దీపావళిసంచిక జ్యోతి అభిమాన పాఠకులను చాలా దగా చేసిందని చెప్పటానికి విచారిస్తున్నాను. ఇకనుంచి అయినా ప్రత్యేక సంచికల విషయములో వీలయినంత ప్రత్యేక శ్రద్ధాసక్తులను చూపెడతారని ఆశిస్తున్నాను.

చెలంకూరి శ్రీరామారావు,
విశాఖపట్టణం.

స్టాప్ ప్రెస్ త్రీ ఛీర్స్ టు మిస్టర్ నండూరి పార్థసారథి ఫర్ హిజ్ ఎడ్వెంచరస్ అటెంప్ట్; ఇట్ ఈజ్ ది బెస్ట్ అండ్ ఫస్ట్ ఇన్ తెలుగూ; హార్టీ కంగ్రాచ్యులేషన్స్ టు జ్యోతి ఫర్ పబ్లిషింగ్ ఇట్.

"హరిణాక్షి",
హైదరాబాద్.

మీరు జ్యోతిని ఇప్పుడు ప్రత్యేక కథల, కార్టూన్ల, జోక్ల సంచికగానే ప్రచురిస్తున్నారు.

గేయరచనక్కూడా స్థానంఇ(ప్పి)స్తే బాగుంటుందని నా అభిప్రాయం.

నేడు వచ్చే కథలలో హాస్యపుపాలు యెక్కువగా కనబడుతోంది. బహుశః యిది హాస్యపత్రిక అని భ్రమిస్తూ కథల్ని పంపుతున్నారేమో రచయితలు అని అనిపిస్తోంది. ఉన్నత ప్రమాణాల నందుకున్న ఎట్టి కథలైనా ప్రచురిస్తే బాగుంటుంది.

మరొక్కమాట—

పద్యాలు ఛందోబద్ధంగా రాసినంతలో అవి "ప్రాచీన" కవితాలక్షణమని ఆరోపించకూడదు. ఛందోబద్ధంగానే నూతనత్వాన్ని సృజించగలిగే కవులకికూడా మీ పత్రికలో స్థానం యిస్తే బాగుంటుంది.

నేను—అసలు దీని ప్రారంభదశలో—ఈనాడు నవీనంగా ఉత్పత్తి అవుతున్న విభిన్న సాహిత్య ప్రక్రియలన్నిటికీ దీనిలో స్థానం వుంటుందని తలపోశాను. కాని, కొంతవరకూ మాత్రమే స్థానాన్నివ్వటం సమంజసంగాలేదు.

కథలసంఖ్య సంతృప్తికరంగా వుండటం సంతోషంగా వుంది. పఠాభిగారి పన్‌చాంగములో "పన్" అంగము తక్కువగా వుండి, నిర్వచనాంగముఎక్కువగావుంటోంది. కార్టూన్లు మిగతా వాళ్ళవికూడా వేసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. ప్రస్తుతంకూడా చాలా బాగా వున్నాయి.

ఈ పత్రిక ... ... 'ఇంత జ్యోతి యింతకు యింతై యెంతో యెదిగిపోయిందమ్మా' అనిపించుకోవాలని వువ్విళ్ళూరుతున్నాను.

ఎమ్. శారద,
వాల్తేరు.

మమ్మల్ని నిలువునా సస్పెన్సు అనే ఆయుధంతో "సెక్రటరీ" గారిచే చంపించేస్తున్నారు. ఏమైతే అది అయింది ఈసారి అంటే, వచ్చే సంచికలో పూర్తిచేసివేయాలి. ఆఖరికి సంచికంతా సెక్రటరీగారు ఆక్రమించినాసరే!


కె. ఎస్. ఎస్. ప్రసాద్,
విజయవాడ.

"జీవులకు తానొక్కొక్కడై..." విద్యార్థులకు చక్కగా ఉపకరిస్తుంది. ఇంతకాలానికి ఒక హాస్యనాటిక "భర్త మార్కండేయ"ను అందించిన "జ్యోతి"కి వందనాలు. ముఖ్యంగా రచయితగారికి. పోతే సీరియల్స్ శిఖరాలూ-సరిహద్దులూ, సెక్రటరీ కూడా బాగానే యుంటున్నాయి. ఈనెల ప్రత్యేకత ఏమిటంటే కార్టూన్లు కడుపుబ్బ నవ్వించాయి.

లోలుగు అప్పాజీ,
రాజమండ్రి.

డిసెంబరు జ్యోతి సంచిక ముఖచిత్రం అక్కినేని-సావిత్రి యుగళదృశ్యం (మూగ మనసులు జ్ఞప్తికి వస్తోంది.) రెండువైపుల కన్నులపండువుగానున్నది. బ్రహ్మాండముగా సాగుచున్న సెక్రటరి సీరియల్ అద్భుతముగానున్నది. సెక్రటరీ రచయిత్రి గారి ఫొటో జ్యోతిలో ప్రచురించమని ఎడిటర్‌గారినికోరుకుంటున్నాను.

చిర్ల సుబ్బారెడ్డి,
గొల్లలమామిడాడ.



# రాజకీయ వాతావరణం

## నాలుగవ ప్రణాళిక స్వరూపం

వాస్కోడగామా పదహారవ శతాబ్దంలో భారత భూభాగంమీద అడుగుపెడితే, 1757 లో 'ప్లాసీ యుద్ధం' గెలవటంతో ఈస్టిండియా కంపెనీవారు వరుసగా భారత భూభాగాన్ని ఆక్రమించుకోవటం ప్రారంభించారు. పదహారవ శతాబ్దంలో వాస్కోడగామా భారతదేశం వచ్చినప్పుడు, పద్దెనిమిదవ శతాబ్దపు ఉత్తరార్ధభాగంలో దేశంలో జరగబోయే పరిణామాలేమిటో ఎవరు వూహించ గలిగారు!

దేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడి, ఐకమత్యం లోపించి, అరాజకపరిస్థితులు తలెత్తితే కేవలం నిమిత్తమాత్రులుగా వుండవలసిన విదేశీ వ్యాపారస్తులు, దేశీయ వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకుని 'పిట్టపోరు'కు తీర్పులు చెప్పేవారు. ఆనాటి సంస్థానాల ఆర్థిక దుస్థితి యిందుకు ప్రధానంగా దోహదం కలిగించింది.

సరిగ్గా అలాంటి పరిస్థితులే యీనాడు భారతదేశం యెదుర్కొవలసి వస్తోంది అంటే అతిశయోక్తి యెంతమాత్రం లేదు.

లెక్కలేనన్ని రూపాల్లో మనపెట్టుబడులు విదేశాల పెట్టుబడుల్లో పెనవేసుకుని వున్నాయి. దేశ ఆర్థికవిధానాన్ని నడిపించటానికి యీనాడు ప్రభుత్వం చేస్తున్న అప్పుకు అడ్డు ఆపు యేమాత్రం కనిపించదు. కొత్తగా మనం చేసే అప్పులో చాలాభాగం పాతఅప్పుకు వడ్డీలు చెల్లించటానికే సరిపోతుంది.

రాజకీయంగా ఈనాడు దేశంలో వున్న అస్తవ్యస్తమైన వాతావరణం, సూక్ష్మంగా ఆలోచించినకొద్దీ ఆందోళనను మరింత యెక్కువ చేస్తూనే వుంది. దిక్కూ దివాణంలేని నైతిక విలువలు! యెక్కడచూచినా ముమ్మరంగాచుట్టుముట్టే 'అవకాశవాదం'!

ఏపార్టీకి చెందినా, ప్రతిరాజకీయవాది మీదా ఈనాడు ఒక గురుతర బాధ్యతవుంది. దేశం, ప్రజ, ప్రధానం అనుకోకుండా, తను, తన పార్టీ మనుగడ మాత్రమే ప్రధానం అనుకుంటే, విలువలు ఛిన్నాభిన్నం

అయిపోతాయి. ఎవరికీ యెవరి మీదా నమ్మకంలేని అయోమయ పరిస్థితులు యేర్పడితే సహజంగానే తమ పెట్టుబడుల జాగ్రత్త చూచుకొనటానికి విదేశీయులు తప్పకుండా ఈనాడుకూడా జోక్యం కలుగజేసుకుంటారు. ఆ "జోక్యం" అంటే యేమిటో భారతజాతి బాగా చవిచూచింది.

## నాలుగవ ప్రణాళిక

"మూడు ప్రణాళికల ముందడుగు" తరువాత ఇప్పుడు నాలుగవ ప్రణాళికకు భారత దేశం సిద్ధపడుతోంది. మూడు ప్రణాళికల్లో మనం వేసిన "ముందడుగులు" యేమిటో ఒక్కమాటు సింహావలోకనం చేసుకుంటే, నాలుగవసారి వెయ్యబోయే "అడుగు" యెంతఊతంగా ముందుకు సాగుతుందో అందరికీ బాగా అర్ధమవుతుంది.

గత మూడు ప్రణాళికలలోనూ పెట్టుబడులు పెరిగినాయి, ఖర్చు యెక్కువగానే జరిగింది. కాని ఫలితాలు మాత్రం అనుకున్నవి అనుకున్నట్లు సాధ్యపడలేదు. జాతీయాదాయం మనం ఖర్చుచేసిన ధనానికి సరిపడిన నిష్పత్తిలో పెరగలేదు. అట్లాగే ధరలవిషయంకూడా అంచనాలకు అందకుండా మించిపోవటం జరిగింది.

ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే మూడవ ప్రణాళికా కాలంలో ధరలను అదుపు జేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినా చివరికి జరుగుతున్నవిషయం చూచుకుంటే— గడచిన మూడు సంవత్సరాలుగా అందులోమరీగడచినసంవత్సరం, సర్వసాధారణంగా 24.5 శాతం ధరల పెరుగుదల కనిపిస్తోంది. ఇందులో ఆహార ధాన్యాల ధరలు 44.4 శాతం పెరిగినాయి. మనం తయారు చేసుకునే వస్తువుల ధరలు (మాన్యుఫాక్చర్డ్ గూడ్సు) 5.9 శాతం మాత్రంపెరిగినాయి.

మరొకవైపు చూచుకుంటే, మూడవ ప్రణాళికా కాలంలో మనం పెరుగుతుందనుకున్న జాతీయాదాయంలో 60 శాతం కూడా సాధించుకోలేక పోయాం.

ఈ పై లెక్కలన్నీ ప్రభుత్వం అందజేసే కాగితాల ఆధారంగా బయటుపడిన విషయాలే.


ఇది మూడవ ప్రణాళిక కథ. మొదటి రెండు ప్రణాళికల సంగతి సరేసరి. మళ్ళీ చెప్పాలంటే చర్విత చర్వణం అవుతుంది.

మనం ఈనాడు డబ్బు ఖర్చు తక్కువ పెట్టటంలేదు. కాని పెట్టిన దానికి ఫలితం మాత్రం రావటం లేదు. ఎక్కడుంది దీని లోపం అంటే, అనేకముంది అనేక కారణాలు చెబుతున్నారు. ఎవరి శ్రుతి వారిది, ఎవరిపాట వారిదే—

దేశంలోని పరపతి సౌకర్యాలన్నీ జాతీయం చేస్తేనే, బ్యాంకులను జాతీయం చేస్తేనే, దేశంలోని ఆర్థిక యంత్రాంగంపైన ప్రభుత్వానికి పూర్తి అధికారం ఏర్పడుతుంది,







బొంబాయిలో జరిగిన క్రైస్తవ మహాసభ సందర్భంలో పోప్‌పాల్ రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు "గోల్డెన్‌స్పర్" పతకాన్ని బహూకరిస్తున్న దృశ్యం.

ఎప్పుడే ధరలు స్థిరపడతాయి ఎప్పుడే అంచనాలు అనుకున్నవి అనుకున్నట్లు సాధ్యపడుతాయి. రూపాయి విలువ స్థిరంగా లేనంత కాలం ఆ రూపాయిమీదే పెట్టుకుని గూడు కట్టుకున్న ఆశలన్నీ ఎప్పటికప్పుడు పేకమేడల్లాగా కూలిపోతూనే వుండటం తప్పదు అంటారు కమ్యూనిస్టులు.

ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రణాళిక అన్ని అంచనాలేసి ప్రారంభిస్తే, ఆదిలో అనుకున్న విలువ ఆ రూపాయికి అంతంలో వుండదు. అందుకనే ఫలితాలు తగ్గిపోతున్నాయి అంటారు కమ్యూనిస్టులు.

ఇక స్వతంత్రపార్టీ వారి సంగతి సరేసరి— దేశానికి వచ్చిన ఈ ముప్పు లన్నింటికీ కారణం ఈ ప్రణాళికలే నంటారు వారు.

ఇప్పుడు, దేశానికి 2,500 కోట్ల రూపాయల నాలుగవ ప్రణాళికను గత నెల పార్లమెంటు సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

జరిగిన విషయాలేమిటి? జరగబోతున్న విషయాలేమిటి?

ప్రణాళికా నిర్వహణ విధానంలో తగినన్ని మార్పులు జరగనంతకాలం యెక్కడవేసిన గొంగళి అక్కడే వుంటుంది.

ఖర్చు చేస్తున్న సొమ్ము సరిగ్గా సద్వినియోగం అవుతుందా లేదా అనే అంచనా వుండటమే కాకుండా,

ప్రణాళికలో ప్రతిఅంశాన్ని దాని అవసరం యెంత అని నిష్పాక్షికంగా శ్రద్ధగా పరిశీలించాలి.

ప్రధానంగా నాలుగవ ప్రణాళికను రూపొందించుకునే ముందు, ఖర్చును తగ్గించుకునే యోచన చెయ్యాలి. ప్రణాళికకు ఖర్చు అయ్యే మొత్తాన్ని పొదుపుగా చాలా భాగం తగ్గించుకుంటే, ప్రజలపైపడే పన్నుల భారం శతవిధాల తగ్గుతుంది. ఎంత ఎక్కువ డబ్బు ఖర్చు పెడితే అంత ఎక్కువగా ఫలితాలు లభిస్తాయనుకోవటం కేవలం భ్రమ. ఈ విషయాన్ని గత మూడు ప్రణాళికలు బాగా నిరూపించాయి.

ఈనాడు ప్రధానంగాకావలసినది ప్రజలలో పెట్టుబడి పెట్టగలిగినశక్తి. రైతు తన భూమిమీద అదనంగా పంట పండించుకొనటానికి యెంత పెట్టుబడి పెట్టగలుగుతున్నాడు? అట్లాగే ఒక కార్మికుడు, లేక ఒక పారిశ్రామికవేత్త, లేక ఒక చిల్లర వ్యాపారస్థుడు, తన కృషిని పెంపొందించుకోగలిగేందుకు యెంత అదనంగా పెట్టుబడి పెడుతున్నాడు? అలాగే ఒక గృహస్థు తన శ్రేయస్సు దృష్ట్యా యెంత కొనుగోలు శక్తిని పెంచుకోగలుగుతున్నాడు? ఈప్రశ్నలన్నింటికీ సమాధానంగా, వీరంతా— దేశ ప్రజలంతా యెంత యెక్కువగా పెట్టుబడి పెట్టగల శక్తిని పెంచుకోగలిగితే అంత యెక్కువ ఫలితాలను ప్రణాళికలు సాధిస్తాయి.

ఇందుకు ముఖ్యంగా కావలసినది పన్నుల విధానంలో మార్పు. చాలా వరకు పన్నుల భారం తగ్గాలి. యెవరైనా యేదైనా కృషిచేస్తే తత్ఫలితాన్ని కాస్త కూడగట్టుకుని, మళ్ళీ 'తన కృషి' లోనే ఆ లాభాన్నికూడా వినియోగించేందుకు వీలుకలగాలి.

పన్నులు తగ్గాలి, ప్రణాళికా వ్యయం తగ్గాలి. అంతేగాని "అప్పుచేసి పప్పుకూడు"—వ్యవహారంచేస్తే "ఇల్లంతా" మూడుదమ్మిడీలకు వేలం పాడతారు."

'నిప్పులాంటి ఉద్యోగస్థులు', నిర్దుష్టమైన పథకం—ఇవి వున్నప్పుడే ప్రణాళికా బద్ధమైన ప్రగతి సాధ్యమవుతుంది.

ఇది లేనినాడు, కమ్యూనిష్టులన్నట్టు పరపతి సౌకర్యాలను, ఆస్తిపాస్తులను, 'మనుషులను' కూడా జాతీయం చేసినా ఫలితాలు మాత్రం శూన్యమే.

## విశ్వాసంలేని "అవిశ్వాసం"

మొన్న రాష్ట్ర శాసనసభలో చర్చించబడిన "అవిశ్వాస తీర్మానం"లో అటు ప్రతిపక్షాలకు, యిటు ప్రభుత్వానికి కూడా అంతగా విశ్వాసంలేదు. ఆ తీర్మానం నెగ్గుతుందని, ఆ తీర్మానం సందర్భంగా చేసిన ప్రసంగాలను శ్రద్ధగా విని చాలావరకు కొందరైనా ఆచరిస్తారనికూడా యిద్దరికీ నమ్మకం లేదు. ఐనా యెవరు మాట్లాడేది వాళ్ళు మాట్లాడారు. చెప్పాల్సింది చెప్పారు. విన్నవాళ్ళు విన్నంత విన్నారు—వానా దీనా పర్యవసానం విశ్వాసంలేని "అవిశ్వాసం" అయింది.

ఏ అవిశ్వాస తీర్మానానికైనా ప్రధానంగా కావలసినది—ముఖ్యంగా ముఖ్యమంత్రిని అనేక అంశాలమీద తీవ్రంగా విమర్శించటం, రుజువులు తీసుకురాగలగటం. కూలంకషంగా చదివి వాదించే న్యాయవాదుల "సమీక్షల" లాగా వుంటే "అవిశ్వాస తీర్మానం" మీద చర్చలు రక్తికడతాయి.

దాదాపు అందరు మంత్రులమీదా శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అనేక అభియోగాలు తెచ్చారు దానికి సమాధానంగా, అవసరమైతే ఆ అభియోగాలను విచారించటానికి ఒక న్యాయమూర్తిని నియమిస్తామన్నారు ముఖ్యమంత్రి. అవి నిరూపించలేకపోతే తాను తన సభ్యత్వానికి రాజీనామా యిస్తానన్నారు.


నిజంగా న్యాయమూర్తి విచారణ జరుగుతుందా అని ఒక అమాయకుడు లాబీలో ప్రశ్నిస్తే "దేనికదేలే, ఇవ్వన్నీ పెట్టుకుంటే యిహ అయినట్టే" అంటూ కొంటెగా నవ్వాడు ఒక రాజకీయ పరిశీలకుడు.

ఒక్కొక్క కాంగ్రెస్ సభ్యుడు ఒక్కొక్క అంశంపైన ప్రత్యేకంగా కృషిచేసి ఉపన్యాసం ఇవ్వటానికి వీలుగా కొంతకాలం శిక్షణ తరగతులు నడపాలని రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పార్టీ తీర్మానించింది.

లాబీలలో విచారించగా దీనికి కారణం: అసెంబ్లీ సమావేశాల కాలంలో పత్రికలలో యెక్కువ భాగం ప్రతిపక్షాల వారి ఉపన్యాసాలే ప్రచురించబడుతున్నాయి. ఇందుకు కారణం కాంగ్రెస్ సభ్యులు "సరిగ్గా తయారై" ఉపన్యాసాలు ఇవ్వకపోవటమే అనే ఉద్దేశంతో



"శంకర్స్‌వీక్లీ" నిర్వహించిన అంతర్జాతీయ బాలచిత్రకళ పోటీలో గెలుపొందిన ఒక భారతీయ బాలికకు ప్రధాని లాల్‌బహదూర్ బహుమతి ఇస్తున్న దృశ్యం




ఇప్పుడే శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ సభ్యుల ఉపన్యాసాలన్నీ బాగా వివరంగా ప్రచురించటానికి ప్రత్యేకంగా రాష్ట్ర కాంగ్రెస్ ఒక దినపత్రికనుకూడా ప్రారంభిస్తుందిట.

## తిమ్మారెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ తిమ్మారెడ్డి చాలా పట్టుదలమనిషి.

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను పటిష్ఠం చెయ్యటానికి ముందు అవసరమైనది, కాంగ్రెస్‌వాదులద్వారా యే పనులు జరగవలసివుంటే అవి ప్రభుత్వ స్థాయిలో వెంటనే జరిగేటట్లు చూడటం. ఇందుకుగాను జిల్లాస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ కొన్ని అనధికార కమిటీలను ఆయన నియమిస్తారు. ప్రజోపయోగకార్యాలన్నీ యీ కమిటీలద్వారా జరిపించుకోవచ్చని వారి ఆలోచన.

ధ్వనికి ప్రతిధ్వనులు—శ్రీ తిమ్మారెడ్డి దూరదృష్టిగల నాయకుడని, "పార్టీ ఎబౌ పవర్" అని అక్షరాలా నిరూపించి, తాను అనుకున్నపని సాధించగల కార్యదక్షుడని, తాను యీనాడు యెంత అప్రమత్తతతో, యెంత చాకచక్యంతో వ్యవహరిస్తాడో దాని మీదే 'ఆంధ్రరాజకీయ భవితవ్యం ఆధారపడి వున్నట్లు ఆయనకు తెలుసునని ఇక్కడివారి అభిప్రాయం.

శ్రీ తిమ్మారెడ్డి ఘటనాఘటనా సమర్థులు. శ్రీ సంజీవరెడ్డి కేంద్రంలో అఖిల భారత అధ్యక్షుడుగా వున్నప్పుడు, రాష్ట్ర స్థాయిలో శ్రీ తిమ్మారెడ్డి 'యూనిటీఫ్రంట్'కు ముఖ్య నాయకులుగా జరిపిన రాజకీయం అద్వితీయం.

అలాగే ఈనాడు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా జిల్లాలస్థాయిలో తాను నియమించే అనధికార కమిటీల ద్వారా తాను సాధించే 'రాజకీయ ఫలితం' కూడా అద్వితీయంగానే వుంటుందనిచాలామందిఅభిప్రాయం.

## వరప్రసాదం

ఆంధ్రప్రజలు యెనిమిదేళ్ళనుంచీ కోరుతున్న రైల్వేజోను యిన్నాళ్ళకెలాగైతేనేం వచ్చింది—ఎస్. కె. పాటిల్‌గారి పుణ్యమా అని. ఆయనకు మనం కృతజ్ఞత తెలుపుకోవలసివుంది.


ఐతే, ఆయిచ్చేవరమేదో పూర్తిగా యివ్వకుండా కొంత యిచ్చి కొంత మానేశారు. గుంతకల్లు, వాల్తేరు డివిజన్‌లను చేర్చకుండా రైల్వేజోనును యేర్పాటుచేశారు. దీనివల్ల జోను నుంచి మన మాశించిన ప్రయోజనాలు కలగవు. ఇదంతా కన్నీటితుడుపు వ్యవహారంగానే వుంది.

బహుశా అడిగినంతా యిచ్చేస్తే ఆంధ్రులకు మరీ గర్వంఎక్కిపోతుంది అనుకున్నారేమో. మిగతా భాషా రాష్ట్రాలవారుకూడా ప్రత్యేకంగా రైల్వేజోనులు కావాలని పేచీ పెడతారనుకున్నారేమో. ఏమైనా, ఏవో రాజకీయాలు అడ్డుపడకపోతే దక్షిణ-మధ్య రైల్వేజోను యీ రూపం ధరించివుండదు.

ఏమైనా అడిగినదాంట్లో సగమైనా మనకు దక్కిందప్రస్తుతానికి—శ్రీ బ్రహ్మానందరెడ్డిగారన్నట్లు—అదే పదివేలనుకోవాలి.

—అనంతం □□□





అతివినయంగాచెప్పాడు బంట్రోతు.

"అయ్యగారింకా వారంరోజుల వరకూ రావటానికి వీల్లేదని చెప్ప మన్నారండి. అర్జంటు పను లున్నాయిట. వచ్చే బుధవారానికి తప్పక వస్తా నన్నారు."

వీణాధరికి యీ మాటలు విన గానే యెక్కడలేని వుడుకు మోతుతనం వచ్చింది. ఇవాళ ఆయన వస్తారని ప్రత్యేకం తనే స్వయంగా బంగాళాదుంపలు వేయించింది. ఆవడలు చేసి సిద్ధంగా వుంచింది. సాయంత్రం యే సినిమాకు వెళ్ళాలో ఆలో చిస్తుంంటే యీ కబురు!

విసుగ్గా లోపలకు వచ్చేసి మంచంమీద పడుకున్న వీణా ధరికి కొంచెంసేపట్లో పనిమనిషి ఒక కవరిచ్చింది. పై చిరునామా దస్తూరీ చూడగానే ఆ వుత్తరం రాజారావుదగ్గిరనుంచి అని అర్థమైంది వీణాధరికి. రెండునెలల క్రిందట తాను వ్రాసిన వుత్తరానికి యీనాడు జవాబు. కుతూహలంగా విప్పింది.

"వీణాధరీ!

నీ వుత్తరం అంది చాల్లాకాలమైంది. సమాధానం తూడా యివ్వలేని నిస్సహాయ పరిస్థితిలో వున్నాను. నా కాలమంతా ఆసుపత్రిలోనే సరిపోతూంది. వివరంగా తరువాత వ్రాస్తాను.

ఇంతే,

రాజారావు."

చదువుతూండగానే, వీణాధరి చేతిలోంచి ఆ వుత్తరం జారి క్రిందకు పడిపోయింది. శరీరమంతా స్వేద బిందువులు క్రమ్ముకొన్నాయి. ఇటీవలే ప్రారంభమైన గుండె నొప్పి అధికమయింది.

రాజారావ్ హాస్పిటల్ లో వున్నాడా? అతనికి జబ్బుచేసిందా? ఎప్పుడూ కళకళలాడే, చిరునవ్వుతో వెలిగిపోతూ, తాను నవ్వి, పదిమందిని నవ్వించే, రాజారావు నీరసంగా హాస్పిటల్‌లో బెడ్‌మీద పడుకొని, నర్స్ ఇంజక్షన్ చేస్తుంటే ... ... ...

ఇంక ఆలోచించలేకపోయిందివీణ. తనేం చేస్తోందో తనకు తెలియకుండా, ఇల్లంతా, అనేకసార్లుకలయ తిరిగింది. ఏదో ఆవేదన గుండెలను పిండేస్తోంది. అశాంతి మనసును నిలవనీయటంలేదు. పడుకొని బలవంతాన కళ్ళు మూసుకొంది. కలక బారిన మనసు, కళ్ళముందుకు, ఏవో పీడాకారపు దృశ్యాలను తెస్తోంటే, దిగ్గునలేచి కూర్చుంది.

ఎలా ఉన్నాడు? అసలు బ్రతికే వున్నాడా? ఛీ! ఛీ! ఎట్లాంటిఊహలు. తానతని నింక చూడగలదా? గుండెలు ఝుల్లు మన్నాయి. ఇంత తనను తాను నిగ్రహించుకోవటం బొత్తిగా సాధ్యపడలేదు వీణాధరికి. ఒకసారి స్వయంగావెళ్ళి రాజారావును కళ్ళతోచూస్తేనేగాని నిలువలేననుకొంది. త్వరగా సూట్‌కేస్ సర్దుకొని, రెండు మూడు రోజుల వరకూ రానని పనిమనిషితో చెప్పి రైలెక్కేసింది.

ఈపాటికి హాస్పిటల్లో రాజారావు ఎలాఉంటాడో? మంచంమీద కొనప్రాణంతో పడుకొని "వీణా?" అని కలవరిస్తుంటాడా?

ఈ ఊహ వీణాధరికి కళ్ళలో నీళ్ళుతెప్పించినా, వెంటనే దానిలోని అవాస్తవికతకు నవ్వొచ్చింది. భగవంతుడి దయవల్ల, రాజారావుకు అట్లాంటి పరిస్థితి రాకూడదు, కానీ, వస్తే "వీణా!" అని కలవరిస్తాడా?

వీణాధరీ, రాజారావూ, ఒకనాడు ఒకరకంగా ప్రేమికులే! వాళ్ళు విడిపోయారని అర్థమవుతూనేవుంది. కానీ, వాళ్ళు విడిపోవడానికి కారణాలు మాత్రం పాఠకులు ఊహించే అందమైన కారణాల్లో ఏ ఒక్కటీ

సి. ఆనందారామం

కాదు వాళ్ళు అత్యంత సహజంగా విడిపోయారు.

వీణాధరి, ఎంతో సంకోచంగా వ్యంగ్యంగా, తమ వివాహప్రస్తావన చేసినపుడు, రాజారావు తేలిగ్గా నవ్వేశాడు.

"వీణా! నాకు నువ్వంటే యిష్టం లేకపోలేదు. కానీ, పెళ్ళివిషయంలో నాకు చాలా ఆశలున్నాయి. చాలా డబ్బూ, అంతకంటే ముఖ్యంగా పలుకుబడీ, వున్నవారి అమ్మాయి, ఏదో అసాధారణమైన ఆకర్షణ, కనీసం చైతన్యవంతంగా నన్ను కవ్వించగలిగే పాటి తెలివితేటలు వున్న భార్య కావాలని కోరుకుంటున్నాను. ఇందుకు నా అర్హత లేపాటి వనేది వేరే సంగతనుకో! అయినా, అర్హతలకూ, ఆశలకూ సంబంధమేమిటి?"

ఈ మాటలు విన్న వీణాధరి నిర్ఘాంతపోలేదు. కనీసం ఆశ్చర్యాన్నిగూడా పొందలేదు. "జీవితం జీవించడానికి — చదవడానికి కాదు." అనే రాజారావు ఇలామాట్లాడటంలో అనుకోవలసిందేముంది?

దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి మాత్రం వీణాధరి పెద్ద ప్రయత్నమే చెయ్యవలసివచ్చింది,

ఏడవబోయే పెదమలతో చిరునవ్వునవ్వి "విష్ యు బెస్ట్ అఫ్ లక్" అని చెప్పి అతని జీవితంలోంచి వచ్చేసింది. తరువాత ఆదెబ్బనుంచి కోలుకోవడానికి వీణాధరికి చాలారోజులు పట్టింది. పిచ్చిపిచ్చిగా ఏవో ఆత్మహత్యా ప్రయత్నాలు కూడా చేసిందని చెప్పుకొన్నారు.

ఏమయితేనేం కాని, చివరకు వీణాధరి లక్షణంగా పెళ్ళిచేసికొంది. పెళ్ళికి రాజారావుకూడా వచ్చి వధూవరులకు తన శుభాకాంక్షలనందజేశాడు. ఆ తరువాతకూడా, వీణాధరి, రాజారావు నెన్నడూ మరిచిపోలేదు. అసలు మరిచిపోయే ప్రయత్నంకూడా చెయ్యలేదు. కాని, అతి ప్రయత్నంమీద తనను తాను సంస్కరించుకోగలిగింది—అవును. అతడు అసాధారణమైనవ్యక్తి. ఇదమిత్థమనరాని, ఏదో అపూర్వాకర్షణ అతనిలో వున్నమాట వాస్తవం: అట్లాంటి వ్యక్తిని ఆకట్టుకోవడానికికూడా అసాధారణమైన వ్యక్తులే వుండాలి. తా నతిసాధారణమైనది. అతని మనసులో స్థానాన్ని పొందడానికి ప్రయత్నించి ప్రయోజనం లేదు. తన అర్హతకు తగిన—ఇంకా యెక్కువగానే—ఫలాన్ని పొందగలిగిందితాను. రాజారావుతన ఆశ లన్నీ సఫలమయ్యేలాగ తాను కోరిన కన్యను వివాహమాడుతాడు గాక! అతి ప్రయత్నంమీద వీణాధరి కళ్ళలో నీళ్ళు పూర్తిగా మాయమయ్యాయి. రాజారావు స్మృతి యిప్పు డామెకు దుర్భర విషాదాన్ని కలుగజెయ్యటంలేదు. అతని నొక ఆత్మీయుడైన స్నేహితునిగా భావించగలుగుతూంది. అట్లాంటి వ్యక్తి స్నేహాన్ని పొందగలగటం ఒక అదృష్టమని నమ్మగలుగుతూంది.



రైలు ఖాజీపేట చేరుకొంది. కాఫీ, టీ వగైరా కేకలతో వులిక్కిపడింది వీణాధరి. అరుణోదయ మవుతూంది. లేచి ముఖం కడుక్కుందామనుకొని లేవలేక బద్ధకంగా అలానే కూర్చుంది వీణ.

ఎన్నెన్ని రకాలుగా ఆలోచిస్తూన్నా తిరిగి తిరిగి మనసు రాజారావు అస్వస్థతమీదికే మళ్ళుతూంది.

దాంపత్య జీవితంమీద గంపెడాశలు పెట్టుకొన్న రాజారావు అసలు పెళ్ళే చేసుకోలేదు. ఆ విషయం తా నెన్నిసార్లు ప్రశ్నించినా సరైన సమాధానం పొందలేకపోయింది అతని కలలబాల అతనికి సాక్షాత్కరించలేదో? లేక తారసిల్లిన అపరూపసుందరి అతనిని తిరస్కరించిందో? ఏం జరిగిందోమాత్ర వీణాధరి ఊహించలేకపోయింది కారణాలేమైనా, ఇప్పటికీ అతడు జంట లేని ఒంటిగానే నిలిచిపోయాడు. పాపం! ఈనాడు వంట్లో ఇంత అస్వస్థతగా ఉన్నప్పుడు, ప్రేమగా అతని నాశ్వాసించే హస్తం లేదు. అతని కష్టసుఖాలను తనవిగా చేసికోగలిగే మరొక ప్రాణి లేదు. కనీసం, అతనికి సాధారణ సదుపాయాలు చూడగలిగే తోడు కూడా ఎవరూ లేరు.

రైలులోమిగిలిన ప్రయాణీకులు చూస్తారేమోనని గబగబ కళ్ళు తుడుచుకుంది వీణాధరి.

తాను వెళ్ళబోయేటప్పటికి ఎట్లాంటి దృశ్యాలు ఎదురవుతాయో? ఎంత జబ్బులో ఉన్నాసరే. సజీవుడయి ఉంటే చాలు! అతనిని తాను బ్రతికించుకోగలదు. అతని జబ్బు పూర్తిగా నయమయ్యేవరకూ అతని దగ్గరే ఉంటుంది. ఇట్లాంటి పరిస్థితులో అతని కర్మకు అతనిని వదిలివేయగలశక్తి తనకు లేదు. సంఘం, పరువు, ప్రతిష్ఠ, తన సంసారం యివన్నీ వీణాధరి మనసులోకి రాకపోలేదు. ఏది యెలా జరిగినాసరే, సంఘమంతా తనను దుమ్మెత్తిపోసినాసరే, తనకు పరువు-ప్రతిష్ఠ లేమీ మిగులకపోయినాసరే! తన సంసారం నాశనమయినాసరే, రాజారావును మాత్రం జబ్బులో వదిలి రాలేదు, అతడే పొమ్మన్నాసరే!

రిక్షా దిగిన వీణాధరికి కూనిరాగంతీస్తూ, తల దువ్వుకుంటూ రాజారావు యెదురయ్యేసరికి శిలాప్రతిమలా నిల్చుండిపోయింది తలవని తలంపుగా వీణాధరిని చూసి రాజారావూ అంతే ఆశ్చర్యపోయాడు.


"నువ్వు.... నువ్వు... ...బ్రతికేవున్నావా?" విభ్రాంతితో అడిగింది వీణాధరి.

"దురదృష్టవంతుణ్ణి" నవ్వుతూ అన్నాడు రాజారావు. వీణాధరికి, తాను మాట్లాడినదేమిటో తెలిసివచ్చి నాలుక కరచుకొంది.

"నీ జబ్బేమయింది?"

"ప్రాణం పోతుందంటే నా కంత భయంలేదుకానీ, జబ్బులు మాత్రం యిష్టంలేదు. కానీ, నీ రాకేమిటి? వస్తూనే యీ కుశలప్రశ్న లేమిటి? అలా కూర్చో! కాఫీ త్రాగావా? ఏమైనా పైత్యం చేసిందా?"

"పిచ్చెక్కింది. నాకు కాకపోతే






నీకు! ఆ వుత్తర మెందు కలా వ్రాశావ్?'

'ఏ వుత్తరం? నేను చచ్చిపోయానని వ్రాశానా?' ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

వీణాధరి ముఖం యెఱ్ఱబడగా తల వంచుకుంది. రాజారావు యిలా నవ్వుతూ యథాప్రకారం కళ్ళబడే సరికి, అంతవరకూ రగిలిపోతున్న వీణాధరి హృదయం చల్లబడింది. అంతవరకూ తాను పొందిన అలసట అప్పుడనుభూతమై కుర్చీలో నీరసంగా వెనక్కు వ్రాలి 'హాస్పిటల్‌లో వున్నానని, నాకు సమాధానంకూడా యియ్యలేని పరిస్థితులలో వున్నాననీ వ్రాశావు—గుర్తులేదూ? అది చదివి యెంత బాధపడుతున్నావోనని పరుగెత్తుకొచ్చాను' అంది.

'ఓ, అదా! నాకు పెద్దవుత్తరాలు వ్రాయాలంటే విసుగు! అసలు వుత్తరాలు వ్రాయాలంటేనే విసుగు. నీ బాధపడలేక నీకు సమాధానం వ్రాస్తాను. మా చెల్లెలు హాస్పిటల్‌లోవుంది. అందుకని నాకు తీరిక లేదని వ్రాశాను.

'హమ్మయ్య! దారిపొడుగునా యెంత బాధ పడ్డాననుకొన్నావ్!'

'నీ అమ్మ కడుపు చల్లగాముండే చెప్పావు. ఇంక ముందు నా కెంత పెద్ద జబ్బుచేసినా, పొరపాటున కూడా, నీకు వ్రాయను. అయినా, ఇలావచ్చెయ్యటమేమిటి? అన్నింటికీ, తొందరే నీకు! వీణాధరికి కోప మొచ్చింది.

'అంత కానిపనేం చేశాను నేను?'

'ఏది కాని పనో, ఏది మంచిపనో, నిర్ణయించేవాళ్ళం మనం కాదు. మనకు శ్రమలేకుండా, కొందరు బుద్ధిమంతులా పని చేసిపెట్టేశారు. ఆ ప్రకారం నడవటమే మనవంతు. ఇప్పుడేడువు మొదలు పెట్టక, లోపలికెళ్ళి స్నానం అదీ చూసుకో! మా అత్తయ్యహాస్పిటల్‌కు వెళ్ళింది. తను వచ్చాక భోజనాలు చెయ్యవచ్చు. వంట అయిపోయిందనుకొంటాను.'

'ఇంకా ఏం ఏడుస్తానూ? దారిపొడుగునా ఏడ్చేశాను.'

'వెరీగుడ్! నన్ను బ్రతికించావు. స్నానాలగది అటుపక్క వుంది.'

రాజారావు స్నానాలగది చూపించాడు. వీణాధరి స్నానంచేసి వచ్చే సరికి, రాజారావు మేనత్త వచ్చేసింది. వీణాధరిని పైనుంచి క్రిందకు పరిశీలనగా చూస్తూ "ఎవరురా?" అంది.

"మనకు కావలిసినవాళ్ళు" నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు రాజారావు.

ఆవిడ మరొకసారి వీణాధరి వంక గుచ్చి గుచ్చి చూసి లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె వెయ్యబోయే ప్రశ్నా పరంపర ఊహించుకొని, వీణాధరిగుండెలు ఝల్లుమన్నాయి. జడ్జీముందరి ముద్దాయిలా వణికిపోయింది. 'నేను రాత్రి రైలుకి వెళ్ళిపోతాను.' అంది.

"రెండు రాత్రులు వరుసగా నిద్ర లేకుండా ఉండగలవా?"

"పరవాలేదు. బెడ్‌రెస్ట్ చేసి కొంటాను."

"అయితే సరే! భోజనానికి రా! అత్తయ్యా! మా ఇద్దరికి వడ్డించు."

"ఇద్దరికీనా?" ఆవిడ నొక్కి అడిగింది.

"ఆ! ఇద్దరికీ!" అంతకంటేదృఢంగా అన్నాడు రాజారావు.

వీణాధరి కుంచించుకొని పోతూంది. తాను చేసినదెంత అనాలోచిత కార్యమో, ఇప్పుడర్థం కాసాగింది.

"పోనీ, నువ్వు తినేసిన తరువాత నేనావిడతో తింటాను." అంది బెదురుగా.

"బాగుంది! నువ్వు మాచెల్లెలిని చూడడానికి రావా? ఇప్పుడు నేను హాస్పిటల్‌కు వెడుతున్నాను, నువ్వింతదూరం వచ్చింది దేనికి?"

వీణాధరి ఇంకేం మాట్లాడలేదు.

హాస్పిటల్‌కు వెడుతూ దారిలో వీణాధరి "మీ మేనత్తగారు ఏమేమి అడుగుతారోనని హడలిపోయాను" అంది,

"ఆవిడకా అవకాశం లేకుండా చేసానుగదా!"

"నిజంగా నన్ను రక్షించావు."

"నువ్వెందుకింత కంగారుగా వచ్చావు?"

"చెప్పానుగా! నీకే బాగులేదనుకొన్నాను. మతిపోయింది. ఉన్న దాన్ని వున్నట్లు వచ్చేశాను. పోనీలే! మీచెల్లెల్ని చూసినట్లవుతుంది."

రాజారావు మనసు కరిగిపోయింది. తనకోసం, ఆమె అంత ఆవేదనతో వచ్చిందనే సరికి, సహజంగా ఆమెపట్లవున్న అభిమానం మరింత కాగా, ఆర్ద్ర స్వరంతో "పోనీలే! ఇలానయినా, నిన్ను చూశాను." అన్నాడు.

వీణాధరి ఏం మాట్లాడలేదు.

"ఇంకా యేమిటి విశేషాలు?" అన్నాడు రాజారావు.

"విశేషాలా? ఏమున్నాయ్! మా వారు క్యాంప్‌నుంచి నిన్న రావలసింది. వచ్చే బుధవారం వరకూ రానని కబురుచేశారు. ఎక్కడిపన్లో బాబూ?"

"అలాగా?(!)ఐతే, ఆయన తరచు క్యాంప్స్‌లో వుంటారన్నమాట!"

"ఆ! తరచూ వెడుతూనేవుంటారు. ఊళ్ళో వున్నప్పుడుమాత్రం యెంత సరదాగా వుంటారనుకొన్నావ్. వట్టి చిలిపి. ఎప్పుడూ యేద్దో అల్లరిచేస్తూనే వుంటారు. ఇంక సాయంత్రమయిందంటే యెక్కడికో ఒకచోటికి బైలుదేరతీస్తారు. తను క్యాంప్‌కెళ్ళినపుడు మాత్రం పిచ్చెక్కినట్లే వుంటుంది."

ఏదో లోకంలో వున్నట్లు చెప్పుకుపోతూంది వీణాధరి. ఆమె వాక్ప్రవాహానికి అడ్డు తగలకుండా "ఊ! ఊ!!" అంటున్నాడు రాజారావు.

"బయటునుంచి వస్తూనే "వీణా!" అంటూ కేకలు. పని వున్నా, లేకపోయినా "వీణా! వీణా!!" అని పిలుస్తూనే వుంటారు. ఒక్కొక్కసారి విసుగేస్తుంది. కానీ, ఒక్క క్షణం తను లేకపోయినా తోచదు. నాకు కొద్దిగా ఒళ్ళు వెచ్చగా వున్నా బెంబేలెత్తిపోతారు. ఇంక ఆ గాబరా, హడావుడి చెప్పలేం! మరీ అంత వెర్రేమిటో?"

భర్తృస్మృతులతో మధురంగా నవ్వుకొంది వీణాధరి. ఆమె ధోరణికి విస్తుపోతూ "గుడ్!" అన్నాడు అన్యమనస్కంగా రాజారావు.

వీణాధరి మళ్ళీ ప్రారంభించింది.

"మరీ పసిపిల్లాడి తంతు! తనకు కావలసినవికూడా తనకు తెలియదు. చివరకు తన ఆకలి తనకు తెలియదు. భోజనం సంగతి నేను గుర్తుచెయ్యాలి. మేజోళ్ళు నేను రెడీగా పెట్టాలి. ఏ ప్యాంటు వేసుకోవాలో; ఏ షర్టు వేసుకోవాలో నేను తీసిపెట్టాలి. ఇంక ఫలహారం చెయ్యడానికి ఎన్నితిప్పలు పెడతారో చెప్పలేను. టిఫిన్ ప్లేటు ఒకవారకి పడేసి ఆసంగతి మరచిపోయి, మరోపనిలో మునిగిపోతారు. ఆ ప్లేటు చేతిలోపెట్టుకొని, మూవింగ్ టేబిల్‌లాగ తనకూడా, కూడా తిరగాలి. లేకపోతే, రాత్రిదాకా దాని సంగతే మరచిపోతారు."

రాజారావుకు విసుగేస్తూంది "ఊ!" అన్నాడు మూలుగుతున్నట్లు—

వీణాధరి అప్పటికీఆపలేదు. ఆమె భర్తృ పాదుల దివ్యగుణ సంకీర్తనంలో పరవశత్వం పొందుతోంది. రాజారావు పూర్తిగా వినటం మానేశాడు. ఎప్పుడైనా, అన్యమనస్కంగా, "ఊ" అనో, "ఆ!" అనో, "అలాగా!" అనో మాత్రం అంటున్నాడు. తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్న వీణాధరికి, రాజారావువింటున్నాడో లేదోకూడా పట్టినట్లులేదు—

రాజారావు చెల్లెల్నిచూసి, ఆమె దగ్గర తాను కొనితెచ్చిన పళ్ళనుంచి, కొంచెంసేపు సానుభూతిగా మాట్లాడి రాజారావు వెంటరాగా, హాస్పిటల్ నుంచి తిరుగుముఖం పట్టింది వీణాధరి. వచ్చేటప్పుడంతా వీణాధరి తన శ్రీవారి గురించి చెప్పిన విశేషాలు విని విని విసుగెత్తిన రాజారావు ఏదో మాట్లాడబోతుండగానే దారి పక్కన గులాబిపూలను చూసి వీణాధరి అందుకొంది.

మావారికి గులాబిలంటే చాలా ఇష్టం, నాకు సన్నజాజులంటే ఇష్టం. నాకోసం సన్నజాజులుకూడా తెస్తారనుకో!— అయినా రోజూ ఇన్ని గులాబీలు కొని తిసుకువస్తారు. పువ్వులంటే, ఎంతో మమకారం. మాయింట్లో చిన్నతోట వుంది— ఆయన స్వయంగా?"...

గడగడ మాట్లాడుతున్న వీణాధర నోరు గట్టిగా నొక్కి పారేద్దామన్నంత కసి కలిగింది రాజా

రావుకు. సభ్యత తెలిసినవాడు గనుక చచ్చినట్లు వీణాధరి మాటలు విన్నాడు. కనీసం విన్నట్లునటించాడు.

ఆ సాయంత్రం ఆమెను రైలెక్కిం చినతరువాత తాను ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి రాజారావు "నువ్వు వెళ్ళేసరికి మీ వారు రారను కొంటానేం?" అన్నాడు.

"అవును ... ...రారు" దిగాలుగా అంది వీణాధరి.

"హమ్మయ్య! ఐతే నువ్విలా వచ్చినట్లు ఆయనకు తెలిసే అవకాశం లేదు" అన్నాడు రాజారావు.

వెంటనే వీణాధరి ముఖం జేవు రించింది.

"ఎందుకు లేదూ? నేనే చెప్తాను. నే నేమంత ఘోరంచేశానని దాన్ని పరమ రహస్యంగా వుంచటానికి? మా వారికి నామీద సంపూర్ణమైన విశ్వాసం వుంది. నేను జరిగింది జరిగి నట్టు చెపుతాను. ఒకవేళ వారికి తప్పనితోస్తే తోచనీ. వారు వేసే యే శిక్షైనా సంతోషంగా భరిస్తాను. ఒక పని చెయ్యటానికి సాహస మున్న ప్పుడు ఫలితాల ననుభవించే ఓపిక కూడా వుండాలి. అంతేకాని ఆయన దగ్గిర నేనేందాచను."

రాజారావు విస్తుపోయాడు. మన సులో "నీ కర్మ" అనుకొని పైకి "మంచిది. అలాగే చెయ్యి" అన్నాడు.

అంతలో లైట్లు వెలిగాయి. వీణా ధరి చటుక్కునతన మాంగల్యాలను తీసి కళ్ళ కద్దుకొంది. రాజారా వది చూసిచాలా ఆశ్చర్యపోయాడు. వీణా ధరికిమాత్రం తానేంచేస్తున్నదో తనకు తెలియదు. అదొక అసంకల్పిత ప్రతీ కారచర్య. తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన ఒకానొక సంప్ర దాయపు గుర్తు.

రైలు బిగ్గరగాకూస్తూ కదిలింది. వీణాధరి కనబడినంతసేపు చెయ్యి వూపి, వెనుదిరిగాడు రాజారావు.

వీణాధరి రాక, ఆమెరాకలోని ఉద్దేశ్యం, తీరావచ్చిన తరువాత ఆమె తీరూ, అంతా విచిత్రంగా అనిపిం చింది, రాజారావుకు. లైట్లు వెలగ గానే, ఆమె తన మాంగల్యాన్ని కళ్ళ కద్దుకోవటంగుర్తుకొచ్చింది. అదృశ్యం మనసులో తలచుకోగానే, అతని కిలా అనిపించింది.

"వీణాధరి మనసు ఒక డోలిక లాంటిది. గాలి తాకిడికి డోలిక వెనుక ముందులకు ఊగినా, అది స్థిరత్వాన్ని పొందేదిమాత్రం, అది బంధింపబడినశాఖనాశ్రయించుకొనే! వీణాధరి మనసుకూడా, మాంగల్యా లనే సూత్రాలతో, ఆమె భర్త అనే కేంద్రానికి బంధింపబడింది. ఉద్వేగ ఝుంఝూమారుతా లామె మనసు నెటు వూపినా, చివరికామె తన భర్త నాశ్రయించుకొనే ప్రశాంతినిపొందు తుంది."

□□□





# అర్ధ రూపాయి



సాధారణంగా అజ్ఞానదశలోని పసి పిల్లకాయలు, నెత్తిన ఎర్రపాగా, చేతులో లాఠీ, కాళ్ళకి బూట్సు, వంటి మీద యూనిఫారం వేసుకొని సాక్షాత్క రించే పోలీసు జవానుల స్వరూపాలు చూచి భయపడడం అక్కడక్కడ కద్దు.

కాని, అదేమి ఖర్మమో - మైనార్టీ తీరి, బిడ్డల్ని కని సంసారం నెత్తినబడ్డ యీడులో కూడా ఎర్రగుడ్డనిచూచి భయపడడం ఇదేం గ్రహచారం ? చిన్నప్పటినుండీ పట్నవాసంలో ఉండి కూడా అతనికి పోలీసులంటే యీ భయమేమి ఖర్మం ?

"ఎవరన్నా ఇన్నేళ్ళు వచ్చీకూడా పోలీసులంటే యీ భయమేమిటని ప్రస్తావనచేస్తే, "నీకేం తెలుసు. వాళ్ళ దుర్మార్గం నీకు తెలియదు. తుపాకీ ఢాం అని కాల్చినా, లాఠీకర్రతో నెత్తిన ఒక్కపెట్టు పెట్టినా, నెత్తిన ఏ నేరమో రుద్ది అరదండాలు తగిలించి జైల్లో పారేసినా మనకెవరు దిక్కు?" అని వాదించి తనతత్వాన్ని సమర్థించుకొంటూ ఉండేవాడు వేదాంతాచారి. అతనికింగ్లీషు చదువు వాసనలేకుంటేమాత్రం, తెలుగులోనూ,సంస్కృతంలోనూఅతనుచదివిన చదువేమిటి, అతని వేదాంతమేమిటి, పోలీసులంటే ఈ భయమేమిటి ?

ఆ సాయంకాలమేమి జరిగిందా—

గోపాలస్వామి ఆలయంలో స్వాములవారు వేదాంతోపన్యాసం ఇస్తున్నారంటే ఉపన్యాసం వినడానికి వెళ్ళాడు ఆచారి. ఓ, ఉపన్యాసమేమిటి, అమృతం కురిపించారు— మహానుభావులు.

సాయంత్రం అయింది. ఉపన్యాసంవిని, దేవాలయం ఆవరణ దాటి వీధిలో అడుగుపెట్టే వరకు, క్రింద దుమ్ములో తళతళలాడుతూ ఆచారి కంటికొక తెల్లని వస్తువు గోచరించింది. ధూళిలోపడి దొర్లాడే ఆ వస్తువుకు— దాన్నితగలెయ్యా— ఎంత బలం పెట్టాడో భగవంతుడు, అతన్ని అక్కడ ఖడేరావని నిలబెట్టి వేసింది. సూదంటురాయి యినుమును లాగినట్టు ఆ వస్తువు ఆతని భౌతిక శరీరాన్ని ఊ క్రిందికి లాగేసింది.

ఆ వస్తువును చేతిలోనికి తీసుకొని చూడకుండా వెళ్ళడం ఎట్లా?

ఏమిటా అని ముందుకు వంగి తీసుకొని చూశాడుగదా? దీని తస్సాదియ్యా అది సింహంమార్కు అర్థరూపాయి కాసు.

అతని చేతులు గడగడ వణికేయి. నలు ప్రక్కలా తిరిగి చూచాడు. దగ్గరలో ఎవ్వరూ లేరు. ఎవరిదో ఈ అర్థరూపాయి? ఛీ, ఛీ, పరాయి డబ్బు పాపిష్ఠిడబ్బు. ముట్టుకోకూడదు. ఆ కాసు అక్కడే తిరిగి పారేసి పోదామనుకున్నాడు. దుమ్ములో కప్పిపెట్టేద్దామనుకొన్నాడు. వెనుకనుంచి ఎవరో ఆచారీ అని పిలిచినట్టనిపించింది. ధడాలున అర్థరూపాయి జేబులో పడేసి తువాలు కప్పుకొన్నాడు. వెనక్కి తిరిగి చూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. కదిలి వెళ్ళిపోయాడు.

తాను ఆ అర్ధరూపాయ కాసు తీయడం ఎవ్వరూ చూడనట్టేగదా.





ఏమి చూస్తే? గానేమీ దొంగతను [illegible]గు లేదు. దొమ్మీ చేయ[illegible]పి ఎగులేదు. ఈషణ్మాత్ర[illegible] ఒగిలయిన ధనేషణ మిక్కిలి పాపభూయిష్ఠమైనదని ఇంతకుముందే స్వాములవారు ఉపన్యాసంలో చెప్పారు. ఈపాడు డబ్బు ఎవరిక్కావాలి? ఈ సొమ్ము పారేసుకున్న పెద్దమనిషి వచ్చి అడిగితే, గిరగిర త్రిప్పి పారేయడానికతని కభ్యంతరం లేదు.

రస్తానబడి రెండు ఫర్లాంగులు దక్షిణంగా పోయాడు ఆచారి. వెనక నుండి ఎవరో తరుముకొని వస్తున్నట్టనిపించిందతగాడికి. తిరిగి చూచాడు. అక్కడక్కడ జనం వస్తున్నారు, పోతున్నారు. నిలబడ్డాడు. దగ్గరకు వచ్చిన ఒకరిద్దరు పెద్దమనుష్యుల ముఖంలోకి చూచాడు. ఎవ్వరూ డబ్బుసంగతి తనతో ప్రస్తావన చేయకుండానే వెళ్ళిపోయారు. అతనికి కొంత ధైర్యం వచ్చింది.

బళ్ళమెట్టుదగ్గరకు వచ్చాడు. పిల్లకాయలు చేతులు వెనక్కిపెట్టి ముందుకు వంగి ఏమిటో వెతుక్కొంటున్నారు. అతని గుండె జల్లుమన్నది.

"ఏమిటబ్బాయీ, వెతుక్కొంటున్నారు" అనడిగాడు.

వాళ్ళేమి సమాధానంయిస్తారో ?

జేబుమీద చెయ్యివేసి గట్టిగా పట్టుకొన్నాడు.

"గోళీకాయ కనిపించలేదు, ఎట్లాపోయిందో"—అన్నాడు పిల్లవాడు.

"నే చూడలేదు నాయనా, గోళీ, నాకు దొరికితే మీకివ్వక వెధవ గోళీ నేనేం చేసుకొంటాను. వెతకండి నాయనా, ఉంటుందిలెండి ..." అని వాళ్ళకు ధైర్యం చెప్పి, తాను ధైర్యం తెచ్చుకొని ముందుకు సాగిపోయాడు.

ఒక్క గోళీకాయఅగుపించకుంటే ఆ పిల్లకాయలు ఆ విధాన్న అల్లాడిపోతున్నారే, అర్థరూపాయికాసు పోగొట్టుకొన్నవాళ్ళెంత దుఃఖించిపోతున్నారో !

అదే భగవంతుని సృష్టిలోగల వైచిత్ర్యం.ధనమనే వస్తువుని సృష్టించి మానవుల్ని ఏడిపిస్తూ నవ్విస్తూ ఉంటాడు భగవంతుడు. ఆహా ! ఏమి లీలలురా నీవి భగవంతుడా ? ఏమి లీలామానుషవిగ్రహుడవోయీ ?

ఛీ ! ఛీ ! పాడు డబ్బు. దుఃఖభూయిష్ఠమైనది. ఈ అర్థరూపాయి కాసు ఎంత తొందరగా వదలించుకొంటే అంత శ్రేయస్కరం.

రామనామ తారకం
భక్తిముక్తి దాయకం
రామనామ ...

"కరుణకుమార"

గబగబా వెళ్ళిపోయాడు.

మరి యీ డబ్బును వదిలించుకోవడం యెట్లా?

తలెత్తి చూచాడు. రైలురోడ్డు మీద నిలబడి ఉన్నాడు. ప్రశాంతంగా ఉన్నదా ప్రదేశం. రైలుపట్టాల మీద కూర్చున్నాడు.

వదిలించుకోవడం ఎంత సేపు. క్షణం పట్టదు. కాని యేవిధంగా యీ అర్ధ రూపాయిని వదిలించుకోడం. దీని ఖామం దెవరో తెలియకపోయె. ఏ బ్రాహ్మడికైనా దానం చేస్తే? లేక ఏ కుంటీ, గుడ్డికైనా పిలిచి దానం చేస్తే? లేక ఓ అరడజను గజనిమ్మ పళ్ళు కొని దేవాలయంలో స్వాముల వారికి సమర్పించి దణ్ణం పెట్టుకుంటే? లేక ఏ ధర్మసంస్థకైనా తన పేరు చెప్పి ధర్మం చేస్తే?

ఆలోచన తెగలేదు ఆచారికి.

దానం చేయడంలో సత్పాత్ర దానం చేయాలని అంటారు పెద్దలు. సత్పాత్రదానం ఎటువంటిదో స్వాములవారి నడిగి తెలుసుకొంటే?

పడమరగా తిరిగి మోకాళ్ళమీద మోచేతులానించి గడ్డంక్రింద చేతులు పెట్టుకొని దీర్ఘాలోచనలో పడ్డాడు వేదాంతి.

ప్రొద్దు పడమటికొండలు దాటింది.

ఎవరో చేతిలో కర్ర టక్కుటక్కున కొట్టుకొంటూ యేదో వెతుక్కుంటూ వస్తున్నారు.

ఏమిటి చెప్మా, అత డట్లా వెతుక్కొంటున్నాడు?

ఆచారి దేహం ఉడుకెత్తింది.

జేబులో చెయ్యి వేసుకొని చూచుకొన్నాడు. అర్ధ రూపాయిక్కూడా ప్రాణ ముండి, క్షణక్షణం పెరుగుతూ ఉంటుందిగాబోలు— దిమ్మచెక్కలా చేతికి తగిలింది.

ఆ వెదికే మనిషి అతని సమీపంలోకి వచ్చాడు.

"ఏమిటి గంగయ్యా! చీకటిపడి వెతుక్కుంటున్నావు?" అని అడిగేడు ఆచారి.

"బర్రెదూడ తప్పించుకొనివచ్చింది సామీ, ఏడ యెతికినా కానరాలేదు. ఏ రైలుకిందైనా పడి చచ్చిందేమోనని యిట్లా వచ్చా" అన్నాడు గంగయ్య.


"నా కగుపించలేదయ్యా నీ దూడ. చూస్తే చెప్పనూ. దాచిపెట్టుకొనే వస్తువుగనక నా. పాపం! నిక్షేపంవంటి దూడ. ఎట్లాపోయిందోగదా..." అని ఆచారి ఓదార్చే సమయంలో, "నీ కోసం ఊళ్ళో పోలీసులు చెడ వెతుక్కుంటూవుంటే నువ్వు యీ డుండా వేమిటి?..." అన్నాడు గంగయ్య.

ఆచారి ప్రాణాలు-నిలువునా ఎగిరిపోయినవి. పోలీసులేమిటి, తనకోసర మేమిటి, వెతుక్కోవడ మేమిటి? ఈ అర్ధరూపాయి నాకు దొరికిందని వాండ్ల కెవరు చెప్పారు? ముచ్చెమటలుపోసి, లేచి నిలబడ్డాడు, ఆచారి.

"నా కోసరం పోలీసులు వెతకడ మేమిటి గంగయ్యా?"

"మీ ఇంటిప్రక్క జంగం కోటయ్య ఇల్లు పోలీసులు సోదా చేస్తున్నారు."






"ఎందుకు?"

"నీకు తెలుసుటుగా, ఈ సందుకట్ల జంగం కోటయ్య దొడ్లో వరలబావి కుంచుతుంటే, భూమిలో ముంతతో ముంతెడు బంగారు సవర్లు దొరికినా యటుగా?"

"ముంతెడు బంగారమే..." అని గుండెలు బాదుకొన్నాడు—ఆచారి.

"ఏమీతెలియనట్టే మాట్లాడుతావేం? మీ ఇంటిప్రక్కనేగా అది దొరికిందీ? ఇట్లా ఇట్లా కోటయ్యకి బంగారం నిధి దొరికిందని మునసబే పోలీసులకు రిపోర్టు చేశాడట."

"పోలీసులకు రిపోర్టు చేయడం ఎందుకు?"

"ఎందుకేమిటి? ఎవరికెక్కడెక్కడ ఏయే వస్తువు దొరికినా అవన్నీ సర్కారుకు చెందవలసిందేనట."

"అయితే గంగయ్యా, నా కో సందేహం, చెప్పూ... ఇప్పుడు నువ్వే ఉన్నావు. దారిన పోతుంటావు నీ కెక్కడయినా ఓ పేడో పావలో దొరుకుతుందనుకో. దాన్ని పోలీసుల కప్పగించవలసిందేనా?—"

"అట్లా అప్పగించ. లేదనేకదూ పోలీసులు కోటయ్య యిల్లు సోదా చేయడం?"

"సోదాలో బంగారం దొరికిందా?"

"దొరకలేదు. కోటయ్య నాకు దొరకలేదంటున్నాడు. నీవు చెప్పేది అబద్ధం, నిజం చెప్పుతావా చెప్పవా అని పోలీసులతన్ని చితకాచితకా చావగొట్టుతున్నారు."

"నా కోసరం పోలీసులెందుకు వెతుకుతున్నారు గంగయ్యా?"

"నీది పక్కయిల్లేగా. బంగారం సంగతి నీకు తెలియకుండా పోదని అన్నారు మునసబు కరణాలు—" అంటూ గంగయ్య వెళ్ళిపోయాడు.

తుఫాను రేగింది ఆచారి మనస్సులో. జేబు లో అర్ధరూపాయి అరవీసె బరువెక్కినట్టుంది — అర్ధరూపాయి!

ఊళ్ళోకి పోవడమా మానడమా? అక్కడ నిలవలేక పోతున్నాడు. లేచి వెళ్ళలేక పోతున్నాడు. అతనికి వెర్రి చూపులు పడిసై. అర్ధరూపాయి అక్కడ విసిరి పారేద్దామని బైటకి తీశాడు. అట్లా పారెయ్యడం అదొక నేరమౌతుందేమో. దొరికిన డబ్బెందుకు పారేశావని పోలీసులు చెవడా లెక్కదీస్తారేమో.

గబగబా రైలుకట్టదిగి రోడ్డెక్కాడు విసురుగా చేతులూపుకొంటూ బయలేరాడు. నాలుగురోడ్లు కలిసేకూడలి. పోలీసు జవాను నిలబడి రహదారి కంట్రోలు చేస్తున్నాడు. వేదాంతాచారి తల పైకెత్తి ధైర్యంగా పోలీసు జవాను కెదురుగా నడిచి వెళ్ళేడు. పోలీసు జవాను - ఒక చెయ్యెత్తి, రెండోచెయ్యి అడ్డంగా పెట్టి నిలబడ్డాడు. ఆచారి సమీపించాడు.

'నేనేమీ దొంగతనం చేయలేదు, దోపిడి చేయలేదు. వేణుగోపాల స్వామి ఆలయంలో నుంచి వస్తుంటే వీధిలో దొరికింది నాకీ అర్ధరూపాయి. దీని కామందెవరో అని నేను చెడ వెదికాను. మీరే విచారించి, యీసొత్తు ఎవరిదో వారి కిప్పించం'డని అర్ధరూపాయి తీసి పోలీసు జవాను చేతిలో పెట్టేడు — ఆచారి.

గుప్పిడిమూసి... 'ఫో, ఫో ... తొందరగా ఫో, మోటార్లు వస్తున్నవి. అడ్డులే' ... అని తరిమిగొట్టాడు — పోలీసు జవాన్.

పెద్ద నిట్టూర్పు విడిచాడు ఆచారి. బ్రతుకు జీవుడా అనుకొన్నాడు. జేబు ఖాళీ అయిపోయింది. శరీరం తేలికయింది.

ఇంటికివచ్చి, లోపల అడుగుపెట్టి పెట్టడంతో,— 'ఏమండీ, సబ్బుబిళ్ళ తెచ్చారా?'—అని భార్య అడిగింది.

'సబ్బుబిళ్ళేమిటి?'— తెల్లబోయాడు ఆచారి.

'వొళ్ళు రుద్దుకొనే సబ్బయిపోతే, మీరు వచ్చేటప్పుడు బజారికిపోయి ఓ బిళ్ళ తీసుకొని రావలసిందని అబ్బాయిచేత అర్ధరూపాయిచ్చి దేవాలయంలో మీరున్నారంటే పంపేను. మీకివ్వలేదూ?'

' నాకివ్వలేదే!"

'అబ్బాయీ, నీకిచ్చిన అర్ధరూపాయేంచేశావురా?— అని అడిగింది తల్లి.

'అర్ధరూపాయి కాసు చేతిలో పెట్టుకొని నేను దేవళం కాడికి పోయేవరకు, అక్కడ గూటీబిళ్ళ ఆడుకొనేపిల్లకాయలు పరుగెత్తుతూ వచ్చి నామీద పడ్డారే అమ్మా, నేను కింద పడిలేచి చూచుకొంటే, చేతిలో అర్ధరూపాయి అగుపించలేదే?' ... అంటూ బావురుమన్నాడు పదేళ్ళ కొడుకు. □□□

'భారతి' మొదలైన సుప్రసిద్ధ మాసపత్రికలలో అనేక కథలు ప్రచురించి లబ్ధప్రతిష్ఠులై, కొన్నాళ్ళక్రిందట కీర్తిశేషులైన శ్రీ 'కరుణ కుమార' రచించిన ఆఖరి అముద్రిత కథ ఇది.



# సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

( గతసంచిక తరువాయి )

"అబద్ధం—కాదు—కాదు— అబద్ధం—' జయంతి హఠాత్తుగా బామ్మ వైపు పరుగెత్తబోయింది.

'జయంతీ!' దానికోసమే చూస్తున్నట్టు శేఖరం ముందుకు వచ్చి జయంతిచేతిని గట్టిగా పట్టుకున్నాడు.

'వదలండీ! నన్ను వదలండి. మీరు చెప్పింది అబద్ధం' అంటూ జయంతి బలంగా పెనుగులాడి అతని చేతిని వదిలించుకుని వెళ్ళి బామ్మగారి మీదపడి యేడవసాగింది.

డాక్టరు ఇవతలకి వచ్చేస్తుండగా "ఎవరు వాళ్ళు, మీ చుట్టాలా?" అని అడిగాడు.

"అవును. మా అమ్మకి ఆవిడ పింతల్లి—కొద్దిరోజులక్రితమే తెలిసింది. తెచ్చి దగ్గర పెట్టుకున్నాను" అన్నాడు శేఖరం పరధ్యాసగా.

"అలాగా! అయితేకావలసినవాళ్ళే నన్నమాట" అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

అతన్ని పంపించేసినతర్వాత శేఖరం ఒక నిమిషంపాటు వరండాలో ఆగిపోయాడు. లోపలనుంచి జయంతి యేడుపు హృదయవిదారకంగా విన్పిస్తోంది. ఆవిడ ఎన్నోసార్లు జయంతికి యీ విషయం చెప్పేస్తానంటే తనెందుకు వారించాడు? ఏ శనిదేవత తన నాలుకమీద కూర్చుని ఆ మాట అన్పించింది? ఇప్పుడు చెబితేమటుకు జయంతినమ్ముతుందా? అయినా ఎంత హాస్యాస్పదంగా వుంటుంది! అసలే అనుకోకుండా జరిగిన ఒకటి రెండు సంఘటనలతో జయంతికి తనమీద నమ్మకంపోయింది. బంధుత్వంద్వారా కాకుండా తన వ్యక్తిత్వంద్వారా ఆమెకి దగ్గరవాలని ఆశించాడు.

శేఖరం మెల్లగాలోపలికివచ్చాడు. బామ్మగారి శవాన్ని చూసేసరికి అతని కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగాయి. జయంతికి ఆ సుస్తీ రాకపోతే యీ బంధుత్వమే తెలిసేదిగాదు. ఈ కొద్దిరోజుల్లోమాతృత్వంలోని మధురిమని, నా అనేవాళ్ళు చూపించే అప్యాయతని చవిచూశాడు తను.

జయంతి కిష్టంవున్నా లేకపోయినా, యీ క్షణంనుంచి బాధ్యత తనది అనుకున్నాడు.

"నేనేం చెయ్యను బామ్మా! నేనేం చెయ్యాలి? ఎలా బ్రతకాలి? మాట్లాడు బామ్మా" జయంతి ఆవిడ గుండెలకేసి తలగొట్టుకుంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ ఓగరగా యేడుస్తోంది. ఇంతలో యెవరోవచ్చి బలంగా వున్న చేతులతో జయంతి భుజాలు పట్టి మెల్లగా బామ్మగారి నుంచి యివతలకి యెత్తారు. జయంతి తలెత్తి చూసింది. శేఖరం కళ్ళు జయంతి కళ్ళతో కలిశాయి. అతని కళ్ళు ప్రపంచంలో వున్న ఆప్యాయతని, జాలిని నింపుకున్నట్టు వున్నాయి.

"జయంతీ!" అతనికంఠంలో, బాధ స్పష్టంగా కన్పిస్తోంది.

"బామ్మని వదిలి నేనెలా వుండగలను" రెండు చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది.

"నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి." శేఖరం జయంతి తలని దగ్గరకి తీసుకుని గుండెలకి హత్తుకున్నాడు. ఏం చెప్పటానికి అతనికి కూడా మాటలు పెగలటంలేదు. జయంతి పైకి యేడుస్తోంది. అతను మనసులో యేడుస్తున్నాడు. అంతేభేదం.

"బామ్మా! యిది-యిది నిజం కాదని చెప్పండి. ఇంకో డాక్టరికి చూపించండి" అతని గుండెలకు అంటుకు పోయిన జయంతి వెక్కుతూ అంది.

ఓ గంట క్రితం యెవరైతే తనని నిర్లక్ష్యంగా చూస్తున్నాడని భుజాల మీద సూదితో గుచ్చి బాధ పెట్టాలనుకుందో అతనే యిప్పుడు బలంగా వున్న తన రెండు చేతులు పెనవేసి ధైర్యం చెబుతున్నట్టు పొదివి పట్టుకున్నాడని జయంతికి తెలియలేదు, గుర్తుకు రాలేదు.

● ● ●

బామ్మగారి దహన క్రియలు శేఖరం తన చేతిమీదుగానే స్వయంగా ముగించాడు. ఆవిడ పోయిందనే వార్త అందరికీ, ముఖ్యంగా వనితా విహార్ వాళ్ళకి అశనిపాతంలా తగిలింది. ఈ మరణంతో దిక్కులేని జయంతి శేఖరానికి మరింత దగ్గరై పోతుందనే భయం, బాధ యెక్కువైనాయి.

"ఇప్పుడేమిటి చేయటం?" అంది మిసెస్ కరుణాకరం.

"మనంవెళ్ళి చూసివద్దాం. మెల్లగా ఆపిల్లని మనలో కలుపు కోవటం మంచిది." అంది రేఖారాణి.

మిసెస్ కరుణాకరం సరేనంది. ఆవిడకి కావలసిందల్లా ప్రమీలతో రాజశేఖరానికి ఆ మూడు ముళ్ళు పడటం. తమకున్న ఆస్తితో అతనిఆస్తి పాస్తులు కలిసి పోవటం. ఎలాగైనా యీ వివాహం జరిపించే బాధ్యత నాది అని రేఖారాణి వాళ్ళకి వాగ్దానం చేసింది. జయంతి శేఖరం దగ్గర సెక్రటరీగా చేరిందని తెలిసిన రోజునే ఆవిడ రేఖారాణిని నిలవదీసింది. "ఆగు వుండనీ! యేం ఖర్మా

గేదు. నేను చెబుతున్నాను గదా! శేఖరానికి ఆ అమ్మాయిమీద జాలి తప్ప యింకేంలేదు. వనితావిహార్‌లో మిస్టర్ వర్మద్వారా జయంతికి జరిగిన అవమానం అతనికి తెలిసింది. ఆ కోపంతోనే ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో తనంతట తనే పిలిచి ఉద్యోగం యిచ్చాడు. దానికి మన మేమయినా అనుకుంటున్నట్టు బైటపడితే యింకొంచెం రెచ్చిపోతాడు. అందుకే జయంతి సెక్రటరీగా చేరిందన్న విషయం మనం అసలు గుర్తించనట్టు, గుర్తించినా పట్టించుకోనట్టు వుందా" మని చెప్పింది.

"అసలు ఆ మిసెస్ వర్మ యింటికి ఆరోజు ఆ అమ్మాయి వెళ్ళకపోతే యేగొడవా వుండేదికాదు. ఎప్పటికీ వనితావిహార్ సెక్రటరీగానే వుండిపోయేది." విసుగ్గా అంది మిసెస్ కరుణాకరం.

"అవును, కాని వ్యవహారం యింత దూరం పోతుందని యెవరికి తెలుసు? రాజశేఖరం యీ విషయంలో జోక్యం కల్పించు కుంటాడని మనం కల్లోనైనా అనుకున్నామా!" అంది రేఖారాణి.

"అవుననుకో — కాని యిప్పుడు మనం చేయాల్సిందేమిటి?"

చెప్పానుగా! మెల్లగా అ అమ్మాయిని మనలో కలుపుకున్నట్టు కలుపు

---

## "సెక్రటరీ"

### సీరియల్ - జరిగినకథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బామ్మ. జయంతికి వనితా విహార్‌లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాండ్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచి వాడు. అతని వద్ద ఉద్యోగం మొదట బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకోనడం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని ఆనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బామ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటి నుంచి వెళ్ళిపోవాలనుకుంటుంది. ఇంతలో ఆమె బామ్మ హఠాత్తుగా గుండెజబ్బు వచ్చి చనిపోతుంది.

---

కుని శేఖరంనుంచి దాటించాలి. రేపు వెళ్ళి చూసి పలకరించి వద్దాం."

"సరే!" మిసెస్ కరుణాకరానికి రేఖారాణి బుఱ్ఱ సామాన్యమైంది కాదని తెలుసు. దానిమీద నమ్మకం తోనే యింకేమీ అడగలేదు. శేఖరానికి ప్రమీలని యివ్వటానికి ఆటంకం కలుగుతుందేమో నన్న భయం సడలలేదు.

"మనతోపాటు సుమిత్రా దేవిని గూడా కలుపుకుందాం" అంది రేఖారాణి యేదో ఆలోచిస్తూ.

రేఖారాణి మర్నాడు ఫోన్‌చేసి సుమిత్రా దేవితో "మనం వెళ్ళి ఒకసారి జయంతిని చూసివద్దాం" అంది. ఆవిడకీ లోతుపాతులేం తెలియవు. "అవునవును. తప్పకుండా వెడదాం" అంది. ఈ మధ్య శేఖరం వనితా విహార్ విషయాలపట్ల చాలా అశ్రద్ధ కనబరుస్తున్నాడు. అది జయంతిని తీసెయ్యటంవల్లనేమోనని ఆవిడ అనుమానం. జయంతిమీదఅతని కేమాత్రం ఆసక్తివుందని తెలిసినా తను ఆఅమ్మాయిని వదిలేదా! పోనీ ఈ రూపేణా మళ్ళీ కలుపుకోవటం మంచిది అనుకుంది.

జయంతిని చూడటానికి వెళ్ళాలి అనుకున్న యీ ముగ్గురిలో మనసులో యెవరికి వాళ్ళకే వాళ్ళనిగురించిన స్వార్థపు టాలోచనలు వున్నాయి. కాని అవి యేమాత్రం బైటపడకుండా యెదుటివాళ్ళ మాటని మన్నిస్తున్నట్టు మాట్లాడుతున్నారు.

● ● ●

...వాళ్ళంతా వచ్చేసరికి అదృష్ట వశాత్తు యింట్లో శేఖరం లేడు. జయంతిదగ్గర సునంద, శివరామ్ వున్నారు. వాళ్ళని చూస్తూనే జయంతి కళ్ళు వెడల్పయినాయి. సునంద జయంతివైపు చూసింది. శివరామ్ లేచి సవినయంగా ఆహ్వానించాడు.

అందరూ కూర్చున్నారు. అంతటా నిశ్శబ్దం. ఎవరికి యేం మాట్లాడాలో తోచటంలేదు.

చివరికి రేఖారాణి తనే "పాపం! మీకు బామ్మ తప్ప యింకెవరూ లేనట్టున్నారు. అది చాలా విషాదమైనసంగతి" అంది. జయంతి కళ్ళు వాలిపోయినాయి.

"అసలు గుండె జబ్బని మాట మాత్రం మా కెవరికి తెలిసినా యెవర్నయినా మంచి డాక్టర్‌కి చూపించే వాళ్ళం. మా చుట్టాల్లోనే గుండెకి సంబంధించిన స్పెషలిస్ట్ ఒకాయన వున్నాడు" అంది మిసెస్ కరుణాకరం.

"ఇంత చిన్నవయసులో—ఇలాంటి బాధ లొస్తే మనసు మోడుబారిపోతుందికూడా! ఐనా నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి" అంది సుమిత్రా దేవి.


"అబ్బ! నీ స్థితిలో మా ప్రమీలని వూహించుకుంటే నా గుండె బద్దలై పోతుంది" అంది మిసెస్ కరుణాకరం.

"ఏమిటో అంతా ఆ భగవంతుని మాయ! ఓసారి ఆలోచిస్తే యీ ప్రపంచంలో యెవరికి యెవళ్ళు అనిపిస్తుంది" సుమిత్రా దేవి.

"నువ్వు మరీ యిలా వంటరిగా వుండటం మంచిదిగాదు. కాస్త అప్పుడప్పుడు అలా మా యిళ్ళకేసి








వస్తూండు. మనుష్యుల్లో పడ్తే కాస్త మనసు తేరుకోవచ్చు." రేఖారాణి.

జయంతికి తన చెవులు తనకే మోసం చేస్తున్నాయేమోననే భ్రమ కలిగింది. వాళ్ళు చాలాసేపు కూర్చున్నారు. అందరిలోకీ యెక్కువగా రేఖారాణి మాట్లాడింది. శివరామ్ మధ్య మధ్యలో జవాబులిచ్చాడు. జయంతి, సునందా వింటూకూర్చుండిపోయారు.

వాళ్ళు "చాలా టైమైంది" అంటూ లేచి వెళ్ళబోతూ మళ్ళీ తప్పకుండా వచ్చి వాళ్ళందరితో కలవమని యింకోసారి గట్టిగా చెప్పి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత గుమ్మందాకా సాగనంపి వెనక్కి తిరిగి వస్తున్న శివరామ్ "మీమీద హఠాత్తుగా యింత ఆపేక్ష వచ్చేసిం దేమిటి వీళ్ళకి?" అన్నాడు నవ్వుతూ.

"అదే నాకూ అర్థంగావటంలేదు" అంది జయంతి.

"వీళ్ళని చూస్తుంటే చాలా మంచి వాళ్ళు లాగానే అన్పిస్తున్నారే" అంది సునంద.

"పయోముఖ విషకుంభాలు. వాళ్ల మాటలు నమ్మకండి. ఈ రావటంలో తప్పకుండా యేదో యెత్తు వుండి వుంటుంది. బైట వీళ్ళు జయంతి పేరిట యెంతెంత ప్రచారాలు యెంత అసహ్యంగా చేస్తోందీ నాకు తెలుసు" అన్నాడు తీవ్రంగా.

'అలాగా !' అంది సునంద తగ్గుతూ.

'పోనీండి నన్నేం చేస్తారు వాళ్ళు' జయంతి వుదాసీనంగా అంది—బామ్మ గారి మరణం అసలు ఆమె ఆలోచన్ల మీదనే వేదాంతపు తెర దింపేసింది.

ఈ కాస్త జీవితానికి యిన్ని కాట్లాటలా! జనన మరణాల మధ్య అత్యంత అల్పమైన యీ జీవిత బుద్బుదం కోసం ఆశానిరాశల మధ్య యింత వూగిసలాటా? ఛీ! ఛీ! దేని కోసం బాధపడకూడదు. దేనికోసం దిగులు పడకూడదు. మనసుకి నేర్పిన పాఠాన్ని వల్లె వేసుకుంటోంది జయంతి.

శివరామ్ వెళ్ళబోయేముందు అదోలాకూర్చున్న జయంతినిచూస్తూ 'మీరు ధైర్యం తెచ్చుకోవాలి. మరీ యిలా జారిపోకూడదు' అన్నాడు.

'నేను ధైర్యంగానే వున్నానుగా! చూడండి. లేకపోతే—' వాక్యం పూర్తిచెయ్యకుండానే పేలవంగా నవ్వేసింది.

'ఉన్నానంటే సరిపోతుందా! ఉందీ లేందీ మీ మొహం మాకు చెప్పటంలా !' అని క్షణంసేపు ఆగి 'ఏమిటండీ! మనలో యెవరు శాశ్వతం! మీరు శాశ్వతమా! నేను శాశ్వతమా! మనమే కానప్పుడు ఇంకోళ్ళ కోసం బాధపడటం యెంత వెర్రితనం! కాబోతే మీకు ఆవిడలేని లోటు బాగా తెలుస్తుంది. అది నేనూ ఒప్పుకుంటాను. కాని ఆ లోటు భర్తీచేసుకోటానికి మార్గం చూసుకోవాలి. అదీ మీరు చేయాల్సిన పని. కనీసం ప్రయత్నంచేసి చూడండి' అన్నాడు.

అతను వెళ్ళిపోయింతర్వాత అంత వరకూ బొమ్మలా బిగబట్టుకుని కూర్చున్న జయంతి ఒక్కసారి వెక్కి వెక్కి యేడవటం మొదలుపెట్టింది.

'ఛీ—ఛీ! ఏమిటది? పిచ్చి దానిలా—అదుగో! వాళ్ళు చెప్పిందంతా అప్పుడే మర్చిపోయావా?' అంది సునంద జయంతి తలని ఒళ్ళోకి లాక్కుంటూ.

జయంతి సమాధానం చెప్పలేదు. చాలాసేపయింతర్వాత సునంద మరో సారి కేకలు వేయటంతో దుఃఖాన్ని నిగ్రహించుకోటానికి ప్రయత్నిస్తూ 'లేదు సునందా! కాని—కాని, నే నెక్కడుండాలి? ఏం చెయ్యాలి? ఎవరికోసం బ్రతకాలి చెప్పు—' అంది అస్పష్టంగా.

'ఎవరికోసం బ్రతకటం అనేది అర్థంలేనిప్రశ్న. ఎక్కడుండాలి అనేది ప్రస్తుతం అనవసరమైన ఆలోచన. ఏం చెయ్యాలి అంటే, కాని—కొద్ది రోజులు పోనీ—చూద్దాం' అంది సునంద.

'నే నెక్కువరోజులు ఇక్కడుంటే యేం బాగుంటుంది?'

సునందకి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. అవును నిజమే! అవివాహితుడైన శేఖరందగ్గర వంటరిగా యెక్కువరోజు లుంటే యెలాగుంటుంది? ప్రపంచం ఏమనుకుంటుంది! అదేం అతను ఆలోచించటంలేదా? ఒకవేళ ఆలోచించినా జయంతి పరిస్థితులపట్ల జాలితో పట్టించుకోవటం లేదా?






'పోనీలే! నువ్వు కొంచెం తేరుకునేవరకూ మా యింట్లో నా దగ్గిర వచ్చి వుంటావా పోనీ—' అంది.

జయంతి సమాధానం యివ్వలేదు.

శేఖరం వచ్చేవరకూ వుంది సునంద. బామ్మగారి మరణంతో వాళ్ల కుటుంబం అతనికి బాగా దగ్గరగా వచ్చింది. సునంద భర్తకి శేఖరం అంటే మొదటి చూపులోనే సదభిప్రాయం యేర్పడింది.

శేఖరం అప్పుడప్పుడు బైట పనుల మీద వెళ్ళాల్సి వచ్చినప్పుడు తిరిగి రావడం చాలా ఆలస్యం అవుతుంది. సునందకి అనుకున్నపుడు కబురు చేస్తాడు. అతను తిరిగి వచ్చేవరకూ సునంద జయంతి దగ్గరే వుంటుంది.

శేఖరం వచ్చేసింతర్వాత సునందని కారిచ్చి యింటికి పంపిస్తాడు. ఆ పంపేటప్పుడు అత్తగారికి పళ్ళు, పిల్లలకి బిస్కెట్స్ బుట్టనిండావుంటాయి.

'ప్రతి రోజూ యేమిటండీ యివన్నీ—' శేఖరం యిచ్చినవి తీసుకోటానికి బిడియ పడుతూ అంది సునంద.

'పర్వాలేదు లెండి. ఇంటికి వెళగానే పిల్లలు యెదురు వస్తారు. మీ రింతసేపు వాళ్ళని వదిలి పెట్టి వున్నారు.'

'నేను వెళ్ళేసరికి వాళ్ళు నిద్ర పోతారు. అయినా జయంతిని యీ సమయంలో యీ కాస్తయినా ఆదుకోవడం నావిధి అనుకుంటాను. జయంతి నాకు స్నేహితురాలు, అనే

సంగతి మీరు మర్చిపోతున్నారులా వుంది."

"లేదు. కాని ఒకరికి సహాయపడటంలో మనకి యిబ్బంది కలగకుండా చూసుకోవాలిగా!" అని కాసేపు ఆగి "ప్రస్తుతం ఆమెకి మీకంటే దగ్గర వాళ్ళెవరూ లేరు. మీరు సాధ్యమైనంతవరకూ ఆమెతో గడపటానికి ప్రయత్నించండి. దానివల్ల మీకే యిబ్బంది కలగకుండా చూడటం నావిధి అని నేను అనుకుంటాను," అంటూ పళ్ళబుట్ట డ్రైవర్ని కారులో పెట్టమని సునందతో "నా తృప్తి కోసం నేనేదో యిస్తుంటాను. దాన్ని మీరు కాదనకూడదు. పిల్లలకి మావయ్య పంపాడని చెప్పండి" అన్నాడు.

కారు వెళ్ళిపోయింది. శేఖరం లోపలికి తిరిగివచ్చాడు. జయంతి కూర్చున్న చోటనే అలాగే బొమ్మలా చలనం లేకుండావుంది.

"భోజనం చేద్దాంరా!" అన్నాడు శేఖరం.

"వద్దు."

"ఎందుకని?"

"నాకు ఆకలిలేదు."

"సరే నేనూ మానేస్తాను."

"మీరెందుకు మానెయ్యాలి!"

"నువ్వు తినకుండా నేనెలా భోంచేయాలి!"

జయంతి క్షణంసేపు అతని వైపు చూసి లేచివచ్చింది.



ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు.

"ఈరోజు సుమిత్రాదేవి వాళ్ళూ వచ్చారు" అందిఅన్నం కెలుకుతూ.

శేఖరం కనుబొమలు కొద్దిగా ముడిపడ్డాయి. కాని మొహంలో యేభావం కన్పరచకుండా "నెయ్యి కావాలా?" అని అడిగాడు.

"వద్దు"

"కూరవేసుకో—"

"వుంది చాలు"

"పోనీ పెరుగు వేసుకో—" పెరుగు తీసి జయంతి వద్దని వారించబోయే లోపలే ప్లేటులో గుమ్మరించేశాడు. కాని అది జయంతి తిననేలేదు. నంజుతూ కూర్చుంది.

భోజనాలైన తర్వాత పడుకోబోయేముందు

"నన్నెక్కడికైనా పంపించెయ్యండి" అంది.

"ఎక్కడికెడతావు?"

"ఎక్కడికైనా సరే!"

"ఈ యిల్లు తప్ప. అవునా—?" అన్నాడు శేఖరం.

జయంతి మాట్లాడలేదు. "పోనీ నువ్వు ఫలాన చోటని చెప్పు" అన్నాడు.

"సునందా వాళ్ళింటికి—"

"ఆయింట్లోనా! అంత చిన్న యింట్లో— ఆ గొడవలో— నాకిష్టం లేదు. నువ్వెళ్ళబోయే చోటు తప్పకుండా నీకు మనశ్శాంతి యిస్తుందని నాకు నమ్మకం కుదరాలి—"



"పోనీ హాస్టలయితే—" ఆలోచిస్తూ అంది.

శేఖరం చేతిలో పుస్తకంలోకి చూస్తుండిపోయాడు.

"కొద్దిరోజులు అక్కడుంటాను. తర్వాత యెక్కడైనా ఉద్యోగం దొరికితే—ఆ తర్వాత మెల్లగా—"

"జయంతీ! ఈ యింటిమీద నీకప్పుడే అంత అసహ్యం యేర్పడిందా? లేకపోతే నా మీద—" శేఖరం ఆగిపోయాడు.

"లేదు—లేదు—అసహ్యం నాకెందుకుంటుంది? పైనుంచి నాకు మీ రింత సహాయం చేస్తూంటే—" కళ్ళల్లో నీళ్ళు తిరిగిగాయి. వెంటనే దిండులో మొహం దాచేసుకుంది.

శేఖరం పుస్తకం మూసి ప్రక్కన పెట్టి లేచిదగ్గిరగా వచ్చాడు. "చూడు. కొద్దిరోజులు ప్రయత్నం చెయ్యి. ఈ యింటిలో వుండటంఅలవాటుచేసుకోగలవేమో!"

జయంతి మాట్లాడలేదు. పడుకుంది. తనకి నిద్రపట్టిందనితెలుసుకునేవరకూ అతను వెళ్ళడు. ఆ సంగతి జయంతికి తెలుసు. అంతవరకూ యెంత రాత్రయినాసరే అలా పడక్కుర్చీలో పడుకుని ఆ నీలిరంగు షేడ్ లైట్ క్రింద చదువుకుంటూనే వుంటాడు. అందుకే యీ రోజు కళ్ళుమూసుకుని నిద్రపోయినట్టు పడుకుంది. చాలాసేపయింతర్వాత అతను లేచి దగ్గిరగా వచ్చి చూశాడు. నిద్రపోయిందనుకుని తలక్రింద దిండు సరిచేశాడు. ఆ సరిచేసేటప్పుడు అతను నిట్టూర్పు విడవటం జయంతి గమనించకపోలేదు దుప్పటి కప్పి, లైటు తీసేసి తలుపులు శబ్దంగాకుండా దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే కళ్ళు తెరిచింది. ఎన్నాళ్ళిలా? మరో ఆడదిక్కు లేని యీ యింటిలో వంటరిగా యిన్నిరాత్రులు పవిత్రంగా గడిపారంటే లోకం నమ్ముతుందా! శేఖరం తనతోపాటు వుండటానికి మరెవర్నయినా తీసుకురావటానికి యెందుకు ప్రయత్నం చెయ్యడు? అసలటువైపు ఆలోచించనట్టు— పట్టించుకోనట్టువుంటాడేం? కళ్ళముందు కన్పిస్తున్న యీ చీకటిలా, శూన్యంగా వున్న జీవితంలోకి వెలుగు యెలా తెచ్చుకోవాలి! ఏం చెయ్యాలి? కళ్ళు కాస్త తెరిస్తేచాలు పెద్ద పెద్ద కోరలతో, కత్తుల్లాటి కొమ్ములతో, భయంకరంగా, వికృతంగా వున్న మృత్యువులాటి దేదో మీదికి వురకటానికి పొంచి కూర్చున్నట్టు అన్పిస్తుంది. కదలాలంటేనే భయం. ఒంటరిగా పడుకోటానికి అలవాటులేని జయంతికి అర్థంగాని భయంతో శరీరంలో రక్తం చల్లబడ్డట్టు, బిగుసుకుపోతున్నట్టు అనిపించసాగింది. ఛీ!—ఛీ! ఏమిటీ ఆలోచనలు! మరీ చిన్నపిల్లలాగా! ఈ కాస్తకే భయపడితే ముందు ముందు జీవితం అంతా వంటరిగా యెలా గడపాలి? ధైర్యం తెచ్చుకుంటూ నిద్రపోయింది.

అంతా అడివి. చుట్టూ, సూర్య

కిరణాలని చొరనీయకుండా దట్టమైన శాఖలతో పెద్ద పెద్ద వృక్షాలు. వాటి నిండా కొమ్మలకి కరుచుకుని వేళ్ళాడుతున్న భయంకరమైన పాములు ఎవరి కోసమో వెతుక్కుంటూ వచ్చిన జయంతి యీ అడివిలో దారితప్పి పోయింది. ఏం చెయ్యటానికీ పాలు పోవటంలేదు. భయంతో ప్రాణాలు బిగుసుకు పోతున్నాయి. ఇంతలో దూరంనుంచి యెక్కడినుంచో "జయంతీ!" అన్న బామ్మ కేక విన్పించింది. "బామ్మా!" బిగ్గరగా అరుస్తూ అటువైపు పరుగెత్తసాగింది. చెట్లకి వేళ్ళాడుతున్న పాములు తోకలతో జయంతిని కొట్టాలని చూస్తున్నాయి. అకారణంగా తనమీద వాటి కెందుకంత కోపం!

"జయంతీ!" మరోసారి కేక విన్పించింది.

"బామ్మా!" శబ్దంవచ్చినవైపు పరుగెత్తుకొచ్చిన జయంతి హఠాత్తుగా అంతదూరంలో ఆగిపోయింది. ఎదురుగుండా బామ్మకి బదులు పెద్ద సింహం కూర్చుని గడ్డం దువ్వుకుంటోంది.

"వచ్చావా! రా! నీ కోసమే చూస్తున్నాను." అచ్చు బామ్మకంఠంతో పిలుస్తోంది.

"అయితే—అయితే—నన్ను పిలిచింది—నువ్వా?"

"ఔను. నేనే. నాకు చాలా ఆకలి అవుతోంది" అంది సింహం.

జయంతి వెనక్కి వెనక్కి అడుగులు వేయసాగింది. సింహం లేచి ముందుకు వస్తోంది.

"నువ్వు—నువ్వు—"

"అర్థంగాలేదా? సింహానికి ఆకలవుతోంది అంటే నీకుతెలియడంలా? జాగ్రత్త! యింకో రెండడుగులు వెనక్కి వేస్తేయెక్కడుంటావో వెనక్కి తిరిగి చూసుకో." సింహం హెచ్చరించటంతో వెనక్కి తిరిగి చూసింది. వెనక పెద్ద అఘాతం! కళ్ళు తిరిగాయి. మళ్ళీ సింహంవైపు చూసింది.

"ఇప్పు డెక్కడికి వెడతావు?" వెకిలిగా యికిలించింది సింహం.

"వద్దు—వద్దు—" రెండుచేతులు జాపి వద్దన్నట్టు యేడవసాగింది.

"ఏడిస్తే నాకేం జాలికలగదు. నేను సింహాన్ని—" సింహం మీదకి వస్తోంది. ఖంగారుతో, భయంగా వెనక్కి అడుగులు వేసింది. అప్పుడు గుర్తుకొచ్చింది—అఘాతం వుందని! అప్పటికే కాళ్ళక్రింద భూమి లేదు. శరీరం గాలిలో తేలిపోసాగింది. భయంతో కెవ్వుమంది. ఈ లోపలే—అఘాతంలో పడకముందే ఎవరో రెండుచేతులూ జాపి బలంగా పట్టుకున్నారు. జయంతి యీసారి మరింత బిగ్గరగా కెవ్వుమంది.

"జయంతీ-జయంతీ" శేఖరం ఆదుర్దాగా పిలుస్తున్నాడు.

"వదులు-వదులు—ఎవరు-ఎవరు—" కలో, మెలకువో అర్థంకానిపరిస్థితిలో పెనుగులాడుతూ అంది.

"జయంతీ!" శేఖరం చేతులు ఉక్కు కడ్డీల్లా కదలకుండా బంధించటంతో అప్పటికి మెలకువ వచ్చింది.



అంత భయపడుతున్నా వేమిటి?" ఆదుర్దా నిండిన స్వరంతో అడుగుతున్నాడు అతను. ప్రక్కన నిలబడి నికృతంగా నవ్వుతున్న సింహం మెల్లగా క్రమేపి అదృశ్యమై గదిలో నీలంరంగు కిటీ గా మారింది.

"మీరు—మీరు—" ముఖంనిండా పట్టిన చెమటలతో, బెదురుతున్న కళ్ళతో అస్పష్టంగా అంది.

"ఏమిటిది? కలేమైనా వచ్చిందా?" జయంతి తలని దగ్గరకి తీసుకుని గుండెలకి అన్చుకుంటూ అన్నాడు శేఖరం.

"అవును. అవును. అబ్బ, ఎంత భయం వేసింది!" జయంతి గుండెలు యింకా దడదడా కొట్టుకుంటూనే వున్నాయి.

"ఏం కల అది? ఎంత బిగ్గరగా కెవ్వుమన్నావో తెలుసా?"

"మీనిద్ర చెడగొట్టానా?" నీరసంగా అంది.

"లేదు. నేనింకా నిద్రపోలేదు. ఇప్పుడిప్పుడే పట్టోంది. నీ కేకలువిని పరుగెత్తుకొచ్చాను. ఇంకా నయం. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి కాబట్టి సరిపోయింది." జయంతి నుదుటినిండా పట్టినచెమటని మెల్లగా తుడుస్తూ అన్నాడు.

"చాలా భయం వేసింది. అసలు చీకటిని చూస్తేనే భయంగావుంది"

"నాకు చెప్పలేదేం? ఇకనుంచి అల్లవార్లూ లైటు వుంచుతాన్లే—"

జయంతి మాట్లాడలేదు. కలనిగురించే ఆలోచిస్తోంది మనసు.

"ఏం కల అది? చెప్పు"

"పెద్ద అడివి-అడివిలో చెట్లకి పెద్ద పెద్ద పాములు వేళ్ళాడు తున్నాయి."

"అవి నిన్ను కరిచాయా!"

"లేదు. ఇంతలో బామ్మ పిలుపు విన్పించింది."

"బామ్మా!"

"అవును"

"పిలిస్తే?"

"నేను పరుగెత్తుకుంటూ వెళ్ళాను. కాని అక్కడ బామ్మకి బదులు పెద్ద సింహంవుంది." చెబుతుంటే నే జయంతి వళ్ళు భయంతో జలదరించింది. ఆ జలదరింపును గుర్తించిన శేఖరం చేతులు మరింత దగ్గరికి తీసుకుని పొదివి పట్టుకున్నాయి.

"అప్పుడేమైంది? అది నీ మీదకి వురికిందా?"

"ఉహు. దాన్నిచూసి భయపడి నేను వెనక్కి వెనక్కి నడుస్తున్నాను. వెనకేముందో చూసుకో ఓసారిఅంది. నేను వెనక్కి తిరిగి చూశాను." శేఖరం వింటూండి పోయాడు.

"వెనక యింకో రెండడుగులువేస్తే పెద్ద అఘాతం వుంది. దాన్ని చూస్తేనే కళ్ళు తిరిగాయి. వెనక్కి తిరిగి సింహంవైపు చూస్తే అది నా మీదకి వస్తోంది. నేను వెనక్కి అడుగులు వేస్తూనే వున్నాను. అందులో పడిపోయాననే అనుకున్నాను. కాని

యెవరో బలంగా పట్టుకుని ఆపారు." గబగబా చెబుతున్న జయంతి వూపిరి పీల్చుకోడంకోసం ఆగింది.

"ఎంత చిత్రమైన కల!" అన్నాడు శేఖరం.

"ఇంకా చిత్రం యేమిటంటే—ఆ చేతులు—యిప్పుడు మీరు—మీరిలా పట్టుకున్నట్టే వున్నాయి."

ఈ మాటలు వింటూనే జయంతి భుజాల చుట్టూవున్న శేఖరం చేతులు అనుకోకుండా గట్టిగా బిగుసుకున్నాయి.

జయంతి మాట్లాడటం మానేసింది. శేఖరం ఆలోచిస్తూండి పోయాడు. ఉక్కు కడ్డీల్లావున్న అతని చేతుల మధ్య అలావుంటే అదేదో పెద్దకోట గోడమధ్య వున్నట్టుగావుంది. అతని ఛాతీని ఆనుకునివున్న జయంతి చెవికి నిశ్చలంగా కొట్టుకుంటున్న అతని గుండె క్రమబద్ధంగా వినిపిస్తోంది. అదలా వింటుంటే చాలా నిబ్బరంగా, నిశ్చింతగా వుంది. అలాగే అతని చేతుల మధ్య నిద్ర పోనిస్తే బాగుండు ననిపించింది. కాని అతనిదేం తెలియనట్టు మెల్లగా జయంతిని జరిపి దిండుమీద తల పెట్టాడు.

"జయంతీ! ఇది చెప్పు. మొట్టమొదటిసారి వనితావిహార్‌లో మనం కలుసుకున్నప్పుడు కుర్చీమీద వాలిపోయివున్న నిన్ను లేపబోతే నాచేయి గట్టిగా రెండుచేతులతోపట్టుకున్నావు, గుర్తుందా!" జయంతి గుర్తున్నట్టు తలూపింది. అవును! ఎంత చిత్రం! అప్పుడు వంటరిగా దిగులుగా వున్న తనమీదకి వంగి ఎవరో "నీవు కావాల్సి, కావాలిజయంతీ"అన్నట్టువిన్పించింది. కళ్ళు తెరిస్తే యెదురుగుండా రాజశేఖరం! అప్పటిరాజశేఖరం, యిప్పుడు యీక్షణంలో యెదురుగుండా నిలబడిన యీ రాజశేఖరం, అచ్చు ఒకలాగానే వున్నారు.

"చెప్పు! అప్పుడు కూడా నీకీ కల వచ్చిందిగదూ!"

"ఏమిటుది?"

జయంతి మాట్లాడలేదు.

"చెప్పు. గుర్తులేదా?"

గుర్తు లేదన్నట్టు తలూపింది.

"వచ్చిన కల ప్రతిదీ నిజం కాకపోయినా, కొన్ని సంఘటనలు భవిష్యత్‌లో జరగబోయేవి వాటికి సూచనలుగా కన్పిస్తుంటాయి. జయంతీ! నువ్వు నాకొకటి వాగ్దానం చెయ్యాలి."

ఏమిటన్నట్టు చూసింది.

"ముందు ముందు జరగబోయే జీవితంలో నీ కెలాంటి విసుగుకలిగినా నువ్వు నా నీడని వదలగూడదు. వదలనని వాగ్దానం చెయ్యి."

శేఖరం చేయిజాచాడు. క్షణం సేపు అతనివైపు పరీక్షగా చూసిన జయంతి మెల్లగా చేయితీసి అతని చేతిలో వుంచింది.

"నాకు సాధ్యమైనంతవరకూ నీకే నొప్పి కలిగించకుండా వుండటానికి





జాగ్రత్త పడతాను. ఒకవేళ నాకు తెలిసో, తెలియకో నీ కేదయినా బాధనిపిస్తే నేరుగా వచ్చి నా ముఖం మీద అడిగెయ్యి. అడిగేస్తావుకదూ!"

జయంతి సమాధానం చెప్పలేదు. శేఖరం తన చేతిలోవున్న పచ్చటి అరచేతిని పరిశీలిస్తూ "పోనీ—సుభద్రా వాళ్ళని మనింట్లో వచ్చి వుండమంటే?" అన్నాడు.

"వాళ్ళందర్నినా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఔను. బొమ్మ స్మృతినుంచి నిన్ను తప్పించాలంటే నీ మనసుని బాగా సందడిలో—గందరగోళంగా వుంచాలి. అందుకే వాళ్ళు మనింటికి వస్తే బాగుంటుందేమోనని అనుకుంటున్నాను. సునంద భర్త చాలా మంచివాడు. నమ్మకస్తుడుగా కన్పిస్తున్నాడు."

జయంతి శేఖరం కళ్ళల్లోకి చూస్తూండిపోయింది.

"నే నింతక్రితం నిద్రపోయేవరకూ దీన్ని గురించే ఆలోచిస్తున్నాను. వాళ్లు మనింట్లోవుంటే నీకు సందడిగానూ వుంటుంది. వాళ్ళకి సుఖంగా ఉంటుంది. నాక్కూడ నిశ్చింతగా కూడా అన్పిస్తుంది."

"కాని—కాని—"

"నా కేదైనా యిబ్బంది కలుగుతుందనేగా నీ అనుమానం? లేక ఎవరైనా ఏమైనా అనుకుంటారనా? నాక్కావలసింది నీ మనశ్శాంతి. నువ్వు మళ్ళీ మామూలుమనిషివి కావటం. అంతే."

జయంతికి యీ అభిప్రాయాన్ని బలంగా వ్యతిరేకించా లనిపించింది. కాని, యేం చెప్పాలో, యెలా చెప్పాలో తెలియలేదు. అయినా ఒకసారి నిర్ణయానికి వచ్చాడంటే అది మార్చడంఅనేది అంతసులభంకాదు. ఆ సంగతి జయంతికి తెలుసు. అప్పటికి మౌనంగా వూరుకుండిపోయింది.

జయంతి నిద్ర పోయిం తర్వాత శేఖరం లేచివచ్చి పడక్కుర్చీలో పడుకున్నాడు.

"ఇలాఎన్నాళ్ళు? పోనీ జయంతిని పెళ్ళి చేసేసుకుంటే?" అనిపించింది. కాని వెంటనే మనసు "వద్దు వద్దు. ఇప్పట్లో అలాటి తెలివి తక్కువపని యెప్పుడూ చెయ్యకు. ఆమె మనసు పూర్తిగా నీమీద లేదని తెలుసుకుని కూడా నువ్వు పెళ్ళిచేసుకుంటే? అనటం యేం బాగాలేదు. అదను చూసుకునిఆదుకున్నాను అనేనెపంతో ఆలోచించేందుకు అవకాశం యివ్వకుండా బంధించేశావని జయంతి ముందు ముందు నిన్నపార్థం చేసుకోవచ్చు. ఎంతకాలం అయినాసరే! ఆమె మనసులో నీపట్లగల దురభిప్రాయాలు తొలగిపోనీ! నీకు చాతనైతే సాధ్యమైనంత త్వరలో ఆ మాలిన్యం కడిగేసేందుకు ప్రయత్నించు. అంతేగాని—వివాహంమాట తలపెట్టకు, అపార్థాలతో మొదలైన వివాహాలు అనర్థాలకి దారితీస్తాయి. అందులో అశాంతి తప్ప సుఖం వుండదు." అని గట్టిగా హెచ్చరించింది. "అదిగాకుండా జయంతిలో వయసు వికసించినా మనసు వికసించలేదు.

పసితనం పూర్తిగా పోలేదు. ఇందాక నువ్వు అంత దగ్గరగా అంత గట్టిగా హృదయానికి హత్తుకున్నావు! అప్పుడు నీవైపుచూసిన ఆమొహంలో స్త్రీ పొందుతున్న గగుర్పాటుకాని— అనుభూతికాని నీ కేమైనా కన్పించిందా! వద్దు. వద్దు. పొరబడుతున్నావు. నీకు చాతనైతే సున్నితంగా ఆమెలో స్త్రీత్వాన్ని మేల్కొలిపే వుపాయాలు చూసుకో—' అంటూ వివేకంగూడా వంత పాడింది.

● ● ●

'జయంతీ! ఏమిటిది? శేఖరం మావారిని పిలిచి మీరంతా కుటుంబంతోసహా వచ్చి మాయింట్లో వుండండి అన్నట్టు మాట్లాడాడుట!' అంది సునంద మర్నాడు సాయంత్రం.

'ఆయనకి మతిపోయింది' పళ్ళ బిగువున వచ్చింది సమాధానం.

'అంటే?' అర్థంగానట్టు చూసింది సునంద.

'ఏంలేదు సునందా! నేనువచ్చి మీయింట్లో వుంటానంటే, వద్దని— మీ అందర్నీవచ్చి యిక్కడ వుండమంటున్నాడు. నాకు సందడి కావాలిట?అదీ ఆయనగారిఉద్దేశ్యం. జయంతి సునంద చేతిమీద చేయి వేస్తూ' సునందా! అతను నన్నేదో మనిషిని చేయాలనే ఉద్దేశ్యంతో యేవేవో వూహిస్తున్నాడు. అవన్నీ మీరు పట్టించుకోవద్దు. అతనికి లోకంతో లెక్క లేకపోవచ్చు. కాని మనం యెలా లెక్క చెయ్యకుండా వుండగలం! అంతా యేమనుకుంటారు? ఇదంతా మనిద్దరి ప్లాన్ అనుకోరూ!'

"ఏమిటీ నీ ఉద్దేశ్యం? అతను అడిగినంత మాత్రాన మేం వచ్చేసి వుంటామనే అనుకుంటున్నావా నువ్వు.' వెనక్కి తగ్గుతూ అంది సునంద.

'లేదులే! కాని మీ ఆయన శేఖరం మాట కాదనలేక ఊ! అనేస్తాడేమోనని నా భయం.'

'అలాటి భయాలు నీకేమీ అవసరం లేదులే. నీకు సందడి కలిగించాలని అదుకోవాలని అనుకుంటే మా యింటికే తీసుకెడతాం. ఉన్నంతలో చూసుకుంటాం. అంతేగాని—'

'నాకెక్కడికీ రావాలని లేదు సునందా! ఇక్కడుండాలనీలేదు. మెల్లగా అతన్ని ఒప్పించి ఏ హాస్టల్లో నైనాజేరి యిక్కడినుంచి తప్పించుకోవాలని నా ఉద్దేశ్యం. సాధ్యమైనంత త్వరలో అది జరిగి తీరుతుంది గూడా!'


'అది అంత సులభం అని నేను అనుకోను' అంది సునంద.

రెండు రోజుల తర్వాత భోజనాల దగ్గర శేఖరం తనే అన్నాడు. 'మనింటికి వచ్చి వుండటానికి సునందయే మాత్రం యిష్టపడటం లేదుట! ఏమిటీ అభ్యంతరం?'

'నాకెలా తెలుస్తుంది!'

'అందులో నీ ప్రమేయం ఏమీ లేదా అని అడుగుతున్నాను.'






'వుంటేమటుకు తప్పేముంది? అయినా! యిక్కడ నేనే వుండబోనప్పుడు—', జయంతి ఆగిపోయింది.

శేఖరం సూటిగా చూశాడు.

'నే నెక్కడికైనా హాస్టల్ కి వెళ్ళి వుంటాను' అంది అన్నం కెలుకుతూ.

శేఖరం మౌనం వహించాడు.

'హిమాయత్ నగర్లో వర్కింగ్ వుమెన్ హాస్టల్ వుందిట! అందులో—' జయంతి వాక్యం పూర్తి చెయ్యనేలేదు.

'జయంతీ! నీ కిదివరకోసారి చెప్పాను. హాస్టల్ కి పంపటంయిష్టం లేదని.'

'ఎందుకు?—'

'నువ్వందమైనదానివి. అమాయకురాలివి. సరేనా?'

జయంతి చురుగ్గా తలెత్తి చూసింది. శేఖరం మొహంలో పరిహాసం స్పష్టంగా కన్పిస్తోంది.

'నా కిష్టంవున్నా లేకపోయినా కొద్దిరోజులు నువ్వీయింట్లో వుండటం తప్పదు. అది బాగా తెలుసుకో—' భోజనం ముగించి చెయి కడుక్కోడానికి లేచి వెళ్ళిపోయాడు.

జయంతి రెప్ప వాల్చకుండా అన్నంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. ఏమిటీ అధికారం? ఎవరిచ్చారు! తను తిరగబడి మాట్లాడలేకపోతోందేం? మనసంతా కోపం నింపుకున్న జయంతికి కళ్ళనిండా నీళ్ళునిండి బుగ్గలమీదికి జారసాగినాయి.

శేఖరంలాటివాళ్ళు సాధారణంగా మాట్లాడరు. మాట్లాడితే అది అక్ష

రాలా నిజం అని రుజువు చేసుకుంటారు. సునంద యిష్టపడలేదు. ఎంత ప్రయత్నంచేసినా జయంతికి ఆ యింట్లోంచి బైటపడేమార్గం తోచలేదు. శేఖరం, సునందభర్తకి అంతక్రితం జయంతి చేసే ఉద్యోగం యిచ్చాడు.

సునందా వాళ్ళరాకపోకలు ఎక్కువైనాయి. వనితావిహార్‌వాళ్ళు చూపిస్తున్న ఆదరణగూడా అంతంలేకుండా వుంది. చీటికి-మాటికి యేదో వంకమీద జయంతిదగ్గరికి వాళ్ళు వచ్చి కూర్చుంటున్నారు. గంటలతరబడి జయంతి వినకపోయినా వాళ్ళ సోదేదో వాళ్ళు చెప్పుకుని వెడుతున్నారు. వాళ్ళ యిళ్ళలో జరిగే ప్రతి ఫంక్షనుకి జయంతిని పిలుస్తున్నారు. జయంతి నూటికి 99 సార్లు వెళ్ళకుండా తిరస్కరిస్తోంది. అదే చిత్రం! ఐనా వాళ్ళు పట్టించుకోవటంలేదు. "వాళ్ళకి కావాల్సింది మీరుకాదు. మీ ద్వారా శేఖరంగారు." ఓ సారి యీ గొడవంతా జయంతినోటినుంచి విని శివరామ్ నవ్వుతూ అన్నాడు. నిజమే. నవ్వింది జయంతి. మరింత అసహ్యంవేసింది.

● ● ●

ఉదయం 10 గంటలకి కామేశ్వరమ్మగారి దగ్గరకు వెళ్ళిన జయంతి సాయంత్రం నాలుగయేసరికి యింటికి వచ్చింది. వరండా మెట్లెక్కుతుండగా లోపల్నుంచి మాటలు విన్పించాయి.

"ఏం గవర్నమెంట్? ఏం అనకట్టలండీ! ఈరోజు చూసిన ప్రాజెక్టు తెల్లవారిచూస్తే ఒక్క సిమెంటుముక్కగూడా మిగల్లేదుట! ఇంజనీర్లంతా యిక్కడే ఎక్కడో కట్టామే అని తలలు గోక్కోవాల్సి వచ్చిందట! దేశం బాగుపడటమంటే యెలాబాగుపడ్తుంది! దరిద్రం తీరమంటే యెలా తీర్తుంది." ఎవరో ఆవేశంగా బిగ్గరగా అంటున్నాడు. శేఖరం యెవరితోనో మాట్లాడుతున్నట్టున్నాడు.

జయంతి పమిటతీసి భుజంచుట్టూ కప్పుకుని తల వంచుకుంటూ గబగబా లోపలికి వెళ్ళి పోబోయింది.

"జయంతీ! యిలారా!" హాలు దాటి లోపల అడుగు పెట్టేస్తుండగా శేఖరం వెనకనుంచి పిలిచాడు.

ఆగి వెనక్కి తిరిగింది. ఐదారుగురు ఆడవాళ్ళు-యిద్దరు మగవాళ్ళు వున్నారు.

"రా!" అని యింకోసారి పిలిచి 'యీమె—' అంటూ పరిచయం చేయబోయాడు.

"తెలుసులెండి. మిసెస్ శేఖరం"ఒకావిడ తెలిసినంతా ఒలకబోసింది. ఉలిక్కిపడ్డ జయంతి ఆవిడవైపు కోపంగా చూసింది. శేఖరం ఆవిడ పొరపాటును కరెక్ట్ చెయ్యకుండానే "వీళ్ళంతా వరదబాధితుల సహాయార్థం విరాళాలు పోగుచేస్తున్నారుట— ఇదిగో యీమె సరస్వతీ రామన్—" నల్లగా పొట్టిగా అడ్డంగావున్నావిడని చూపించాడు. జయంతి నమస్కారం చేసింది. ఆవిడలేచి ప్రతి నమస్కారం చేస్తూ 'కూర్చోండి' అంది. హాల్లో





మిగతా సోఫాలు, చైర్స్ అందరూ ఆక్రమించేసుకున్నారు. శేఖరం పక్క తప్ప యెక్కడా ఖాళీలేదు. శేఖరం జరిగి చోటిచ్చాడు. కాని జయంతి కూర్చోలేదు. అతని సోఫా ప్రక్కగా నిలబడిపోయింది.

సరస్వతీరామన్ తన వెంట వచ్చిన వాళ్ళందర్నీ పరిచయం చేసింది.

"ఇంతకీ యెంత యివ్వాలో చెప్పండి" శేఖరంనవ్వుతూ అన్నాడు.

"ఎంతేమిటండీ! మేం అడిగినంత మీరిస్తారా? ఏదో వుడతాభక్తి. మరీ మీ స్థితికి తగకుండావుంటే చాలు" సరస్వతీ రామన్ డబ్బెక్కువ యెలా రాబట్టాలో తెలుసు.

"బాగుంది. నేనిచ్చే డబ్బుతో నాస్థితి తెలుస్తుందంటారా?"

"అదీ కాదనుకోండి. సహజంగా మీ కేవో అలవాట్లుంటాయిగా!" శేఖరం జేబులోంచి పర్సు తీస్తుండగా—యింకో ఆమె "పోనీ మీ మిసెస్‌కి యివ్వండి—ఆవిడ యెంత యిస్తే అంతే" అంది. జయంతి వారించబోతున్నట్టు యేదో అనబోతుండగా శేఖరం తనే అందుకుంటూ "ఆమె పేరు జయంతి. పేరువదిలేసి మీరు మిసెస్ మిసెస్ అంటే ఒప్పుకోదు." అన్నాడు రెండర్థాలు వచ్చేట్టు.

"ఓహో! చాలా స్వతంత్ర భావాలుగల వ్యక్తి కాబోలు."

"పోనీండి! జయంతీ శేఖర్ అంటాం."

"వద్దు వద్దు. కోపంవచ్చేపనిచేస్తే మన విరాళం తగ్గిపోవచ్చు."

"జయంతిగారు! మీకుతోచిందే యివ్వండి" అంది సరస్వతీరామన్ ఇదంతా హాస్యంగా తీసుకుంటూ.

శేఖరం పర్సు జయంతి కందిచ్చాడు. అది అందుకోకుండా అతనివైపు చూస్తుండిపోయింది. 'ఊ! యివ్వు—' అన్నాడు నవ్వుతూ.

"ఇంకా పిల్లాపాపా లేనట్టుంది!" యెవరో మెల్లగా అనటం జయంతికి, శేఖరానికిద్దరికీ విన్పించింది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. శేఖరం కళ్ళలో చిత్రమైన భావం —మనోహరంగా మెరిసి జయంతి గుండెల్లోకి దూసుకు పోయి క్షణంసేపు కొట్టుకునేలా చేసింది.

గభాల్న అతని చేతిలో పర్సు లాక్కుని తెరిచి అందులోవున్నదంతా యెంతవుందో చూడకుండా తీసి సరస్వతీ రామన్ చేతిలో పెట్టేసింది.

"గుడ్! చాలా ఉదార హృదయులు మీరు. 800 విరాళం అంటే సామాన్యంగాదు." లెక్కపెట్టుకొని బాగ్‌లో పెట్టుకుంటూ అంది.

"ఎనిమిది వందలా!" జయంతి మనసులోనే వులిక్కిపడింది. భయంగా శేఖరంవైపు చూసింది. శేఖరం యిదేం గమనించనట్టు "మరి ముందే మీరు మీస్థితికి తగ్గట్టు అని లంకె పెట్టారయ్యె" అన్నాడు నవ్వి.

వాళ్ళు వెళ్ళిపోయిం తర్వాత జయంతి 'క్షమించండి' అంది.

"ఎందుకు ?"

"నేను డబ్బు అంత వుంటుందనుకోలేదు."

"అదా ?" అంటూ నవ్వేసి "నీ కోపం తెప్పించినందుకు నాకి మాత్రం శిక్షలేకపోతే యెలా?"

జయంతి మర్చిపోయిన కోపం రెట్టింపుగా తిరిగివచ్చింది.

"లేకపోతే! బుద్ధిలేదూ వాళ్ళకి. ఆడామగాకన్పిస్తేఅనెయ్యటమేనా?"

"వాళ్ళదేం పొరపాటులేదు జయంతీ! నేనుఒంటరిగాడిననితెలుసు. నాభార్య కాకపోతే యింకే ఆడది అంత చనువుగా యింట్లోకి వెడ్తుంది? అందులో నువ్వేమో బుద్ధిమంతురాలిలా పమిట భుజాల చుట్టు కప్పుకుని మెడను కనపడనివ్వలేదు."

"అవును నిజమే!" జయంతి కప్పుడు గుర్తొచ్చింది.

"ఛీ-ఛీ-" పమిటతీసి, సరిగ్గావేసుకుంటూఅక్కడినుంచి వెళ్ళిపోయింది.

● ● ●

శేఖరం ఆరోజు మామూలువేళ కంటే చాలా ముందుగా యింటికి వచ్చేశాడు. జయంతి గదిలో కూర్చుని తల దువ్వుకుంటోంది. అతని చేతిలో ఏదో ప్యాకెట్ వుంది. అది జయంతి పక్కనపెడుతూ "త్వరగా తయారుకావాలి" అన్నాడు.

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఈరోజు ప్రమీల పుట్టినరోజన్న సంగతి మర్చిపోయావా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

మొన్నటిరోజున ప్రమీల యిద్దరు స్నేహితురాళ్ళని వెంటేసుకుని వచ్చి యెల్లుండి తన పుట్టినరోజని, తప్పకుండా రావాలని మరీ మరీ పిలిచింది. ప్రమీల వచ్చినప్పుడు శేఖరం గూడా యింట్లోనే వున్నాడు. చదువుకుంటున్న పేపరు ప్రక్కకుతీస్తూ "ఇంకా పుట్టినరోజేమిటి ? పాపాయివా ?" అని వెక్కిరించాడు.

"ఔను. పాపాయినే!" అంది పగర్వంగా ప్రమీల.

"పాపాయేమిటి ? నువ్వింకా అసలు పుట్టనేలేదు. ఎల్లుండి పుట్టబోతున్నావు!" ఎగతాళి చేశాడు.

"ఔనౌను. జోలపాట పాడటానికి మీరు రండి" ఫక్కుమని నవ్వింది ప్రమీల.

"అసలుసంగతి నాకు తెలుసులే! ఈరూపేణా అందరిదగ్గిర బహుమతులు కొట్టెయ్యొచ్చని."

"అయ్యో! తమరేం తీసుకురానవసరంలేదు, ఒకవేళ తెచ్చినా తిప్పి పంపబడును. సరా ? తమరు దయచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపితే అదే మాకు మహాభాగ్యం!"

శేఖరం లేచివచ్చి ప్రమీల నెత్తిన మొట్టి "ఎన్నింటికి రావాలి ?" అన్నాడు.

"ఆడవాళ్ళు ఆరుగంటలనుంచి



ఎనిమిదిగంటలవరకు, మగవాళ్ళు ఎనిమిదిగంటలనుంచీ తొమ్మిదిగంటలవరకూ—"

"టైమింగ్స తప్పించివస్తే ఆడవాళ్లు మగవాళ్లుగా మారిపోతారా?"

"తప్పకుండా!"

జయంతి యిద్దరిసంభాషణవింటూ కూర్చుండిపోయింది. ప్రమీల మరో

సారి తప్పకుండా రమ్మనమని జయంతికి చెప్పి వెళ్ళిపోయింది. ఈరోజు పుట్టినరోజు అని గుర్తున్న మాట నిజమే! కాని ప్రమీలా వాళ్ళింటికి వెళ్ళటానికి జయంతికి యేమాత్రం యిష్టంలేదు. అందుకే తీరికగా కూర్చుని జుట్టు చిక్కు తీసుకుంటోంది.

'నిన్నే మాట్లాడవేం? నువ్వు త్వరగా తయారైతే నేను క్లబ్‌కి వెడ్తూ వెడ్తూ నిన్నక్కడ దించేసి వెళ్ళి, వచ్చేటప్పుడు యెక్కించుకొస్తాను,' అని టవల్ తీసుకుని బాత్‌రూమ్ వైపు వెళ్ళబోతూ 'ఆపెట్టెలో యేముందో చూడు' అన్నాడు కుతూహలాన్ని రేకెత్తించే కంఠంతో.

'యేమిటది?' నిర్లక్ష్యంగా అడిగింది.

'తెరిచిచూడు నీకేతెలుస్తుంది,' అంటూ బాత్‌రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

అతను ముఖం అదీ కడుక్కుని తిరిగి వచ్చినా జయంతి యింకా అలాగే తలదువ్వుకుంటూ కూర్చుంది.

'అదేమిటి యింకా అలాగే కూర్చున్నావేం?'

జయంతి తలెత్తుతూ 'వెళ్ళితీరాలా' అంది.

'అవును వెళ్ళితీరాలి' శేఖరం పెట్టెవైపు చూశాడు. అది పెట్టిన చోట పెట్టినట్లేవుంది. ముట్టుకున్న జాడలే లేవు. కనుబొమలు కొద్దిగా ముడుస్తూ 'అందులో నీకు చీరవుంది. అది నీ నీలం చికిల్ వాయిల్ జాకెట్‌కి మాచ్ అవుతుంది. ఈ చీర కట్టుకుని ఆ బ్లౌజ్ వేసుకురా!' అన్నాడు.

'నేను వేసుకునే బట్టలుగూడా మీరే యెన్నిక చేయాలా?'

'అవును. నువ్వు లేచి త్వరగా తయారయిరా! వెళ్ళు. అనవసరంగా నాతో ప్రతిదానికీ ఆర్గ్యూ చెయ్యకు. నాకు నచ్చదు.'

జయంతి త్వరత్వరగా జడ అల్లుకోవడం ముగించి నిశ్శబ్దంగా అట్టపెట్టె తీసుకుని వెళ్ళిపోయింది.

లేత నీలంరంగుకి చిక్కటి నీలంలో హంసలబారున్న చీర.


జయంతి పది నిమిషాల్లో తయారై వచ్చింది. శేఖరం మొహం వికసించింది. 'ఏదీ యిటు తిరుగు. ఇలా దగ్గరగారా!' చీర అంచు మడతపడినచోట సరిచేస్తూ 'అచ్చు నేను వూహించినట్లే వున్నావు. చాలాబాగుందీచీర. నీకునచ్చిందా?'

'శైమైపోతోంది అన్నారుగా' నిర్లిప్తంగా అంది. శేఖరానికివెంటనే దగ్గరకు లాక్కుని బుంగమూతి పెట్టుకున్న ఆ పెదవుల్ని కసితీరా 'వద్దు—వద్దు—నవ్వుతూవుంటాను' అని బ్రతిమలాడేవరకూ కొరకాలనిపించింది.

'ఎంత బాగున్నావో తెలుసా! నామీద కోపంతో నీ కళ్ళకి పొరలు అడ్డొచ్చాయిగాని—'

'ఎవరు చెప్పారు?'

'నీ మొహం తెలియటంలా!' అంటూ మృదువుగా భుజాలమీద చేతులాన్చి 'జయంతీ! ఆ రోజు—




సినిమాహాల్లో పుట్టిన రోజుకి నేను పంపిన చీర కట్టుకున్నప్పుడు ఇలాగే వున్నావా?' అన్నాడు.

జయంతి మాట్లాడకుండా మొహం తిప్పేసుకుంది.

'జయా!—' శేఖరం యింకొంచెం దగ్గరకు తీసుకుని ఏదో చెప్పబోయాడు. వెంటనే అడ్డు తగుల్తూ 'దయవుంచి నన్నాపేరుతో పిలవకండి. నేను భరించలేను' అంది.

'ఎందుకని?'

'నన్నాపేరుతో బామ్మ తప్ప యింకెవరూ పిలవరు. నన్నంత ఆత్మీయంగా చూసేవాళ్ళు గూడా—' కంఠం జీరపోవడంతో ఆగిపోయింది.

'ఆవిడ నాకా వారసత్వం వదిలి వెళ్ళిందంటే?—'

'అంతే సరిపోదు—'

'ఉదాహరణ చూపిస్తే—'

'మీరెప్పటికీ చూపించలేరు.'

'ఇప్పుడే చూపిస్తా— చూపించనా!'

క్షణంసేపు అతని కళ్ళలోకిచూసిన జయంతి మెల్లగా అతనిచేతులనుంచి తప్పించుకుని దూరంగా వెళ్ళిపోతూ 'మీరుచూపించలేరు. ఒకవేళచూపించినా నేను నమ్మను. మీరు సమర్థులు. ఎన్నయినా సృష్టించగలరు.'

'జయంతీ!' దెబ్బతిన్నట్టు చూశాడు శేఖరం.

'మనం వెళ్ళటానికి యింకా ఆలస్యం అవుతుందంటే నాకు పనివుంది. సునంద కొడుక్కి స్వెట్టర్ అల్లుతున్నాను. అది పూర్తిచేసుకుంటాను.'

(సశేషం)

# ఎంత దూరం

"మరోసారి ఆలోచించి చూడు అమ్మలూ! నీవు యిలా వున్నపళంగా అతనికి ముందుగా చెప్పకుండా-చెయ్యకుండా చంటిదాన్ని తీసుకుని బయలుదేరటం నా కంతగా మంచిదనిపించటంలేదు" అని నే నన్నదానికి అమ్మలు చిర్రుబుర్రులాడుతూ యిలా అంది :

"ఇక ఆలోచించవల్సిందేమీ లేదన్నాయ్! బాగా ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను. ఈ మనిషికి యిలా చేస్తేనేకాని తిక్క కుదరదు. ఈ పాడు పల్లెటూళ్ళో నే నుండలేను బాబోయ్ అని నెత్తీ-నోరూ బాదుకున్నా ఆయనకు తలకెక్కిందే? చావనా? ఈ పల్లెటూళ్ళో యీయన యీ బోడివుద్యోగం చేయకపోతే యెవ చేడ్చాడో? అడ్డాళ్ళు పైకి లేసుకుని యీ కొంపలెంట తిరగటమేమిటో—నా పిండాకూడు ఉద్యోగం, ఈ ఉద్యోగ మేమిటో? ప్రొద్దుటనగా పోయిన మనిషి సాయంత్రానికికాని రారు. ఆయన కోసం ఎదురుచూస్తూ యీ పిల్లముండా నేనూ బిక్కు బిక్కుమంటూ ఎదురుచూడలేక చావాలి! ఒక సినిమా లేదు, ఒక బీచీలేదు, ఒక పార్కు లేదు, పాడులేదు. ఈ పాడూళ్ళో ఏమీ తోచక ఛస్తున్నా ననుకో—ఈయనగారేమో యీ వూరొదిలి రాను అని కూర్చున్నారు—"

అమ్మలు నాకు చెల్లెలు అవుతుంది. సొంతచెల్లెలుకాదు. మా బాబాయి కూతురు. ఈ వూళ్ళో భర్తతో కాపురం చేస్తోంది. నాకీ వూళ్ళో పొలాలు వున్నాయి. రైతులు పంట డబ్బు సరిగ్గా యివ్వటంలేదు. చాలా బకాయిలు పెట్టారు. ఆ బకాయిల తాలూకు పైకాన్ని వసూలు చేసుకు వెళ్ళటానికి పట్నంనుంచి యీ వూరికి వచ్చాను. ఇక్కడికి వచ్చేముందు మా బాబాయికి ఫోనుచేసి యిలా వెళ్తున్నాను, అమ్మలుకు ఏం చెప్పమంటావు అని అడిగాను. "అమ్మలు యిక్కడికి వస్తానంటోంది, నీ వెంట తీసుకునిరారా" అని మా బాబాయి చెప్పాడు. నా పని చూచుకుని అమ్మలు యింటికెళ్ళాను, ఆమెను నా వెంట తీసికెళ్ళటానికి. తీరా అమ్మలు ఏ పరిస్థితుల్లో ఇక్కడ్నుంచి వస్తుందో విన్నతర్వాత ఆమె యిలా రావటం నాకు మంచిదనిపించలేదు. అందుకే అలా అన్నాను. దానికి ఆమె యిచ్చిన సమాధానం యిది!

అమ్మలుభర్త శర్మ యీ వూళ్ళో విలేజి లెవెల్ వర్కర్‌గా చేస్తున్నాడు. అమ్మలుకు అతని ఉద్యోగం, యీ వూరు నచ్చలేదు. ఈ వుద్యోగం వదిలేసి యీ వూర్నుంచి పట్నం వెళ్ళిపోదాం రమ్మంటుంది. అందుకు శర్మ యిష్టపడటంలేదు. అమ్మలుకేమో పట్నంలో ఆడంబరంగా విలాసజీవితం గడపాలని. శర్మకు యీ పల్లో ప్రశాంతంగా, యీ చిన్నవుద్యోగం చేసుకుంటూ కాలం గడపాలని. ఇక్కడే యిద్దరి అభిప్రాయాలు చెరొకదారిగా వున్నాయి. అవటానికి మళ్ళీ వీళ్ళది ప్రేమ వివాహమే! అమ్మలు కాలేజీలో పి.యు.సి. ఛదువుతుండగా బి. ఏ. చదువుతున్న శర్మను ప్రేమించి, ఇంటిలోవాళ్ళు ఒప్పుకొనకపోయినా అందర్నీ ఎదిరించి మరీ పెళ్ళాడింది. శర్మ బి. ఏ. పట్టాకు వచ్చిన ఉద్యోగ మది! అతడు మాత్రం ఏం చేస్తాడు? ఈ వుద్యోగంమానేసి మా యింటికివచ్చి ఏని కూర్చోమంటుంది అమ్మలు. అది అతని స్వభావానికి విరుదం.

"నీకు తెలియదన్నాయ్. ఇక యీయనతో ఇలా లాభంలేదు. నేనూ, చిట్టి ఆయనకు కొంతకాలం దూరమైతేగాని ఆయనగారి తిక్క కుదరదు. చిట్టి అంటే ఆయనకు ప్రాణం. అది కొన్నాళ్ళు కనిపించకపోతే దాని మీది మనాదితో పరుగెత్తుకు వస్తారు—"

చదువుకున్న అమ్మలు అనేమాట అది! అంతగా కావాలని ప్రేమించి పెళ్ళాడిన అమ్మలు భర్తతో పల్లెటూళ్ళో కాపురం చేయలేక ఇదవుతోంది. అమ్మలు ఎంతవరకూ తన భర్త తన మాట వినాలని, తన

అరిగే రామారావు

యిష్ట ప్రకారం నడుచుకోవాలని చూస్తుంది, చేస్తుందేకాని తన అభిరుచులను, ఆలోచనలను అతని కనుగుణంగా మార్చుకోవటానికి కొంచెం కూడా ప్రయత్నించటం లేదు. ఆఖరికి అతడిని తన దారికి మళ్ళించుకోవటానికి అతడింటిలో లేని సమయంలో అతనికి చెప్పకుండా చెయ్యకుండా కూతుర్ని తీసుకుని పుట్టింటికి పోవటానికి సిద్ధమయి కూర్చుంది. నేను చెప్పినా వినలేదు. అమ్మలే గనుక నా సొంత చెల్లెలు అయినట్టయితే ఏం చేసివుండేవాణ్ణో ... ... ఏమో! కాదని నేను వెళ్ళిపోయినా అమ్మలు రేపు ఒక్కర్తే అయినా వచ్చెయ్యగలదు. అది వెంట వస్తానంటే తీసుకునిరాలేదు అని రేపు బాబాయి నిష్ఠూరం. మధ్యన నాకెందుకు? సామానంతా నిమిషాలమీద సర్దేసి పిల్లను చంకనేసుకుని, 'ఇక పదన్నాయ్! నీవెళ్ళి బండి తీసుకురా—' అంది. అప్పటికే చీకటి పడింది. నేను వెళ్ళి బండి తీసుకుని వచ్చాను.

ఆమె తలుపులు వేస్తుంటే గోడమీదవున్న శర్మ ఫొటో ఆమెవంక జాలిగా చూస్తున్నట్లనిపించింది నాకు. అమ్మలు యింటికి తాళంవేసి, తాళం చెవి పక్కింటివాళ్ళ కిచ్చింది.

కూతురు చిట్టి, "అమ్మా మనం ఎక్కడికే వెళ్ళేది! నాన్నారు ఏరమ్మా— నాన్నారు మన్తో రా రా — నాకు నాన్నారు కావాలని మారాం చేస్తుంటే దానికి రెండు తగలనిచ్చి బండి ఎక్కింది.

మేం ఎక్కిన బస్సు కదిలేసరికి పూర్తిగా చీకటి పడింది. పగలంతా తిరిగి తిరిగి చీకటి పడేసరికి యింటికి వచ్చిన శర్మకు యింటికి తాళం వేసి వుండటం, భార్యా కూతురు లేకపోవటం, చెప్పకుండా పెట్టకుండా భార్య వెళ్ళిపోవటం—నాకు జాలి వేసిందిశర్మమీద. చిట్టి, నాన్న కావాలని మారాం చేస్తుంది. చీకటిపడగానే పాపం తండ్రి వళ్లో అడుకోవటం అలవాటు కాబోలు! నాఆలోచనలు ఈకాలేజి ప్రేమలు, పెళ్ళిళ్ళు, వాళ్ల కాపురాలు, ఒకరి కొకరు ఎడ్జస్ట్ కాకపోవటం— వీటివైపుమళ్ళాయి.

బస్సు ఒకచోట ఆగింది. పొలోమంటూ ఒక ముఠాముఠా ఎక్కారు. అక్కడికి రెండు కోసుల దూరంలో అడవిలో ఒకచిన్నపల్లెవుంది. ఆపల్లెలో జరిగిన పెళ్ళికి వచ్చి, ఆముఠావాళ్ళు పెళ్ళయిన తర్వాత తిరిగి వెళ్ళిపోతున్నారట. ఆనట్టడవిలో ఆ కటిక చీకటిలో బస్సుకోసం గంటన్నర నుంచి ఎదురు చూస్తున్నారట. ఈబస్సే ఆ రోజుకు ఆఖరి బస్సు.

ఆముఠా అందరి తరఫున ఒకడు టిక్కెట్లు తీసుకున్నాడు. కండక్టరు వచ్చిన డబ్బులకు, యిచ్చిన టిక్కెట్లకు ఎక్కిన మనుషులు సరిపోయారో లేదోనని అందర్ని లెక్కపెట్టుకుంటుండగా అతడిచూపులు ఒకడిమీద పడ్డాయి. వాడు పూరాగా సారా త్రాగి వున్నాడు. వాడుసీటులో సరిగ్గా కూర్చోలేక పోతున్నాడు. ప్రక్కవాడిని బండబూతులు తిట్టుతు



న్నాడు. కండక్టరు. ఆత్రాగివున్నవాణ్ణి దింపేయాలి అన్నాడు.

"పెళ్ళి సంబరంలో కూత్తంత తాగేడు వెధవనాయాలగాడు. పోనీయ్ దొరా—" అని ఆముఠా తాలూకు మనిషి ఒకడన్నాడు.

"అదేం కుదర్దు. త్రాగివున్న వాళ్ళను మాబస్సులో తీసికెళ్ళకూడదు. చెకింగ్ వాళ్ళు వస్తే మాకు మాటవస్తుంది. వాడు దిగాల్సిందే! వాడిని దింపుతారా! లేక మీరంతా దిగుతారా? ఏ సంగతి చెప్పండి—" అని దబాయించాడు.

"ఈ ఎల్లిగాడు ఏంచేసినా ఇంతే నశ! ఇకాగరా అంటే వింటేనా? ముంతమీద ముంత వేసిండుయెదవ"

"ఏఁవే సూరావా! ఆ సచ్చినాడికి బుద్ధిలేదనుకో—నీ బుద్ధేడికెళ్ళిందే? ఆడిసేతికి డబ్బులెట్టా ఇచ్చావ్" ఒక ముసలమ్మ ఎల్లిగాడిపెళ్ళాం సూరిని బుగ్గన పొడిచింది.

"అదొకసంబడం, రొంటినుంచితీసియ్యటం— ఎట్టగయితే నా మొగుడికి నేనేగంద తాగుడుకు డబ్బులిచ్చానని—" సూరి వయస్సుదే ఒకతి మూతి త్రిప్పింది.

"ఆఁ—అట్టకాదంటమ్మా, కూలినాలి సేసిన డబ్బులన్నీ ఆడి దేవశానపోసి సంసారాన్ని ఈకాడికి తెచ్చుకుంది. మేం చెప్పితే వినుకుంటేనా? ఓయబ్బ మొగుడుమీద ఆ పేమ ఏంటో, ఆ కత ఏందో—మేమూ మొగుళ్ళతో సంసారాలు సేత్తున్నాం గాని ఇట్టాకాదమ్మా—' ఈమాటలు అంది సూరి తల్లి ఏమో! పాపం ఆ సూరి అన్న పిల్ల బిక్కమొగం వేసుకుని కూర్చుంది.

"నాకీ ముండ డబ్బులు కావాలేందే! మనం బస్తీకెళ్ళంగాని వెళ్తేనా యమ సంపాయిత్తాంలే!... ఏంటయ్యా కండకట్టరు— నీవు పెద్దగవున్నేరునాగా మాటాడుతున్నావ్? అసలెవడహే తాగింది? తాగేనే అనుకో తీసికెళ్ళవా! డబ్బులు పారేత్తాం తిప్పి తిప్పి... ..." ఎల్లిగాడు చేయి గిర గిర త్రిప్పుతూ అన్నాడు.

"నీవునోరుమూయరా నాయ్యాల! బాబు కండక్టరుబాబు—అడినిరానియ్ బాబు—ఆడల్లరి సేయకుండా మేం సూత్తాంగా? ఇది లాట్టు బస్సు. ఇది తప్పితే ఈ రేతిరికి ఈ అడవిలో వుండిపోవాలి. మళ్ళా రేపు సీకట్లో మా జట్టంతా నాట్లుకు పోవాలి— కూలినాలి సేసుకునేవాళ్ళం దయ సూపుబాబు—" అని ఒకతను కండక్టర్ను ఎంతగానో బ్రతిమాలాడు. అయినా కండక్టరు వప్పుకోలేదు.

"ఎల్లిగాడ్ని దింపంతశ—వీడికోసం అంతా ఏడ దిగడాలి—సీకట్లో. కరణంగారి పొలంలో నాట్లుకుపోవాలి— అయ్యా, ఎల్లియ్యా దిగయ్యా—" అని ఎవరో అన్నాడు వాళ్ళమనిషి.

"ఓలమ్మో, ఈసిమ్మసీకట్లో అడ్డొక్కడే ఎట్టుంటాడు? ఎట్టొత్తాడు—" ఎల్లిగాడి భార్య సూరి గుండెలమీద చెయివేసుకుని అంది.

"ఎట్టొత్తాడని తాగుడుకు డబ్బు

లేచ్చావే పిల్లా—అంతా శానాతనం పోతావ్‌గాని—" ఆసూరి అత్తేమో కోడలు బుగ్గపొడిచి మరీ అంది.

"ఏం నీరొంటికాడి ముల్లి పూడ దీసి ఇచ్చానా? నాకష్టం— నాఇష్టం— నా మొగుడి కిచ్చుకున్నా. అడిశంతే ఎక్కువేంటి?"

"ఓ యబ్బరాడ మొగుడో!"

"అవతల బస్సు టైం అయిపో తుంది. ఏం వాడ్ని దింపుతారా! మీ రంతా దిగిపోతారా! ఏదో ఒకటి తేల్చి చెప్పండి—" కండక్టరు ధాం ధూం లాడాడు.

"ఓరి ఎల్లిగా దిగరా."

"అమ్మో. ఆ డొక్కడేనా?"

"ఓరి బుల్లియ్యా నీవు దిగరా. ఆడ్ని ఏ లారీలోనో బోరీలోనో ఎక్కించుకునిరా—"

"నా వళ్ళు యిరగపొడిసినట్టుంది మాఁవ—"

"ఓరి ఎంకయ్యా, నీవు రా—"

"రేపు పత్తుందమంటావా అన్నియా?"

"అరే కనకాలు నీవన్నా దిగరా—"

"ఏ పోలీసోడో యీడ్ని పట్టు కుంటే వీడ్తోపాటు నన్నూ బొక్క లోకి తోస్తాడు—అసలే పెళ్ళాం బిడ్డలు గలోడ్ని—"

ఇలా ఎవరికివారు ఎల్లికి సహా యంగా మేం దిగమంటే మేం దిగ మన్నారు.

"మరి ఎవడికివాడు దిగనంటే ఎట్టురా?"

"ఎట్టగే ముంది. ఆ డొక్క డొత్తాడే—"

"ఎవడెందుకశ దిగటం—నేను రాలేకపోతేనా—మనం ఎంత తాగినా శంశార్ పులి—" అని తూలుతూ జారిపోతున్నపంచను ఎగలాక్కుంటూ ఎల్లిగాడు కిందకు దిగాడు.

సూరి, కండ్లనిండా నాకు భయం కనిపించింది. భయంగా లేచినిల్చుంది. "నే నొత్తా నుండరా—" అంటూ వాడి వెనకాలే దిగింది.

"ఓసినీ, నీవెందుకే?" రొమ్ము విరుచుకుంటూ ముందు ముందుకు వచ్చాడు ఎల్లిగాడు.

"ఏంటే పిల్లా నీవు దిగావ్, ఈ సీకట్లో. ఆడు మైకంలో నిన్ను ఏ గొంతు పిసికేసి సంపినా సంపు తాడు—" సూరి అత్త అంది.

"సంపినా సరే. ఆడ్నిమాత్తరం యీ సిమ్మసీకటిలో ఒకడ్నే వదిలేసి నేను సచ్చినా వూరుకోను. ఆ డొక్కడే యీ మద్దెంతరం అడవిలో ఏంగావాలని?—"

"ఓసి, నాకేందే! సీకటయితే ఏఁవే—అడవి అయితే ఏఁవే—మనం సెంశార్ పులి పిల్లా—నీ వెక్కశ—" తూలి పడ్తున్న ఎల్లిగాడ్ని సూరి జబ్బ పట్టుకుని ఆపింది.

ఆ చీకటిలో నక్షత్రాల్లాగా వెల్గు తున్న కళ్ళలో ప్రేమగా మొగుడి వంక చూస్తూ "ఓ యబ్బ శంశారి మా మో—" అంది.







ఆ మాటకు అందరూ నవ్వారు. ఎల్లిగాడు ఆ నవ్వులకు రెచ్చి పోయాడు.

"కాక ఏంటే? నేను ఆడముండ ననుకున్నావే! పోఁయే—పొమ్మంటే పోదేరా—" అంటూ రోషంగా సూరి కొప్పు పట్టుకుని ముందుకు తోశాడు. సూరి ముందుకు తూలి పడింది. తలకాయ వెళ్ళి బస్సు డోర్‌కు కొట్టుకుంది.

"ఎక్కుతావే పిల్లా?" అప్పటి కైనా ఎక్కుతుందేమోనని ఎవరో అడిగారు.

"ఆడ్నొదిలి రాను అని ఎన్నిసార్లు సెప్పాలి—" తల పట్టుకుని అంది.

కండక్టర్ "రైట్" అన్నాడు. బస్ కదిలింది.

"పోవే, చూడకాక—" అంటూ సూరిని ముందుకు తోస్తున్నాడు ఎల్లి గాడు.

నేను తలకాయ బైటికిపెట్టి వెనక్కి తిరిగిచూశాను. సూరి కొప్పు పట్టుకుని వీపుమీద గుద్దుతున్నాడు ఎల్లిగాడు. సూరి గింజుకోవటం లేదు. మొగుడిచేతిలో దెబ్బలు తింటోంది.

బస్సు మంచి స్పీడుగా వెళ్ళి

పోతోంది. వెనకాల చీకట్లో ఎక్కడా మనుష్యసంచారంలేని నట్టడివిలో నడిరోడ్డుమీద త్రాగిన మొగుడు చేతిలో దెబ్బలుతింటూ వాడు ఏమై పోతాడోనని భయంతో, వాడికోసం దిగబడిపోయిన సూరిమీద నా కంతు లేని జాలి ముంచుకు వచ్చింది. మొగుడు వద్దు అని కొట్టున్నా వాడినే అంటిపెట్టుకుని వాడి చేతుల్లో దెబ్బలు తింటున్న సూరిలాటి పల్లెటూరి స్త్రీలను నేను ఎప్పటికీ మర్చిపోలేను.

నా దృష్టి అమ్మలుమీద పడింది. చదువుకుని ప్రేమించి పెండ్లాడిన అమ్మలుకు, చదువుకోని పల్లెటూరి సూరికి ఎంత తేడా!

అమ్మలుకూతురు చిట్టి, "అమ్మా! నాన్నారే–నాకు నాన్నారుకావాలే–" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆ పసిదాన్ని మంచిమాటలతో సముదాయించటంపోయి దాన్ని కొడుతోంది అమ్మలు. బస్సులోనివాళ్ళంతా కూతురును వూరికే బాదుతున్న అమ్మలు వంక చూస్తున్నారు. "రామ్మ, చిట్టీ–" అని నేను చిట్టిని నా వళ్ళోకి తీసుకున్నాను.

గతుకుల రోడ్డుమీద బస్సు ఎగిరెగిరి పడుతోంది. అలాటి రోడ్డుమీద అంత అర్జంటుగా, అంత స్పీడుగా బస్సునడపాల్సినంత కొంప ముంచుకు పోయే పనులు ఆ డ్రైవరుకు ఏం ఉన్నాయో! ఇంజను పెద్ద రొదచేస్తోంది.. బ్రేకులు కర్ మంటున్నాయి. బస్సు రోడ్డును తప్పి తుప్పల్లో పడిపోతోంది. లోపలి జనమంతా గొడవ. గభీమని ఒకచెట్టుకు గుద్దుకుని ఆగిపోయింది. బస్సులో లైట్లు ఆరిపోయాయి. ఇంకానయం. బస్సు పల్టీకొట్టి వున్నట్లయితే అంతా చచ్చి వూరుకునేవాళ్ళం. కాస్తంతలో ప్రమాదం తప్పిపోయింది.

"త్రాగుబోతు వాళ్ళంతా డ్రైవర్లయితే ఇంతే–" అని కండక్టరు చిరాకుగా సీటులోంచి లేచి, ఆ డ్రైవర్ని తిడుతూ కిందకుదిగాడు.

□□□





# ఆడ కథ



"ఈ జన్మలోనేకాదు. వచ్చే జన్మలోకూడా నీ మేలు మర్చిపోలేనురా" అంటూ అవలీలగా నా దగ్గర ఐదురూపాయలు అప్పు తీసుకొని సినిమాకి వెళ్ళబోతూన్న మూర్తి అపళంగా ఆగి—

—మళ్ళీ నన్ను అభినందించే వరసలో "ఒరేయ్! నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. కనీసం నువ్వు అమ్మాయివైనా అయితే కట్నంలేకుండా నిన్ను పెళ్ళిచేసుకుని వుండేవాడిని" అని అర్జంటుగా వెళ్ళిపోయాడు.

"ఏడిశాడు వెధవ. నేను నిజంగా అమ్మాయి నైతేమాత్రం వీడు నన్ను యీ ఐదు రూపాయల అప్పుతో సరిపెట్టుకుని వేరే కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాడా?" అని నేను స్వగతంలో పైకి ఆలోచించాను.

వాడి కసలు ప్రేమించడమే రాదు. ఇంక పెళ్ళి చేసుకుంటాడా కట్నం లేకుండా? చిన్నప్పటినుంచి ఒకే కంచం, ఒకే మంచంతో సరిపెట్టుకుంటూ

'తంబు'

వస్తున్నాం మేమిద్దరం. నేను ఎన్నో సార్లు చెప్పాను వాడికి "అబ్బాయీ! చూడు. నేను ఎంచక్కా పద్మని ప్రేమిస్తున్నాను. అలాగే నువ్వు కూడా ఎవరినైనా ప్రేమించరా" అని. వాడు నా మాట వింటేకదా! అబ్బే! వింటే ఎప్పుడో బాగుపడి వుండేవాడు. ఇంతమంది అమ్మాయిలందరిలో ఏ ఒక్కరిని ప్రేమించలేనివాడు నేను అమ్మాయినయితే నన్నుమాత్రం ప్రేమిస్తాడని గ్యారంటీ ఏమిటి? వాడు ప్రేమించడు. పెళ్ళిచేసుకోడు. (అందులోనూ కట్నం లేకుండా!) అని కాస్సేపు ఆలోచించాక "ఏమో యింతవరకూ ఏ అమ్మాయిని చూసినా వాడిహృదయం స్పందించలేదేమో. నేనమ్మాయినైతే అమాంతం వాడు నాకు దాసుడౌతాడేమో" అని ఒక అనుమానం వచ్చింది నాకు. నేనమ్మాయినైతే—వాడేకాకుండా ఇంకా చాలామంది అబ్బాయిలు నాకోసం పోటీపడి దెబ్బలాడుకుంటారనిపించింది. కొంచెం సిగ్గేసిందికూడా!

ఏమైనా ఒక్కసారి అమ్మాయినైతే, ఎవరేం చేస్తారో, నేనేం చేస్తానో చూడాలనిపించింది. కాని అది సాధ్యమా?

పుట్టకముందే మనల్ని అబ్బాయిలని, అమ్మాయిలనీ రెండు తెగలుగా దేవుడు విభజించాడు. శారీరకంగానూ మానసికంగానూ బోలెడు భేదాలు కల్పించాడు. నేను ఈ పళంగా అమ్మాయినవాలంటే నా జీవకణాల్లోవున్న 'క్రోమోజోమ్సు' కూడా మారాలి. అదెలా సాధ్యం? దేవుడు ఇంత కట్టుదిట్టంగా ఏర్పరిచిన ఈ అడ్డుగోడల్ని ఎలా దాటడం? ఈ సైన్సుకంటే దేవుడే గొప్పవాడు. అందుకనే నేను అమ్మాయినవాలంటే సైన్సుని పట్టుకొని వేళ్ళాడేకంటే "దేవుడికీ జై!" అని ఆ దేవుడినే ప్రార్థించడం మంచిదనిపించింది.

కళ్ళు మూసుకుని తదేక ధ్యానంతో "ఓ దేవుడుగారూ! నన్ను కనీసం ఒక్కరోజుకి అమ్మాయిగా మార్చేయండి" అని వినయపూర్వకంగా ప్రార్థించడం మొదలుపెట్టాను.

ఇంతలో వెయ్యి మెరుపులు మెరసినంత కాంతి, వెయ్యి వయొలిను వాయించినంత నేపథ్య సంగీతంతో ఎవరో దేవలోకపు వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. అయితే—ఆయన దేవుడు అవునో, కాదో నాకు తెలియదు. అసలు దేవుడిని నేనింతవరకూ చూస్తేకదా మరి ఈయనే దేవుడని పోలిక పట్టడానికి.

ప్రశాంతంగా, చిర్నవ్వులు చిందుతూ చందమామలా వున్న వారి ముఖం, ఆకర్షణీయంగా, వెన్నముద్దలావున్న వారి శరీరచ్ఛాయ, ఆజానుబాహులైన వారి శరీరపుష్టి—అన్నీ కలిసి అదో రకమైన తేజస్సు వెదజల్లుతూ వుంది ఆ విగ్రహం. అంతేకాక దివ్యమయిన దైవవాసన కూడా వెయ్యడంతో ఈయన దేవుడు కాకపోయినా ఆయన దగ్గర చుట్టం అయివుంటాడనుకున్నాను.

భక్తితో నమస్కరించి "స్వామీ! తమరెవరు?" అని అడిగాను.

ఆయన వెన్నెల జల్లులాంటి ఒక మందహాసంచేసి "స్వామీ జీవశాస్త్రానంద అంటారు నన్ను" అన్నారు. కోటి కోయిలలు కలసి కోరస్ కూసినట్టున్న మధురమైన వారి కంఠ స్వరానికి నా చెవులు త్రుప్పురాలి తిమ్మిరెక్కాయి.

ఏం చెయ్యాలో తెలియక "ఏం కావాలి స్వామీ, మీకు" అనడిగాను, చెవులో తిరిపెట్టుకుంటూ. చిరుదగ్గు వచ్చింది. దగ్గాను.

"నీకేం కావాలి?" అని తిరిగి ప్రశ్నించారు స్వామీజీ. దానితో నేను స్పృహలోకి వచ్చి "స్వామీజీ నేను ఈ పళంగా అమ్మాయినయిపోదామనుకుంటున్నాను – తరుణోపాయం తమరు సెలవిస్తే..." అని నసిగాను.

ఆయన ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఒక చిన్న భరిణతీసి ఇచ్చి "దీన్ని హార్మోను లేహ్యము అందురు. ఇది తిన్న అబ్బాయిలు అమ్మాయిలుగానూ, అమ్మాయిలు అబ్బాయిలుగానూ మారిపోయెదరు. గుణము వెంటనే కన్పించును. గ్యారంటీ! పనిచేయాలి. చేయని యెడల భరిణ వాపస్ తీసుకొనబడును. ఇది దొరకుచోటు నేనే! ఆలసించిన ఆశాభంగము. తరుణము మించిన మరలరాదు. సరుకు కొద్దిగా మాత్రమే యున్నది. నేడే మీ భరిణ రిజర్వు చేయించుకొనుడు" అని మాయమయ్యారు.

వారు మాయమవగా మిగిలినఖాళీ జాగాకి నేను నమస్కరించి, ఆ భరిణెని కళ్ళకద్దుకుని, మూత తీసికొంచెం లేహ్యం రుచి చూశాను. అమృతంలా వుంది. కొంపతీసి స్వామీజీ హార్మోను లేహ్యమునకు బదులు అమృతము నివ్వలేదుకదా అని నాకు సందియము కల్గినది. ఏదైతేనేం తేరగా వచ్చిందని యింకొంచెం తిన్నాను. ఆ లేహ్యం తిన్నతరువాత నా ఆనందం కట్టలు తెంచుకొని పట్ట పగ్గాలు లేకుండా ప్రవహించింది. అమ్మాయినైపోతున్నందుకు కొంచెం గర్వంకూడా వచ్చింది.

అమ్మాయినైతే—ఎంచక్కా రంగు రంగుల చీరెలు కట్టుకోవచ్చు. దోసగింజలా చెక్కగా తిలకంబొట్టు పెట్టుకోవచ్చు. పొట్టిగావున్న అమ్మాయికి మల్లే ఎత్తుమడమల జోళ్ళు వేసుకొని నాజూగ్గా నడవచ్చు. అప్పుడు పమిట సర్దుకుంటూ సొగసు నటించవచ్చు. అఠీను లాకెట్ వున్న ఒంటిపేటుగొలుసు మెళ్ళో వేసుకుని ఆ లాకెట్ నిమాత్రం పిప్పర్‌మెంట్ బిళ్ళలా చప్పరించవచ్చు. లంబాడీవాళ్ళలా బోలెడు గాజులు వేసుకోవచ్చు. కళ్ళుచిన్నవైనా కాటుక పొడుగ్గా పెట్టుకొని కళ్ళు పెద్దవిగా కన్పింప చెసుకోచ్చు. శనివారంనాడు తలంటిపోసుకుని జుట్టు రెండు జడలుగా వేసుకుని ఒక జడలో మందార పువ్వు పెట్టుకొని మరో జడని

భుజాలమీదుగా కండువాలాగ ముందుకి వేసుకోవచ్చు. జుట్టు తక్కువయితే సవరం పెట్టుకుని జడ పొడుగ్గా వేసుకోవచ్చు. ఈ విధంగా అందంగా తయారయి, ఆనందంగా కాలేజీకి వచ్చి, మనకి ఇష్టంలేని అబ్బాయిని అతనేమీ అనకపోయినా 'ఏయ్, మిష్టర్! జాగ్రత్త! పళ్ళు రాలగలవ్' అనేసి పైగా ప్రిన్సిపాల్‌తో రిపోర్టుకూడా చెయ్యొచ్చునోచ్—అని నేను వూహాగానంలో తేలిపోతూ—

అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అనుకుంటాను నేనే అందంగా
వుంటాననీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అంటాను అందరితో నేనే
చిన్నదానిననీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అనుకుంటా నే నంటే అందరూ
పడిచస్తారనీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
చాటిస్తా కన్నీరే విజయానికి
సాధనమనీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
దాసుడిగా చేసుకుంటా నచ్చిన
ఓ అబ్బాయినీ—

అని స్వంతవరసలో కట్టిన పాటలాంటి పదార్థాన్ని పాడుకుంటూ వుండగా... ...

నా మీసం మాయమయ్యింది. నా గడ్డం అప్పుడే గీసుకున్నట్టున్నగా అయిపోయింది. పొట్టిగా కొట్టించిన క్రాపింగ్ క్రమంగా కేశవర్ధని రాసుకున్నట్లు పెరిగి పెద్దదవడం ప్రారంభించింది. ఒళ్ళంతా అదోలా అన్పించి కితకితలు పెట్టినట్టయింది. నా శరీరంలో ఏదో గొప్ప విప్లవం జరుగుతున్నట్టు తోచింది. రానురాను నేను మెత్తగా, నున్నగా, గుండ్రంగా తయారయ్యాను.

నా కేదో అనుమానం వచ్చింది. నన్ను నేను నా చేతులతోనే తడిమి చూసుకున్నాను. నాకే సిగ్గేసింది. ఇంకేముంది? అమ్మాయి నైపోయాను.

ఏదో మైకంలోంచి కళ్ళు తెరిచి చూసినట్టు చుట్టూ కలియచూశాను. రూమ్‌నిండా హాలీవుడ్ స్టార్ల చిత్రాలు వేళ్ళాడుతున్నాయి. నా కెందుకో అవి చూడడానికే సిగ్గేసింది. అయినా ఎందుకో చూడాలనిపించింది. చూశాను. ఎందుకో మళ్ళీ "ఛీ" అనిపించింది.

అవును! సందేహంలేదు. నేను అమ్మాయి నైపోయాను, పూర్తిగా. లేకపోతే గంటలతరబడి ఆ బొమ్మలు చూసేవాడిని, నాకే "ఛీ" అన్పించడమేమిటి? ... ... అని కొంచెంసేపు ఆలోచించాక ఆ బొమ్మలన్నీ చించెయ్యాలని బుద్ధిపుట్టింది. "ఛీ! ఈ హాలీవుడ్ అమ్మాయిలకి సిగ్గులేదు" అనుకుంటూ ఆ బొమ్మలన్నీ శుభ్రంగా చించి పోగులుపెట్టాను.

అలా "అమ్మాయితనం" నాలో పూర్తిగా వ్యాపించాక నాకు రూమ్ అంతా మగవాసన వెయ్యనారంభించింది. ఇంతలో నా ప్యాంట్, షర్టు వుస్టు స్టాండ్ నన్ను వెక్కిరించాయి. నా షేవింగ్ సెట్ నన్ను చూసి వెకిలి నవ్వు నవ్వింది. నే కట్టుకున్న గళ్ళ లుంగీ, గళ్ళచొక్కా నాకు ఎబ్బెట్టుగా అన్పించాయి. పోనీ బట్టలు మార్చుకుందామని రూమ్ అంతా కలియ చూశాను. అన్నీ మగవాళ్ళ దుస్తులే! రూమ్ ఎక్కడ చూసినా "మగత్వం" మూర్తీభవించినట్టు ఉంది. మా మూర్తిగాడి ఫొటో కన్పించింది ఎదురుగా. బొద్దింకల్లా వాడి మీసాలు వాడూను. నాకేసే సూటిగా సిగ్గులేకుండా అదోలా చూస్తున్నట్టుంది. నాకు చిరాకేసింది. సిగ్గేసింది భయమేసింది.

అమ్మో! ఇప్పుడు సినీమానించి మూర్తి తిరిగి వస్తాడుకదా! అర రాత్రి యీ రూమ్‌లో ఒక్కర్తినీ అందులోనూ అమ్మాయినీ వుంటే ఇంకేమైనా వుందా!

ఇంతలో అడుగుల చప్పుడు విన్పించింది. నేను ఎందుకైనా మంచిదని వరండాలోకి వెళ్ళి పారిపోవడానికి సిద్ధంగా నుంచున్నాను. దూరంగా వస్తున్న హాస్టల్ వాచ్‌మాన్ ప్రెకాస్రావ్ "ఎవరది" అనరచాడు. నా పైప్రాణాలు పైకే పోయాయి. అంతే! పరుగుప్రారంభించి వార్డెన్ గారిల్లు చేరుకుని తలుపులు దబదబా బాదేశాను.

వార్డెన్‌గారువచ్చి తలుపులు తీశారు. నేను తలుపులు తోసుకుని లోపలకు పరుగెట్టాను. నా వెనకాలే 'దొంగ' అంటూ వాచ్‌మాన్ ప్రెకాస్రావ్ పరిగెట్టుకొచ్చాడు. మా వార్డెన్‌గారికి అంతా అయోమయంగా తోచింది. లోపలి గదిలోకి వచ్చి గదంతా వెదికి బీరువా ప్రక్కనే దాక్కున్న నన్ను "ఇడుగో దొంగ!" అని జబ్బపట్టుకుని ఇవతలకి లాగారు.

చేతికి దొరికిందని నన్ను ఏమైనా అఘాయిత్యం చేస్తారేమోనని నా గుండె గుభేలుమంది. ఈ హడావిడికి అప్పుడే నిద్రలేచిన వాళ్ళావిడ అక్కు వచ్చింది. నేను గబుక్కున ఆవిడ వెనక్కి వెళ్ళి దాక్కున్నాను. ఆవిడ హడలిపోయి "బాబోయ్ పీడవడం డోయ్" అని ఎగిరి గంతేసి అయన్ని పబ్లిగ్గా నా ఎదుటా, మా వాచ్‌మాన్ ఎదుటా కౌగలించేసుకుంది.

దాంతో మా వార్డెన్ గారికి ఎక్కడలేని ధైర్యంవచ్చి "ఏమిటోయ్" ఇదంతా అని గర్జించి గట్టిగా నాభుజంమీద చెయ్యివేసి కోప్పడ్డారు. నాకు వళ్ళు మండింది. ఎంత వార్డెనైతే మాత్రం అమ్మాయినిగదా నా భుజంమీద చెయ్యివేయడం ఏమిటి? అందుకే "మేష్టారూ! మర్యాదగా నా భుజంమీద చెయ్యి తియ్యండి" అని కసిరాను. ఆయన నిర్ఘాంతపోయి చెయ్యి తీసేసి తెల్లమొహం వేశారు.

నేను అమ్మాయినైపోయిన విషయం అంతా పూసగుచ్చినట్టు చెప్పాను: నేను పూర్తిగా చెప్పేవరకూ ఆయన ముఖం అలాగే తెల్లగా వుండిపోయింది. ఆయన తేరుకున్నాక కాలేజీ డాక్టర్‌గారికి ఫోన్ చేశారు నా విషయం.

పావుగంటలో కాలేజీ డాక్టర్ పోతురాజు గారు ఆవలించుకుంటూ

వచ్చారు. నేను ఆయనచేత పరీక్ష చేయించు కోడానికి వప్పుకోలేదు. అరగంట తర్వాత లేడీడాక్టర్ కుమారిగారు వచ్చి నన్ను పరీక్షించి పూర్తిగా అమ్మాయినై పోయానని 'సర్టిఫికెట్' ఇచ్చారు.

అప్పుడు ఈసంగతంతా మా వార్డెన్ గారు ప్రిన్సిపాల్‌కి ఫోన్ చేశారు. ఆయన నన్ను వెంటనే లేడీస్ హాస్టల్‌కి పంపించెయ్యమని అన్నారు.

మా వార్డెన్ గారు నన్ను వెంటబెట్టుకొని లేడీస్ హాస్టల్‌కి తీసుకువచ్చారు. లేడీస్ హాస్టల్లో మెంబర్నయ్యాను. పద్మకి నన్ను రూమ్ మేట్ గా వేశారు. పద్మ నన్ను చూడగానే నివ్వెర పోయింది. గ్లాసెడు మంచి నీళ్ళు తాగాక తేరుకొని "ఏమిటి మీరు..." అని ఆగిపోయింది.

"అవును నేను అమ్మాయినై పోయాను. ఇక మీదట నా పేరు శేఖర్ కాదు...... సురేఖ ...నీకు రూమ్ మేట్‌ని" అన్నాను, గళ్ళ పైజమా, గళ్ళచొక్కాలో వున్న నేను.

పద్మకి ఏం చెయ్యాలో తోచ లేదు. పోర్షన్ మర్చిపోయిన నటిలా అలాగే వుండిపోయింది. నాకు మటుకు నిద్రవచ్చి ప్రక్క వేసుకొని హాయిగా అలాగే నిద్రపోయాను.

ఎప్పుడు తెల్లారిందో ఏమో హాస్టల్లో వున్న అమ్మాయి లంతా నా చుట్టూ చేరి నాకేసి వింతగా చూసి గుసగుస లాడుకుంటున్నారు. కళ్ళు తెరచి చూశాను. నిన్నటిదాకా తిన్నగా నాకేసి చూడ్డానికి భయ పడిన అమ్మాయిలు ఈనాడు నాకేసి "నువ్వేం చేస్తావులే! అమ్మాయివై పోయావుగా" అన్నట్టు ధీమా గా చూశారు. కోరలు పీకిన తాచుపా ముని చూసినట్టునన్నుచూసినవ్వారు. నామీద నాకే జాలివేసింది..

ఇంతలో పద్మవచ్చి వాళ్ళందర్ని పంపించేసింది. నేనుభయం భయంగా వెళ్ళి స్నానం గట్రాచేసి వచ్చాను.

పద్మ నాకేసి మొదటి సారిగా తిన్నగా చూసింది. వేదాంత ధోర ణిలో చిన్న చిర్నవ్వు నవ్వింది. నేను తన్మయురాలినై పోయాను. అప్పుడు నాకు సిగరెట్టు కాల్చాలనిపించింది. అమ్మాయినై పోయాను కాబట్టి అతి కష్టంమీద ఆకోర్కె చంపుకున్నాను.

"ఇదిగో అమ్మాయ్! ఏమిటావేషం నువ్వూనూ! ఇలారా, ఈ బట్టలు కట్టుకో" అని చీర, జాకెట్టు మొద లైనవి ఇచ్చింది.

"ఇవి ఎలా కట్టుకోవాలి?" అన్నట్టు నేను ముఖంపెట్టాను.

తనే స్వయంగా చీర కట్టి, సవరం పెట్టి, జడవేసి, కళ్ళకి కాటుక, నుదుట తిలకంపెట్టి బుగ్గలు సాగ దీసింది.— 'ఎంత అందంగా వున్నావే!' అంటూ! నాకు సిగ్గుతో కల్తీ అయిన గర్వంవచ్చింది. అద్దంలో చూసుకున్నాను.

'అద్దంలో' అందం తర్వాత చూసు కొందువుగాని! అమ్మాయి అవగానే సరి పోలేదు. ముందుంది ముసళ్ళపండగ' అంది నన్ను హెచ్చరిస్తున్నట్టు.

"ఏమిటి?" అనడిగాను అమాయకంగా.

"అమ్మాయి అంటే ఏమిటో! అను కుంటున్నావు. ఆడబ్రతుకు కత్తిమీద సాములాంటిది.. గులాబీపువ్వు అందం గానే వుంటుంది. కాని తన ముళ్ళు తనకే గుచ్చుకొని రేకలు చిరిగి పోవచ్చు. అరటిఆకు ముల్లుమీద పడినా, ముల్లు అరటిఆకుమీదపడినా అరిటాకుకే నష్టం. అలాగే అమ్మాయి తన జాగ్రత్తలో తనుండకపోతే అధోగతిపాలే! అబ్బాయి నిన్ను చూడగానే ప్రేమించానంటాడు. పెళ్ళి అంటేమాత్రం పారిపోతాడు. ప్రేమతో ఆటలాడడం అబ్బాయిలకే చెల్లుతుంది. అమ్మాయిమటుకు ఒక గీత గీసుకొని తను ఆగీతదాటకుండా అబ్బాయిని ఆ గీతలోనికి రానీయ కుండా వుంచాలి. లేకపోతే నువ్వెక్కడుంటావో? తెలిసిందా?" అని పద్మ తనకి వచ్చిన మాటల్లో తనకి తెలిసినది, నాకు తెలియవలసినంత తెలియ చెప్పింది.

కాన్వెంటికి పత్రికా విలేఖరులు, ఫొటో గ్రాఫర్లూ తయారయ్యారు. వాళ్ళే కాకుండా మా కాలేజీ అబ్బాయిలు కూడా గుంపులుగాచేరి హాస్టలు ముందు కాసుక్కూర్చున్నారు.

ప్రెస్‌వాళ్ళు నా ఫొటోలు తీసుకొని, ప్రశ్నలడగడం ప్రారంభించారు.

"మీరెలా అమ్మాయి అయ్యారు? ఎందుకయ్యారు? ఎప్పుడయ్యారు?" మొదలైనవి అడగడం అయ్యాక నేను ఎలా అమ్మాయి నయ్యానో ఒకవ్యాసం రాసి వాళ్ళ పత్రికకి ఇస్తే చాలా డబ్బిస్తామన్నారు. తర్వాత కాలేజి కుర్రకారు వచ్చి నా ఆటోగ్రాఫ్ అడిగారు.

ఇంతలో కాలేజీకి టైమయింది. నేనూ, పద్మా, దిల్‌షాద్, విజయ లక్ష్మి, పార్వతి, జయశ్రీ కలసి కట్టు కట్టుకుని జట్టుగా బోలెడు పుస్త కాలు మోసుకుంటూ కాలేజీకి బయల్దేరాం.

మా వెనకాలే స్థానిక రోమియో సంఘంవారు కూడా బయల్దేరి జోక్స్ వేస్తూ, వాళ్ళే నవ్వుకుంటూ, మమ్మల్ని నవ్వించడానికి ప్రయత్నాలు చేస్తూ, మా వాలుచూపుల కోసం విఫల ప్రయత్నాలు చేస్తూ మమ్మల్ని అనుసరించి జాగ్రత్తగా కాలేజీకి దిగబెట్టారు.

నేను కాలేజీలో అడుగు పెట్టగానే పెద్ద సంచలనం బయలుదేరింది. సినీమాతార వచ్చినట్టు, మంత్రిగారి రాకకంటే హడావిడి చేశారు.

బుజ్జి వంచుకొని క్లాసులో ప్రవేశించి పద్మ ప్రక్కనే మొదటిబెంచీలో బుద్ధిగా కూర్చున్నా. సలీమ్ మాస్టారు పాఠం చెప్పకుండా అసలు ఆడవాళ్ళని ఎప్పుడూ చూడనట్టు ఆకలిగా నాకేసి చూడడం మొదలు పెట్టారు. నాకు

చిరాకువేసి పూర్వం నేను అబ్బాయిగా వుండేప్పుడు కూర్చునే చివరి బెంచీలకేసి చూశాను. ఆ బెంచీలో మూర్తి మొదలైన అబ్బాయిలంతా కన్నార్పకుండా నన్నే చూస్తున్నారు. నాకు నవ్వొచ్చింది. చిర్నవ్వు నవ్వుకున్నాను.

"ఆ చిర్నవ్వు నాది అంటే నాది అని ఆ అబ్బాయిలు దెబ్బలాడుకోడం ప్రారంభించారు. అప్పుడు మాస్టారు పాఠం చెప్పడం ప్రారంభించారు. ఏం చెబుతున్నారో ఎవరికీ తెలియడం లేదు. ఆయనకి అంతకంటే తెలియడం లేదు. నేను "అందరబ్బాయిలూ నాకేసే చూస్తున్నారా ? లేదా" అని అందర్నీ చూస్తున్నాను.

పద్మ నన్ను గిల్లింది. "ఏమిటి సిగ్గు లేకుండా అబ్బాయిల కేసి అలా చూస్తావు ? పమిట సర్దుకుని సరిగ్గా కూర్చో" అని మందలించింద చల్లగా.

ఇంతలో క్లాసైపోయింది. ఇంకో లెక్చరర్‌వచ్చేలోగా ఎవరో అబ్బాయి ఓ కాగితంమీద "ఐ లవ్ యు" అని రాసి దాన్ని బాణంలా చేసి నా మీదికి గురిచూసి వేశాడు. నాకు ఒళ్ళు మండి గిరుక్కున వెనక్కి తిరిగి చూశాను. "అదే మారుని శరము అనుకొని నన్ను ప్రేమించవా ప్లీజ్!" అన్నట్టు ముఖం పెట్టాడు రంగనాథం. నేను కోపం పట్టలేక "యు బ్రూట్" అంటూ తారాజువ్వలా లేచాను. "ఏరేవ్వా! తారాజువ్వా!"అన్నాడు డేవిడ్ జాన్. ఈ లోగా లెక్చరర్ వచ్చి "ఏమి టిదంతా ?" అని అరిచాడు. "ఏమీలేదు సార్...తారాజువ్వ!" అంకొక గొంతు వెనకనించి. అంతే! నాకు "తారాజువ్వ!" అని నామకరణం ఐపోయింది.

నాకు ఉకుకుమోత్తనం వచ్చి "వెధవలు" అని తిట్టుకున్నాను. "ఏం ? నాకు నువ్వు పేరు పెట్టినప్పుడు లేదా? పోన్లే. అబ్బాయిలు అమ్మాయిలైతే గాని అమ్మాయిల కష్టాలు తెలియవు" అందొకమ్మాయి కొంచెం కసిగా, మరికొంచెం జాలిగా.

ఐదునిమిషాలు పోయాక "ప్రపంచంలో అబ్బాయి అమ్మాయిగా మారడం అరుదు. ఐతే మన కాలేజీ అబ్బాయి అమ్మాయిగా మారి సదరు గౌరవాన్ని మన కాలేజీకి దక్కించి నందుకు ఈరోజు సెలవుగా ప్రకటించడమైనది" అని ఇంగ్లీషులో నోటీసు వచ్చింది.

చాలామంది చప్పట్లుకొట్టి తమ సంతోషం తెలియచేశారు. కృతజ్ఞులైన విద్యార్థిలోకం "తారాజువ్వకీ జై!" అని కోడై "కొక్కొరో కో" అని కూసింది.

నేను స్త్రీ సహజమైన కన్నీటిని ఆపలేక చీరచెంగుతోతుడుచుకొంటూ ఇవతలికి వచ్చేశాను. కానీ, అక్కడ చాలామంది జనం వుండడంవల్ల నేను మునుపటిమల్లే అబ్బాయిని కాను కాబట్టి వాళ్ళని తోసుకుని వెళ్ళలేక అక్కడే నిలబడిపోయాను, మిగిలిన అమ్మాయిలతోసహా!

ఆ జనంమధ్యలో రాధాకృష్ణ, మురళీకృష్ణ దెబ్బలాడుకుంటున్నారు.



తతిమ్మావాళ్ళంతా ప్రేక్షకులై చూస్తున్నారు.

"ఆ వశీకరణ ఉంగరం నాక్కావాలి. నేను సురేఖని ప్రేమించాలి"అన్నాడు మురళీకృష్ణ గట్టిగా.

"అదేం కుదరదు. మనిద్దరం చెరి సగం డబ్బువేసుకొని తెప్పించాం ఆ ఉంగరం. దానిమీద నీ కెంత హక్కు వుందో నాకూ అంత హక్కు వుంది" అన్నాడు రాధాకృష్ణ అంతకంటే గట్టిగా.

"అందుకనే ఇమ్మంటున్నా. మర్యాదగా ఇయ్యి" అన్నాడు ము. కృ. గట్టిగా.

"నేనివ్వక పోతే ఏం చేస్తావ్" అనరిచాడు రా. కృ. అంతకంటే గట్టిగా.

"ఆహా!" అని కోపంగా ఫెడీమని ము. కృ. ఒక్క లెంపకాయ కొట్టాడు.

వెంటనే రా. కృ. నీకూ నాకూ బాకీ లేదన్నట్టు 'ఫెడీ' అనికూడా అనకుండా 'చెళ్ళు'మని లెంపకాయ కొట్టాడు. ము. కృ. మరొటి వేశాడు. రా. కృ. నీది నువ్వేతీసుకో అన్నట్టు వెంటనే సమాధానం ఇచ్చేశాడు. ఈ దెబ్బలాటలో ఆవుంగరం ఎక్కడో పోయింది. "సరేలే నీసంగతిచూస్తా" అనుకుంటూ ఆరోజు వరకూ ఆప్తమిత్రులైన రా. కృ., ము. కృ. చెరొక దారిన వెళ్ళిపోయారు.

నా గురించి నామిత్రుల్లో అందులోనూ అన్నదమ్ముల్లాంటి రాధాకృష్ణ, మురళీకృష్ణలకి ఆ విధంగా దెబ్బలాట జరుగుతుందని నే నెన్నడూ అనుకోలేదు. నాకు ఎందుకో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హాస్టల్‌కిపోయి భోజనం చెయ్యకుండా ఏడుస్తూపడుకున్నాను.

సాయంకాలమైంది. నిద్ర లేచి ముఖం కడుక్కొని కాఫీతాగివచ్చి ఏమీ తోచక పద్మకేసి చూస్తూ కూర్చున్నాను.

"ఏమిటలా ఉన్నావ్" అడిగింది.

"మనసదోలా వుంది." అన్నాను.

నాకూ అలాగేవుంది" అంది పద్మ.

"అమ్మాయిగారూ" అంటూ

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.

హాస్టల్ ప్యూన్ "ఎంకట్రావ్" వచ్చాడు.

"ఏమిట్రా" అనడిగాను.

వాడొకకవరిచ్చి "కాలేజీప్యూన్ కొండలరావు తెచ్చాడండి" అన్నాడు.

ఏమిటో అని విప్పిచూశాను. సలీమ్ మేష్టారురాసిన ప్రేమలేఖ. 'ఛీ' అన్పించింది. ఆ కవరు వాడి ముఖాన విసిరి "ఇటువంటివి ఇంకెప్పుడైనా తెచ్చావంటే జాగ్రత్త!" అని అరిచాను.

వాడు ఆ కవరు అక్కడే వదిలేసి పారిపోయాడు.

"ఛీ! అమ్మాయంటే ఎందుకో అందరికీ ఇంత అలుసు" అన్పించింది.

ఇంతలో "ఎంకట్రావ్" బెదురుతూ మళ్ళీ వచ్చాడు. "ఎందుకు మళ్ళా వచ్చావ్" అని గర్జించాను.

"అదికాదండి. ఎవరో మూర్తి గారుట మిమ్మల్ని కలుసుకోవాలట" అని నీళ్ళు నమిలాడు.

"సరే" అని విజిటర్స్ రూంకి వచ్చాను. అక్కడ దిగాలుగా నాకోసం నిరీక్షిస్తూన్న మూర్తిని చూస్తే నాకు జాలివేసింది. నన్ను చూడగానే వాడి ముఖం చంద్రుడ్ని చూసిన చకోరంలా కళకళలాడింది.

"ఏమిటి మూర్తీ, ఇలా వచ్చావ్" అనడిగాను మర్యాదగా.

వాడు నాకు ఈరోజే వచ్చిన రేపటి న్యూస్‌పేపర్ ఇచ్చాడు. 'ప్రపంచంలో ఎనిమిదోవింత' అని నా గురించి వేశారు, నా బొమ్మతో సహా! నా జన్మలు తరించాయి. నాకు గర్వంతో కూడిన చిర్నవ్వు వచ్చింది.

"ఒరేయ్, సురేఖా! ఈ శుభ సందర్భంలో నిన్నొకటి అడగాలనుకుంటున్నానురా" అన్నాడు మూర్తి,

"ఒరేయ్ అనకు మర్యాదగా మాట్లాడు" అని వాడ్ని హెచ్చరించాను.

వెంటనే "సారీ. మర్చిపోయా... ఇదిగో సురేఖా చూడు! చిన్నప్పట్నించీ మనిద్దరం కలిసి మెలిసి పెరిగాం. మనస్నేహం చిరస్థాయిగా నిలచిపోవాలంటే అది ప్రేమగా మారి పెళ్ళిగా రూపొందాలి. నిన్ను ప్రేమిస్తున్నాను సురేఖా! మనం పెళ్ళి చేసుకుందాం" అని గుక్కతిప్పకుండా ఆవేశంతో అన్నాడు మూర్తి.

నాకు అంతా అయోమయంగా తోచింది. అందుకే "చూడు మూర్తీ! నువ్వు నన్ను అపార్థంచేసుకొన్నావ్! నేను నిన్ను ఒక సోదరుడుగా చూశాను తప్పితే ఎప్పుడూ ఆ వుద్దేశంతో నిన్ను చూడలేదు. క్షమించు" అని యింక మాట్లాడలేక కన్నీరావుకుంటూ అక్కణ్ణించి లేచి వచ్చేయబోయాను.

"వెళ్ళిపోయేముందు యీ మాట విని మరీవెళ్ళు సురేఖా! నువ్వు కాదన్ననాడు, నువ్వూ; నీ ప్రేమ లేని నాడు, నిన్నేకాదు యీ ప్రపంచాన్నే విడనాడి వెళ్ళిపోతాను" అని బావురుమన్నాడు మూర్తి బాధగా.

నేను అక్కడ నిలువలేక పరిగెట్టుకుంటూ వచ్చి పక్కమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాను. అలా అరగంట ఏడిచేసరికి యింక ఓపికలేక నాకు ఏడుపు ఆగిపోయింది. ఐనా యింకా వెక్కిళ్ళు విన్పించసాగాయి. తీరా చూస్తే పద్మకూడా ఏడుస్తోంది.

నేను కళ్ళుతుడుచుకుని "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాను.

దాంతో యింకా యిదయింది పద్మ. ఐనా అలాగే కష్టపడి ఏడుపుని ఆపుకుంటూ "ఎందుకేమిటి, నీముఖం. చూడు యివిగో నువ్వు అబ్బాయిగా వున్నప్పుడు నాకు రాసిన ప్రేమలేఖలు! నన్ను ప్రేమిస్తున్నానని, నన్నే పెళ్ళి చేసుకుంటానని రాశావుకదా! నిన్ను ప్రేమించి పెళ్ళిచేసుకుందామని నేను ఎన్నో ఆశాసౌధాలు కట్టుకున్నానే! అటువంటప్పుడు మరి నువ్వు చటుక్కున అమ్మాయివైపోతే నేను ఏడవక నురేం చెయ్యను" అని ఘొల్లుమంది పద్మ.


నాకు మతిపోయింది, పద్మనన్ను ప్రేమిస్తోందని తెలిస్తే నేను అబ్బాయిగానే వుండిపోదునే! ఎందుకు! ఎందుకు ఇలా అమ్మాయినయ్యాను. నేను అమ్మాయినైనందుకు పర్యవసానాలు. నాస్నేహితుల్లో దెబ్బలాటలు. సలీమ్ మేష్టారి ప్రేమలేఖలు, మూర్తిగాడి నిరాశ నిస్పృహలు— అన్నిటినీ మించిన పద్మ ప్రణయసౌధాల శిధిలాలు!!... ...


"ఏమిటి భగవాన్, ఈ కష్టాలు? నన్ను మళ్ళీ అబ్బాయిని చేసేయ్" అని నేను బాధపడుతుండగా నాకు లేహ్యండబ్బీ మాట జ్ఞాపకంవచ్చి వెదకడం మొదలుపెట్టాను.

"ఏమిటండీ అలాపర్సు పారేసుకున్నట్టు ఇల్లంతా వెతుకుతున్నారు" అని మా శ్రీమతి పద్మ నన్నునిద్ర లేపి—

"మనకి పెళ్ళి అవకముందు కనవలసినకల యిప్పుడు కన్నారేమిటి కొంపదీసి" అనడిగింది.

□□□





# కాటుక కంటినీరు

"నువ్వు ఎక్కవలసిన రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు"......

విజయవాడ బస్‌స్టాండ్‌లో బందరు బస్‌కోసం నానాయాతనా పడుతూంటే పైమాట గుర్తొచ్చింది. పక్కనున్న బందరుకే టికెట్ దొరకడం కష్టం అయి—దొరికింది! అనుకునే సరికి మధ్యాహ్నం అయింది. చుట్టూ చూస్తుంటే మూడువంతుల మొహాల మీద నిస్పృహ, ఆతృత, చిరాకు రాగం తానం పల్లవీ కలుపుతున్నాయి.

"చూడు బాబూ—నా జేబులో పర్స్ యెలా పోయిందో తెలియదు. ఉయ్యూరు వెళ్ళాలి. ఏమనుకోక నాకు టికట్ తీసిపెట్టగలవా? అంత వరకూ ... ..."

నన్ను ప్రశ్నించినవైపు తిరిగాను.

తల పండింది. వయసుకన్నా, బాధల ప్రభావం శరీరాన్ని లొంగ తీసుకున్నట్టుగా వుంది. మామూలు పంచె, ఖద్దరులాల్చీ, అవయవాల అలసటని కొంతలో కొంతకప్పిపుచ్చుతున్నాయి. చేతిలో వేంకట్రామా అండ్ కో వారి సంచీ. ఆ శరీరం మీదనుంచి పదేళ్ళు తొలగిస్తే; కాదు నా జ్ఞాపకాన్నే అన్ని సంవత్సరాలు వెనక్కి నెట్టగలిగితే—ఇలాంటి మనిషిని చూసి వుంటానన్న ఊహ, చుక్కలా మెదుల్తూ మెదడంతా కుదుపుతోంది.

"అక్కడ దిగ్గానే బస్ స్టాప్‌లో ఎవర్నయినా అడిగి ఇస్తాబాబూ..."

ఇటువంటి తాత్కాలిక ఆపదలు అసహజం కాకపోయినా—చాలా మందికి యిలా అవసరాలు గడుపుకుందుకు ఒక ఎత్తుగా మారుతున్న యీ రోజుల్లో అనుమానం కలగడం సహజం. ఆయనవైపు చూస్తే, తిరిగి గుర్తుచేసుకోలేని నా మెదడు వోడిపోయి—అప్రయత్నంగా ఉయ్యూరు టికెట్ తీయించింది. ఆయన కృతజ్ఞత చెప్పబోతూంటే "ఫరవాలేదులెండి" అన్నా.

"ఇంటి దగ్గర అదొక్కత్తే పిల్లల్తో అవస్థ పడుతూవుంటుంది. పైగా జబ్బుమనిషి"...



బస్‌లో వెళ్ళి కూర్చున్నా. ప్రపంచం అభ్యుదయం వైపు యెంతో వేగంగా పరిభ్రమిస్తోంది. ఇటు వ్యక్తి కూడా యెన్నో జటిల సమస్యల్ని ఛేదించుకుంటూ బ్రతుకుతో హర్డిల్స్ ఆడవలసివస్తున్న రోజులివి. మనిషి కోసం యెన్నో సదుపాయాల్ని ప్రభుత్వం, జాతీయత అనే సముద్రం నుంచి మధించి తీస్తుంటే—మరో ప్రక్క మనిషిని వ్యక్తి పరమైన యిబ్బందులు చేదువైపు గెంటుకు పోతున్నాయి. సుఖాన్ని, దుఃఖాన్ని, ఆడంబరాల్ని, అవకాశాల్ని, పట్టుకున్న మనిషికి శాంతికూడా అశాంతే కలగజేస్తోంది.

"ఈబస్‌లు వెంటనే బయలు దేరవు. ఈపాటికి పెళ్ళి కాస్తా అయిపోయివుంటుంది..."

"అన్నీ యింతేనండీ... రైళ్ళు మాత్రం వేళకొచ్చాయా... మొన్న మెయిల్ ఆరుగంటలు లేటు. దాంతో నా కారువేలు నష్టంవచ్చింది..."

"పైగా ప్రాణాలకి భరోసా యేడ్చిందా అంటు"...

పైకి నవ్వు తెప్పించినా, ఆమాటలు నన్ను ఆలోచనల వలలోకి లాగాయి... ఉదయం యింటిదగ్గర కన్పించకపోతే నాన్న యీపాటికి శివతాండవం చేస్తుంటాడు. అలనాటి పార్వతీదేవి అంశ అమ్మలోవున్నా—భర్తలోలేని మూడోకన్ను, ఆయన నోరే అని నిర్ధారణ చేసుకుని, తాత్కాలిక రక్షణ శిబిరంగా వంటింటినే చూసుకుంటుంది ఆవిడ. ఇక ఆయన్ని శాంతింప చేసే ప్రమథగణాలు—పక్కింటి రామచంద్రంగారు, "వూరుకో నాయనా" అని చమత్కారంగా మందలించే దొడ్లో వాటా బామ్మగారు, "మామయ్యా" అంటూ ఆయనలోంచి పుట్టే అగ్నిని—నిప్పుతోనే అటకాయించాలని చుట్ట అందించే సీత.

ఆరేళ్ళు హైస్కూల్లో, ఆపైన నాలుగేళ్ళు కాలేజీలో చదువుకున్నందుకు గుర్తుగా తనకో డిగ్రీ వుందని, తాననుకుంటే "మొత్తం నీ చదువు తూకం మూడెకరాలు" అంటాడు నాన్న.

"చదువుకుని నామాట వినకుండా పోయావురా" అంటుంది అమ్మ.

"వోయ్ శంకరంబావా! నీమెదడు బి.ఏ., ప్యాసయ్యింది. దానిమార్కెట్ ధర నెలకు నూరు రూపాయలు మాత్రం. అప్పుడప్పుడు అపనిందలూ, అవమానాలూఅందుకుంటూవుండాలి. నువ్వు పోగొట్టుకునేది వ్యక్తి స్వాతంత్ర్యం. పొందేది భావదాస్యం."

"పెళ్ళిచేసుకో... వుద్యోగంరాక పోదు." చిన్నాన్న సలహా...

చిన్నతనం, ఆతరువాత చదువు, ఆపైన వుద్యోగం, వాటి బాధ్యతలు,

శ్రీ సుభా

వీటిమధ్య వివాహం, భార్య, ఫుక్కిరిబిక్కిరిచేసే ఆనందపు జల్లు, ఉండుండి అలకల గాలివానలు, ఆపైన పిల్లలు, తిరిగి వాళ్ళ పెంపకం, చదివించడం, సంఘంలో మారడానికి నడుంకు వ్యక్తిత్వం గడకర్రను ఆశయాల తాళ్ళతో బిగించి వాళ్ళనిసంఘంలోకి వదలడం, అప్పుడప్పుడు ఆశయాల త్రాళ్ళు ముళ్ళు సడలించుకుంటాయి. వ్యక్తిత్వం పటుత్వం తగ్గి వెన్నెముకలో ఐక్యం అయిపోతూవుంటుంది.

"చూడబ్బాయి!"... చూశాను.

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?" ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి .అడిగాడు.

ఎలా చెప్పాలో తెలియక "ఆచరించలేనిది, అందుకోలేనిది"అన్నాను.

ఆయన నవ్వేశాడు. "నిజమే చెప్పావు. చెయ్యలేనివీ, చేతకానివే ఆలోచనలోకి వస్తాయిటు."

ఇంతలో వుయ్యూరులో ఆగింది బస్. దిగేవాళ్ళు దిగుతున్నారు. కండక్టర్‌కూడా దిగి ప్రక్కనున్న కాఫీ హోటల్లోకి వెళ్ళాడు.

"చూడు నాయనా... ఇదిగో టికెట్‌డబ్బు" క్రింద నిలబడి కిటికీగుండా అందిస్తున్నాడు, ఇందాకటి వ్యక్తి.

"అక్కరలేదు ... వుంచండి" అనాలనిపించింది. కానీ అవతల మనిషి నొచ్చుకుంటారేమో నన్ను మొహమాటంచేత మారుమాట్లాడకుండా తీసుకున్నాను.

"సమయానికి సహాయం చేశావు. వస్తానాయనా" అంటున్నారు, వెళ్ళిపోతూ.

ఆయనవైపే చూస్తున్నాను. ఎక్కడో చూశానీ మనిషిని. అందుకే "చూడండి మేష్టారూ" అన్నా ఆత్రుతగా. అంతే. ఆయన నావైపు తిరగడం, నా జ్ఞాపకశక్తి అలసటుని పోగొట్టుకుని విజయగర్వంచేతకళ్ళద్వారా ఆనందించడం అన్నీ జరిగాయి.

"సీతారామయ్య మేష్టారూ" అన్నా, నాకు తెలియకుండానే బస్ దిగాను.

"ఇందాకటినుంచీ మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను మేష్టారూ! మీ పేరు సీతారామయ్యగారు కదూ ..."

"ఔన్నాయనా..."

"నేను గుర్తున్నానండీ ...శంకర్రావుని ..." ఆయన గుర్తుచేసుకుంటున్నారు.

బడిపంతుళ్ళకు మరీ బాగా చదివేవాళ్ళూ, లేకపోతే పిచ్చగా అల్లరి చేసేవాళ్ళూతప్ప గుర్తుండరన్న లోకోక్తి నిజమేనేమో...ఆ లెక్కనయితే నాది చిన్నప్పటినుంచీ నాయనమ్మ అన్నట్టు అత్తెసరు చదువే. ప్రతీ పేపర్లో నూటికి డబ్భై మార్కులు తెచ్చుకునే రమణ నాకు వింతగా కన్పించేవాడు. అలాగే రెండు జేబులనిండా జీళ్ళు పోసుకుని తింటూ ఆ పైన పక్కవాడి కంపాస్‌బాక్స్‌లో పెన్సిల్స్ అవీ దొంగిలించే సదానందం ఆశ్చర్యంగా ఉండేవాడు. రమణంత బాగా చదవడం, లేక సదానందంలా అల్లరి చెయ్యగల్గడం యీ నాటికీ నాకు తీరనికోరికలే. ఆ లెక్కన సీతారామయ్యగారికి నేను గుర్తులేకపోవడంలో అన్యాయంలేదు.

"మాకు హిష్టరీ, ఇంగ్లీషు చెప్పేవారు."

"వూహూ" అంటున్నారాయన.

"ఓ సారి నేను బొంబాయిఎక్కడో గుర్తుపెట్టమంటే మద్రాసుదగ్గర నోట్ చేశానని, పేకబెత్తం..." ఆగాను.

"గుర్తొస్తోందోయ్ యిప్పుడు ..." వార్ధక్యానికి విరుగుడయిన కళ్ళజోడులోంచి కళ్ళు మెరుస్తున్నాయి...

"ఇప్పుడేం చేస్తున్నావు? ఉండటం యెక్కడ ?"

"చిన్న వుద్యోగం అండీ...ఏదో బ్యాంక్‌లో... ..."

"మీవాళ్ళంతా బావున్నారా ? పెద్దవాడి వయిపోయావు. అప్పుడప్పుడు నీలాగే పలకరిస్తూవుంటారు, కొందరు. చాలా బావుందినాయనా."

"ఈ దేశంలో మేష్టరీ ఉద్యోగానికి పరపతి లేదురా" అంటాడు కాశీపతి, కాలేజీ లెక్చరర్‌గా నాలుగేళ్ళ అనుభవంతో. నేనొప్పుకోను దానికి. ఆత్మతృప్తిని—అదీ ఉద్యోగంద్వారా పొందగల్గేది ఒక్క ఉపాధ్యాయుడే—ఈ దేశంలో.

"ఎంతవరకూ ప్రయాణం ?"

"బందరండి."

ఇంతలో కండక్టర్ "రండి, రండి" కేకలు మొదలు పెట్టాడు.

"ఎలాగూ బస్ దిగావు. మా యింటికి వచ్చి వెళ్ళవోయ్...నిన్ను చూస్తుంటే..." ఆగిపోయారాయన.

ఆయన మాట కాదనాలనిపించలేదు. కానీ, నేను వెళ్ళాల్సిన అవసరం గుర్తొచ్చి అన్నాను."మరి నన్ను నాలుగుగంటలకు వదిలెయ్యాలి మేష్టారూ" అని.

ఇద్దరం పోష్టాఫీసు రోడ్డుగుండా వెడుతున్నాం. మేష్టారబ్బాయి రాజశేఖరం గుర్తుకొచ్చాడు. అతను మాకన్నా ఓ క్లాసు ఎక్కువ చదువుతూవుండేవాడు. అదే అడిగాను. ఆయన చటుక్కున నా వైపు చూసి "వాడు" అని ఆగిపోయారు.

ఇంతలో వీధిలో ఆడుకుంటున్న పసివాళ్ళలోంచి ఇద్దరు "తాతయ్యా" అంటూ వచ్చి ఆయన్ని చుట్టుముట్టారు. ఆయన మరీ చిన్నవాణ్ణి యెత్తుకుని, రెండోవాడు పంచెపట్టుకుని వేళ్ళాడుతూంటే "రావోయ్, ఇదే యిల్లు" అన్నారు.

పిల్లలతో ఆయన లోపలికి వెళ్ళారు. చాలా సాదాగా ఏ దర్పంలేని వ్యక్తి చూపులా వుంది యింటి వాతావరణం. పాతకాలంనాటి మంచం. అవే కుర్చీలు. అద్దాలు పగిలిపోతే బీటలోంచి మాసిపోయి నవ్వే బంధువుల, దేవుళ్ళ ఫొటోలు. మేకున అద్దం... పక్కన గోడకు కాటుక మరకలు. నవ్వొచ్చింది. మేష్టారు మేష్టారేగాని మినిష్టర్ కారుగా. అసాధారణంగా మేష్టారు బ్రతుకు వెళ్ళమార్చలేరని నాకు తెలిసిందే. ఐతే సాధారణం

కూడా బాధకల్గించేదే అయినప్పుడు పైదాన్నే మనిషి వాంఛిస్తాడేమో... లేకపోతే ఆ యింటిని యింకా లోతుగా పరీక్షించడం జరగకపోను. అలాగే కూర్చున్నా.

"కాఫీ తాగు బాబూ!"

"ఎందుకండీ ఇదంతా చాదస్తం..."

"అదేమిటి నాయనా! మా అబ్బాయిలాంటివాడివే..."

"ఏమండీ... ఎవరూ వస్తా?" లోపలి నుంచి చిన్న పిలుపు వినిపించింది.

"మన శిష్యుడే... శంకర్రావు..."

"అలాగా... అమ్మాయేమో అనుకున్నాను."

ఆవిడ లేచివచ్చింది నెమ్మదిగా

"నువ్వెందుకు లేస్తావు? ప్రకాశాన్ని పిలవకూడదూ?"

"ఎంతసేపని ఆ గదిలో వేగ్గి పోమ్మంటారు?"

వచ్చిన రాజేశ్వరమ్మగార్ని చూసి "నమస్కారమండి!" అనగలిగాను. మనిషిలో నాకు తెలిసిన పోలికలు చాలామటుకు లేనే లేవు. నాకు కొత్తగా, ఆపైన భయంగా కన్పించినవి పీక్కుపోయిన, కొండెక్కిపోతున్న దీపాల్లాంటి కళ్ళు... ...బోసి మెడమీద పసుపురంగు మిగుల్చుకుని ఆక్రమించే పుస్తెలతాడు... ప్రాణం అన్నది శరీరంలోని అన్ని అవయవాలలోనూ కాకుండా యెక్కడో ఒకచోటే, అదీ నామమాత్రంగా వేళ్ళాడుతోన్నట్టున్న ఆకారం. "అచ్చు అబ్బాయిలా వున్నాడండీ" అంటోంది నోరు. ఆ భార్యాభర్తల చూపులు కలుసుకున్నాయి... ఆవిడేమనుకుందో లోపలికి వెళ్ళిపోయింది. దిష్టిబొమ్మ నడుస్తోన్నట్టుగా వుంది... ఏ చప్పుడూ లేదు.

"ఇదీ నాయనా, మీ మేష్టారికి మిగిలింది."

"ఆవిడకేమిటండీ జబ్బు?..."

"భగవంతుడు చేసిన అన్యాయం దాని నడుం విరగ్గొట్టింది మనిషిగా ఏం చెయ్యలేని నేను దాన్ని రోగిష్టిదానిగా మార్చేశాను... ఆ రెండిటితో మంచాన పడింది."

"అదేమిటి మాష్టారూ! మరి రాజశేఖరం..."

ఆయన నెమ్మదిగా అన్నాడు... "వాడు పోయాడు నాయనా... వాడుంటే మాకీగతి పట్టకపోను..."

"అరే" అన్నాను నొచ్చుకుంటూ.

"నాలా కాకుండా పైకొస్తాడని దాని నగానట్రా అమ్మి చదువు చెప్పించాం. అలాగే చదువొచ్చింది. ఈ లోపునే సరదాపడి పెళ్ళిచేశాం. ఇద్దరు నలుసులుకూడా బయలుదేరారు. కాని మా దురదృష్టం— యేడాది క్రితం భగవంతుడు వాణ్ణి మాక్కాకుండాచేశాడు..."

"చాలా అన్యాయం జరిగిందండీ"

"ఆఖరికి జబ్బువాతపడ్డ అదీ, భర్తపోయిన కోడలూ, అప్పులతో మిగిలిన యీయిల్లు... యేదో క్రిందామీదాపడి బ్రతుకుతున్నాం..."

"మరి... ..."

"అవున్నాయనా... యింకా పెళ్ళికి పార్వతి మిగిలేవుంది. దానంత



టదే చదివి మెట్రిక్ ప్యాసయ్యింది. ఇంటికోసం వుద్యోగం చేస్తానం టుంది—అది. పెళ్ళిచెయ్యమంటుంది వాళ్ళమ్మ. కాదు, ఆడబ్బుతో అమ్మను విశాఖపట్టణం తీసుకు వెడదామం టుంది, పార్వతి. ఏం చెయ్యాలో ఏమనాలో తెలియక మౌనం వహి స్తాను నేను ...”

నే నెరిగిన సీతారామయ్యగారు జవసత్వాలు కలిగినమనిషి. వెనక రెండెకరాల పొలం కలిగిన దిట్ట. ఇద్దరు కూతుళ్ళకు ఐదు రోజుల పెళ్ళిళ్ళు చేసిన మధ్య తరగతి కుటుం బీకుడు. క్లాసులో గంభీర కంఠంతో శ్రీకృష్ణదేవరాయలు కొండవీడుని యెలా ముట్టడించిందీ చెబుతూంటే మా వళ్ళు గగుర్పొడిచేది. ఇంటి కొచ్చి ఆ కంఠాన్ని అనుకరిస్తూ ఆడు కునేవాళ్ళం. అటువంటిది పదేళ్ళు తిరిగేసరికి కాలం ఆయన బ్రతుకుని విధి పేరిట ముట్టడిచేస్తే— పతన మయిన సామ్రాజ్యపు ప్రాకారంలా, క్రీనీడలావున్న ఆయన్ని చూడలేక పోతున్నాను.

“భగవంతుడు తను తయారు చేసిన మనిషితో దొంగాట లాడు తాడు. భయపెడతాడు. ఒక్కొక్క సారి గిలిగింతలు పెడతాడు. ఆఖరికి తిరిగి తనలోకి తీసుకుంటాడు. ఆయ నకు చేతకానిదిలేదు ...ఏపని చేసినా ఆయనకే చెల్లింది.” తాతయ్య వేదాంత ధోరణి గుర్తొచ్చింది. కోపం కూడా వచ్చింది.

“బాధపడకండి మేష్టారూ! మిమ్మ ల్నెలా ఏోదార్చాలో నాకు తెలియ డంలేదు. చెప్పాలంటే భగవంతుడి మీద మీకు నమ్మకం వుందో లేదో తెలియదుగాని— మీ కుటుంబానికి చేసిన అన్యాయం చూస్తూంటే, నమ్మకం లేకపోవడమే మంచిదని పిస్తోంది ...”

ఆయన నవ్వాడు—చీకటిలా.

“లేదు నాయనా, అలా అనకూ డదు ...ఏం చేసినా ఆయనకే చెల్లింది ...మనుష్యులు సంతోషాన్ని భరించగలరు గానీ దుఃఖాన్ని సహిం లేరు. సంతోషం అనేది లోతైన నీటిలో యీతరాక గంతులువేయ డం లాంటిది. ఆసమయంలో మనిషికి తను బ్రతకాలన్న ధ్యాస తప్పించి— యెలా బ్రతికి బయట పడడమో తెలియదు. అందుకే సంతోషంలో మనిషితనపరిసరాలనుమరిచిపోతాడు. ఆఖరికి భగవంతుణ్ణికూడా— దుఃఖం అలాంటిదికాదు. నిండానీటిలోతన్ను తను రక్షించుకోగల నేర్పువుండీ పదిమందిని రక్షించాలన్న ఆవేదన, హృదయపు ఆరాటం లాంటిది. అం దుకే మనిషి అటూ యిటూ, క్రిందా మీదాపడతాడు ...అంతా తెలుస్తూనే వుంటుంది ...అదో చెడ్డైన అనుభవం అయినా, వైశాల్యాన్ని, విజ్ఞతను పెంచుతుంది.”

నాకేమనాలో తెలియ లేదు ... వింటూనే వున్నాను. ఇంతలో స్కూలు నుంచీ నాన్నా అంటూ వో చిన్న మ్మాయి వచ్చింది ...

“నేను వెడతానండీ” అన్నాను.

“మంచిది నాయనా ... చాలాకా లం తరువాత కన్పించావు ... యిటు వేపు వెడుతుంటే అప్పుడప్పుడు కన్పిస్తూవుండు.”

“తాతయ్యా! పార్వతత్తయ్యొ చ్చింది.” అంటూ ప్రకాశం వీధిలోంచి పరుగెత్తుకువచ్చాడు ... బయట రిక్షా ఆగిన చప్పుడు విన్పిస్తోంది ...

ఎడం భుజంమీది పమిటని కుడి భుజంమీదికి లాక్కుంటూ, చిన్న సైజుసంచి ఏోకచేత్తో పట్టుకుని, రెండోచేత్తో జుట్టు సవరించుకుంటూ లోపలికి వస్తున్న అమ్మాయి “నాన్నా” అంటూ సీతారామయ్యగార్ని చూసి ఆ పైన నా వైపు చూసి కంగారుగా లోపలకు వెళ్ళిపోవడం జరిగింది.

● ● ●

పార్వతి సీతారామయ్యగారి కూతురవడం నేను వూహించనిది. పార్వతి మా మేష్టారమ్మాయిఅయితే ఆయన చెప్పిన మాటలబట్టి డీలాపడ్డ తండ్రిని ఉద్యోగంచేస్తూ ఆదుకోవా లన్న ఆ అమ్మాయి నిర్ణయానికి ఎంతో సంబరపడతాను. అన్నగారు పోయి తమ యింట్లో రోజులు వెళ్ళదీస్తున్న రాజశేఖరం భార్యా, పిల్లల్ని అభిమా నంగా చూస్తూ, మంచానపడ్డ తల్లికి సేవలు చేస్తున్న కూతురుగా ఆ స్త్రీని నేను గౌరవిస్తాను.

కానీ, యీ నా అభిప్రాయాల వల్ల పార్వతికి ఏ మేలూ జరగదని, నా ఉద్దేశాలు తెలిసి పార్వతి నాకు కృతజ్ఞత తెల్పే అవకాశం కలగ దనీ తెలుసు.

కష్టాలు యీడ్చి కొడుతూంటే పెళ్ళి యెలా చెయ్యగలనా అనే మీమాంసతో, ఆలోచనలతో తూట్లు పడిపోతున్న తండ్రితో తన కిప్పట్లో పెళ్ళి వద్దన్న పార్వతి మాటలవెనుక చేదునిర్ణయానికి జాలిచూపే పరిస్థి తిలో నేను లేను. అందగత్తె కాక పోగా, కనీసం డబ్బు సమకూర్చే అలంకారాలు లేక, అతి మామూలుగా పెళ్ళికూతురుగా పార్వతిని చాలా మంది యువకులు యేవిధంగా విలువ కడతారో నేను వూహించనవసరం లేదు.

పదిరోజులనాడు అమ్మ వేడికోలు— సీత బలవంతం—ఇన్నిటినీ కాదన లేక నేను విజయవాడలో పెళ్ళి చూపులు తప్పించుకోలేకపోయాను. చిన్నాన్న చుట్టంచూపుగా విజయ వాడ వెళ్ళిన నన్ను, అమ్మను బల వంతం పెట్టాడు.

“నన్నే పెళ్ళాడని ఆ అమ్మాయి, నిన్నేం బలవంతం పెట్టదు సరా?” అన్నాడు చిన్నాన్న.

“ఇంతకీ యెవరయ్యా మరిదీ?”

“మనవాళ్ళే, మనశాఖే. పైవాళ్ళ పిల్లని మీవాడు చేసుకుంటానన్నా, యెలాగూ నువ్వా అన్నయ్యా పడ నిచ్చేది లేదుగా ... వెంకట్రావుగారి అన్నగారి కూతురు. ఆయనగారికేం లెదుట. వీళ్ళు యేదో తంటాలుపడు తున్నారు ... ...”

“అలాగా!”

“కట్నంగురించి ఆశ పెట్టుకోకండి మరి.”

"అయ్యో బాగా నేవుంది... ఇవన్నీ మీ అన్నయ్యవుంటే తేలేవిగా..."

"చూడమ్మా ఒదినా... నలభైయేళ్ళ కాపురంలో ఒక్కవిషయంలోనూ, అన్నయ్యమాట నువ్వు కాదనిలేదు. కనీసం శంకరం యేఒక్కవిషయంలోనయినా మీ యిద్దర్నీ కాదంటే నాకు చూడాలని వుంది."

"వాడిని పాడుచెయ్యి నువ్వు." అమ్మ నవ్వుతోంది.

"మనిషికి స్వంతంగా ఆలోచించే అవకాశం యివ్వడం నా ఉద్దేశం..."

ఆ మధ్యాహ్నం నేనూ, అమ్మా, సీతా వెళ్ళి పెళ్ళికూతుర్ని చూడ్డం జరిగింది... ...

అతి సాధారణంగా కూర్చుని, కళ్ళెత్తి నా వైపు చూసింది. ఓ భయంకరమైన దుస్వప్నాన్ని చూస్తోన్నట్టు, భవిష్యత్‌లో రానున్న మహా ప్రళయాన్ని వూహించి విలవిల్లాడుతోన్నట్టుగా వుంది ఆ చూపు. అందమైనవాటిని,నచ్చినవాటిని చూస్తే కళ్ళల్లో సంతోషం రగుల్తుందంటారు ఎందుకా అమ్మాయి నన్నుచూసి భయపడిందో నా కా రోజు అర్థంకాలేదు.

కానీ, యీ రోజు నా కర్థం అయ్యింది. ఆ అమ్మాయి సీతారామయ్యగారికూతురు పార్వతి. అందుకే నన్నుచూసి భయపడింది. అప్పులతో అంతంతమాత్రంగావున్న పెంకుటిల్లు తన పెళ్ళిపేర పరులపరం అయితే, అస్వస్థతగావున్న తల్లి మందులేక మరింత మాగిపోతే, పెళ్ళిఖర్చు తండ్రిని వీధిలోనిలబెట్టి వేలంవేస్తే, బొందులాగు తమ్ముడూ, చిరుగుపరికిణీ చెల్లెళ్ళ అర్ధాకలి కడుపులో అంతర్యం విచ్చుకునిరంకెలువేస్తూంటే ఓ మొగవాడిని వశీకరించునే మాయలు, మంత్రాలు తనవద్ద లేవని తెలిసి నల్లబడింది. అందంగాలేని, ఆనందం యెరగని మధ్యతరగతి మట్టిబొమ్మకు అత్యాశ అనే రంగులు పులుముకుంటే, పగిలినతరువాతైనా పదిమందీ ఆక్షేపిస్తారన్న నిజం తెలిసిన మనిషి కావడంవల్ల నిరాశ దాచుకోలేకపోయివుంటుంది."

"కట్నం యివ్వలేరుట వాళ్ళు" అమ్మ నాన్నతో చెప్పింది.

"వీడే దొరికాడా తేరగా..."

"అమ్మాయి యెలావుంది."

"అంతంతమాత్రంగానేవుంది" సీత అంటోంది...

"మరి వీడేమంటాడు..."

నేను యేమీ అనలేనని—అనకూడదనీ నాన్న వుద్దేశ్యం.

"వెళ్ళగానే ఏసంగతీ జవాబు వ్రాయమన్నారు మీ తమ్ముడుగారు."

"వాడొకడు... దేశోద్ధారకుడు బయలుదేరాడు. సీతా, పిల్లనచ్చలేదనీ కట్నం కావాలనీ రాసిపడెయ్"...

"బావకు నచ్చిందేమో" అని నాన్నతో అని, నా దగ్గరకు వచ్చి,

"నీకుగాని నచ్చితే చెప్పమంటున్నాడు, మావయ్య" అంది సీత.

"నాకు పార్వతి నచ్చిందా నచ్చలేదా? పార్వతి భయంగా నా వైపు చూస్తున్న దృశ్యం కన్పించింది, తిరిగి... ...

ప్రయాణంపొడుగునా జ్ఞాపకాలు నాతోపాటు తరుముకు వస్తున్నాయి. నన్నుచూసిన పార్వతి యేమనుకుంటుంది? తండ్రితో యేం చెప్పివుంటుంది? దానికి ఆయన అలసిన గుండె యిచ్చిన తీర్పేమిటి? ఆలోచిస్తూంటే తలపోటు రాసాగింది... అయినా వాటినుంచి తప్పించుకోలేకపోయాను. ఊహాలు వూడలై మెదడులో నాటుకుంటున్నాయి...

● ● ●

"వాళ్ళకు యిది నచ్చిందంటారా" రాజేశ్వరమ్మగారు భర్తని అడుగుతోంది.

వాళ్ళకు కట్నం కావాలేమో యీయిల్లు అమ్మిచేసేస్తాను పార్వతి పెళ్ళి... అదైనా సుఖపడితేచాలు"...

అంతకుముందే అక్కడకు వచ్చిన పార్వతి కంగారుగా అంటోంది. కంఠం అంతా కన్నీటితో తడిసింది... మాటలచుట్టూ భయంకరమైన భవిష్యత్ అడ్డు తగులుతోంది.

"వద్దు నాన్నా వద్దు. ఈయిల్లు అమ్మొద్దు"...

అదేమిటే, ఆసంబంధం మంచిదని పిన్ని వ్రాసింది... వాళ్ళది బందరేటగా"

"నీకు తెలియదమ్మా...—వాళ్ళకి నేను నచ్చలేదు. ... మన బీదతనం అసలేనచ్చదు."

"నువ్వూరుకో....మీరు వెళ్ళిరండి వోసారి బందరు."

"నాన్నా... అతనికిచ్చి నన్ను పెళ్ళి చెయ్యొద్దు. వాళ్ళు నేను నచ్చలేదని వ్రాశారుట. మీరు బాధపడతారని పిన్ని అలా రాసివుంటుంది. నిన్నొచ్చాడు. అతనేనాన్నా నన్ను చూసిన అబ్బాయి..."

పార్వతి పరుగునదొడ్లోచీకటిలోకి పారిపోయింది. పార్వతిని చూడలేక చంద్రుడు మేఘాల్లో దాక్కున్నాడు. నూతిగట్టుకు తలపెట్టుకుని చుట్టూ నిశ్శబ్దాన్ని భంగంచెయ్యలేక చిన్నగా యేడుస్తున్న పార్వతినిచూసి నల్లకాకి చీకట్లో తెల్లబోయి—ఆపైన అరుస్తూ పారిపోయింది. వేపచెట్టు వోదార్పుగా చేదుగాలి వరంగా వదిలింది. నూతిలోపల అట్టడుగు నీళ్ళలో కప్ప యేం చెయ్యలేక తలెత్తి లోపలకు వెళ్ళిపోయింది ... ... ...

● ● ●

అంతవరకూ ఆలోచించాను. ... యింకా... యింకా... ఆరాత్రి నా తలలో వెయ్యి యేనుగులు పరుగులు పెట్టాయి. వాటి పాదాలక్రింద సీతారామయ్య మేష్టారు, ఎముకలగూడు రాజేశ్వరమ్మగారు, చెదిరిన మబ్బు తునకలాంటి పార్వతి, విరిగిన పాలలాంటి పసివాళ్ళు దుమ్ములో అణువులవుతున్నారు.

లేచి వెంటనే వుత్తరం వ్రాశాను. ఆ తరువాత సీతతో మాట్లాడాను. మొదట వింతగావిన్న సీత, ఆపైన అనునయంగా తలూపి, సానుభూతిగా చూసి వంటింట్లోకి వెళ్ళింది. అత్తయ్యని పిల్చింది. మొదట అనుమానపడి, ఆ తరువాత ఆనందపడి,

ఆ రెంటిని మించిన భయం పుట్టుకువస్తే వణికిపోయి సీతను ఆసరాగా చేసుకుని భర్తగదిలోకి వెళ్ళింది. ఆ గదిలో పెద్ద ప్రళయం రేగింది. గాలి వానగామారింది. ఆతరువాత హోరు సన్నగిల్లింది. వర్షం కుండపోతనుంచి, చినుకులుగా మారి మాయమైంది.

సీతారామయ్యగారి జవాబుకోసం యెదురు చూస్తున్నాను. ఈ లోపున ఆశ, ఆత్రుత, ఆపైన ఆవేదన, మళ్ళీ ఆలోచన. ఆ నాడు అంత చీకటిలోనూ బస్‌స్టాండ్‌కు వెళ్ళి "విజయవాడ వెళ్ళే బస్ ఉందా" అని అడిగాను.

"ఓ క్షణంక్రితమే వెళ్ళిపోయింది" అన్నా రెవరో.

● ● ●

తెల్లవారినతరువాత ఒక ఉత్తరం అందుకున్నాను.

"శంకరానికి ఆశీస్సులు.

నీ ఉత్తరం అందింది. పార్వతిని పెళ్ళి చేసుకుంటాననీ, అందుకు మీ వాళ్ళు వొప్పుకున్నారనీ వ్రాశావు. మొదట నేను ఆనందంతో ఉక్కిరిబిక్కి రయ్యాను. కానీ, రిటైర్డ్ బడిపంతులుగా నేను నీకేం యివ్వగలను చెప్పు.

ఇక పార్వతి గురించి. అది తన నీడనిచూసి భయపడే ఆడపిల్ల. బ్రతుకు దాన్నావిధంగా పెంచింది. మరీ డబ్బున్నవాళన్నా, మరీ త్యాగాలు చేసేవాళ్ళన్నా అది వొణికిపోతుంది.

నిన్న మా యింట్లో చూసిన్నా డే మీవాళ్ళను బలవంతంగా ఒప్పించి యిలాంటి తెగింపుపని చేస్తావని దానికి తెలుసేమో! నీ పేరెత్తితే పారిపోయింది.

"మన సుఖంపేర పార్వతి పెళ్ళి వెనకపడిపోతోంద"ని వాళ్ళమ్మకన్నీరు పెట్టుకుంది. అవతలగదిలో తను పెళ్ళిచేసుకుంటే అంతంతమాత్రంగా వున్న మమ్మల్నీ, ఇంటినీ అన్యాయం చెయ్యడం అవుతుందని పార్వతి విచారపడుతోన్నట్టుగావుంది. దాన్నీ, ఆఖరికి నన్ను నేనూ సముదాయించుకోలేని యీ వాతావరణం చూస్తే నా గుండె విలవిల్లాడుతోంది... ...దానికి వుద్యోగంకూడా దొరికింది. పార్వతి అంటుంది! "నేను త్యాగం చెయ్యడంలేదు నాన్నా. నా ఆశయం తీర్చుకుంటున్నానంతే" అని...

నా వుత్తరం నీకు బాధ కల్గిస్తుందేమో. ఆఖరి మాటగా ఒకటి వ్రాయాలని వుంది... నిన్ను త్యాగానికి వుసి కొల్పేటట్టు చేసి నిద్రలేపిన నీ వ్యక్తిత్వం మీద నాకు నమ్మకంవుంది. చుట్టూ మా పార్వతిలాంటి వాళ్ళకు కొదవలేదు. అందులో యే వొక్క పార్వతికి నువ్వు భర్త అయినా నేను ఆనందిస్తాను. అప్పుడు పార్వతి కన్నీటికి కూడా విలువ కట్టిన వాడివవుతావు...

పరిస్థితులు మనిషిని వెనక్కు నెడుతుంటే ఆశయాలు మరింత బలవత్తరమవ్వాలి. నీవిషయంలో అది నిజం కావాలని కోరుకుంటున్నాను.

సీతారామయ్య"

□□□





"జ్యోతి" ష్యము :

# మూ(ము, మో) స ఫలితాలు

## మేషం :

విరామనసులో మీరేదో తల పోస్తున్నారు. అది జరగాలంటే మీరు గట్టి ప్రయత్నాలు చెయ్యడం ముఖ్యం. అది నెరవేరాలని భగవంతుని ప్రార్థించడం కూడా (నమ్మకం వుంటేనే) అవసరం. ఈమాసం పిల్లలకు అనారోగ్యం కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. (పిల్లలు లేనివారికి ఇది వర్తించదు) ముందే జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. మీ మామూలు ఆదాయం మామూలుగానే వుంటుంది. నెలాఖరు ప్రాంతాల ప్రయాణ సూచనలు కనిపిస్తున్నాయి. (క్యాంప్ ఏదేనా వుందా?) ప్రయాణాల్లో చాలా జాగ్రత్తగా మెలగటం అవసరం.

## వృషభం :

ఈ మాసంలో మీపై అధికారుల గౌరవం పొందగలుగుతారు. (బకాయి పనేవేనా వుంటే తొందరగా ముగించేయండి. లేదా, రాజమండ్రి నుంచి వచ్చాయని నాలుగు జామకాయలు తీసుకెళ్ళి వారికివ్వండి) మీ విరోధులు కొందరు మీకు అన్యాయం చెయ్యాలనిచూస్తున్నారు. (సహజమేగదా) జాగ్రత్తగా మెలగండి. నెలాఖరుకు డబ్బుకు ఇబ్బంది కలగవచ్చును. (మీరు మామూలు ఉద్యోగి ఐతే విధిగా కలుగుతుంది) మాసం మధ్యలో ప్రయాణం చెయ్యవలసి వుంటుంది. (సంక్రాంతి పండగకు అత్తవారింటికి వెళ్ళాలనుకొంటున్న కొత్త అల్లుళ్ళకు మాత్రమే) పండగ రోజుల్లో విందులు, వినోదాలు.

## మిథునం :

ఈ మాసం మీ ఉద్యోగంలో పెద్ద మార్పేమీ ఉండదు. (అది దేవుడు చెప్పినమాట) మీదగ్గర డబ్బున్నదని పసిగట్టి, మీ మిత్రులే అది కొల్లగొట్టాలనుకొంటారు. (మరేం లేదు, ఆఫీసువేళలో మీ జేబులో రూపాయి వుంటే మీమిత్రులు కాఫీ తాగుదాం పదమని బలవంతంచేయవచ్చు) పిల్లల ఆరోగ్యం బాగుంటుంది. (వాళ్ళకు బాగా పళ్ళూపాలూ చాక్లెట్లూ ఇస్తే) విద్యార్థులకు, యువకులకు, తీరికలేని మాసం. (పండుగరోజుల్లో అమ్మాయిలు ముస్తాబై వీధుల్లో తిరుగుతూ వుంటారు) గత 64 వ సంవత్సరం కంటె, ఈ కొత్త సంవత్సరం మీకు బాగుంటుంది. (ఎట్లాగూ మీరూ ఆ మాటే అనుకుంటారుగా)

## కర్కాటకం :

మాసారంభంలో శుభవార్తలు. (మీ ఆవిడగారు పండక్కి పుట్టింటికి వెళ్తాననడం లాంటివి) దానివల్ల తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు కలిగినా మీరు సర్దుకు పోగలరనుకోండి. బంధు సమాగమం కలగవచ్చును. (ఎట్లాగూ మీ ఆవిడగారు పండగకు పుట్టింటికి వెళతారు కాబట్టి మీ మామగారు మిమ్మల్ని కూడా ఆహ్వానించవచ్చుగా) నూతనవస్త్రాలు కొంటారు. (మీరే కొనక్కర్లేదు) కోర్టు వ్యవహారాల్లో ఈమాసం అనుకూలంగా వుంటుంది. (అసలా వ్యవహారాలే మీకు లేవా—థాంక్ గాడ్!)

## సింహం :

జీవితం ఉత్సాహవంతంగా వుంటుంది. (కొత్త సంవత్సరంగదూ) ఎంతో కాలంనుంచి చేస్తున్న ప్రయత్నాలేవయినా వుంటే ఫలించే సూచనలు (మాత్రమే) కన్పిస్తున్నాయి. మీకున్న సమస్యలేవీ ఇంతలో పరిష్కారం కావు. ఓ పట్టుపట్టి గట్టిగా పరిష్కరిద్దాం అని కూచుంటే పరిష్కారం కావచ్చును. వస్తువులు ఏవయినా కొంటారు. (అలవాటుంటే కనీసం సిగరెట్లయినా కొంటారు) ఇదికొత్త సంవత్సరంలో మొదటి నెల. ఈ నెలలో ముప్ఫయి ఒక్క రోజు వుంటుంది. ఈ అధిక దినంవల్ల ఒక రోజు ఖర్చు పెరుగుతుంది.

## కన్య :

ఈ మాసంలో మీకు మంచి బంగారం కొనేయోగంలేదు. (ఎట్లాగూ లేదు) మంచులో తిరగవద్దు— జలుబు చేసే ప్రమాదం వుంది. మాసాంతంలో ప్రయాణయోగం వున్నట్టుంది. (దయచేసి మీ ఆవిడతో పెద్ద పోట్లాట పెట్టుకోండిసార్) మీరంటే మీ మిత్రులకున్న గౌరవం ఇంకా ప్రబలే అవకాశాలున్నాయి. (బాగా టిఫిన్లు పెట్టించి కొత్త సినిమాలకు తీసుకుపోండి) మొత్తంమీద శుభప్రదమైన కాలం. (కాదని రాస్తే ఈ ఫలితాలు మీరు చదవరు)

## తుల :

జీవితంలో మీరు అనేకమైన ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. ధైర్యంతో ఎదుర్కొనే ప్రయత్నాలు చేస్తారు. (ఆఫీసుకు పోయేవేళకు బస్ దొరక్కపోవడం, సినిమాకు పోదామనుకుంటే, ఆఫీసర్ అర్జెంటు కాయితాలు చూడమనడంవంటి వయినా కావచ్చును.) శక్తికిమించిన ఖర్చులు కనిపిస్తూవుంటాయి. పండక్కి బోనస్ లాంటిది ఏదేనా డబ్బు రాదా(?) అని ఎదురుచూస్తూ వుంటారు. స్పెక్యులేషన్, లాటరీల్లాంటి వాటిల్లో దిగవద్దు. (దిగితే లాభం పొందానికాదు; చెప్పలేం.) విద్యార్థులకు సరిగా చదువు సాగదు (కొత్త సినిమాలు విడుదలౌతున్నాయి.)



## వృశ్చికం :

చిన్నప్పటినుంచి సలుకుబడి పెరిగే ట్టుగా కనిపిస్తున్నది. (పక్కింటాయన అప్పు అడగడానికి విధిగా రావచ్చు.) అతిసాహసంతోకూడుకున్న కొన్ని పనులు చేయాలనుకున్నా చెయ్యరు. ఆరోగ్యం జాగ్రత్త. వృత్తి-వ్యాపారాల్లో అభివృద్ధి కలుగుతుందని ఆశిస్తారు. (సహజం) ఉద్యోగులకు మాసారంభంలో ధనాదాయం (జీతాలు వస్తాయిగా).

## ధనుస్సు :

ఈ నెలలో మీకు వాహనయోగం వుంది. (మీకు సైకిలుందిగా. లేదా? ఐతే బస్సో, బండో, రైలో ఎక్కరా అని) సంపన్న కుటుంబీకులు విలువగల వస్తువులు కొంటారు. మీ మంచితనం మిమ్మల్ని కాపాడుతుంది. రోడ్డుమీద నడుస్తున్నప్పుడు రోడ్డు విధులన్నీ జాగ్రత్తగా పాటించండి. లేకపోతే రోడ్డుప్రమాదాలు జరగవచ్చు. మీ యజమానులదగ్గర వినయంగా సంచరించడం ముఖ్యం. (లేకుంటే చేస్తున్న ఉద్యోగానికి ముప్పు కలగవచ్చు.) ఎన్నడూ అబద్ధం ఆడకండి.

## మకరం :

మీరు జాగ్రత్తగా వుండకపోతే మీ యింట్లో దొంగలుపడి ఏవైనా వస్తువులు దొంగిలించవచ్చును దగ్గర బంధువుల వల మీకు ఖరులుపెరగవచ్చు. (ఎవరోకాదు. మీ భార్య, పిల్లలే. పండక్కి కొత్త చీర, పిల్లలకి బట్టలు తప్పవుగా! మీకు పెళ్ళైకాలేదా? ఐతే మీకు వర్తించదు.) శుభకార్యాల నిమిత్తం డబ్బు ఖర్చు చేస్తారు. బంధు-మిత్రుల రాకడ (పండుగ రోజులు) సత్ప్రసంగాలు, విందులు, వినోదాలు.

## కుంభం :

ఈ మాసంలో రచయితలకు పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి. (సంక్రాంతి సంచికల్లో రచనలు పడకపోతాయా?) బ్లేడులు, కత్తులు మొదలైన ఆయుధాలదగ్గర జాగ్రత్తగా వుండండి. మీరు చేదామనుకున్న ప్రతి పనికి మీ బుద్ధిబలం వుపయోగించడం మంచిది. అజీర్ణం కలగకుండా చూసుకోండి. కష్టపడి కృషిచేస్తే, దేవుడు కూడా అనుకూలిస్తే మీరు తలపెట్టిన పనుల్లో విజయం తథ్యం.

## మీనం :

ఇది లాభదాయకమైన మాసం. (ఏదోవిధంగా కలగదా అని) భోగిమంటలవల్ల అగ్ని ప్రమాదాలు జరుగవచ్చును. జాగ్రత్తగా వుండమని పిలలకు చెప్పండి. (మీపిల్లలేకానక్కర్లేదు) కుటుంబంలో శాంతి సౌఖ్యాలుంటాయి. (మీ ఆవిడకోరిన పట్టుచీర కొనేయడం మంచిది) ఇతరులు మిమ్మల్ని మెచ్చుకుంటారు. (వారడిగనంతా అప్పిస్తేసరి) దానధర్మాలు, దైవప్రార్థనలు చెయ్యండి. (మీ యిష్టం, మానేసినా సరే.)

ఒక "జ్యోతి"ష్కుడు.

□□□

# శిశిరాలా సరిహద్దులా

( గతసంచిక తరువాయి )

**15**

రాజీకి నిద్రపట్టటంలేదు. ఆమెలోని సహజ ప్రకృతీ, కృత్రిమ ప్రకృతీ తీవ్రంగా ఘర్షణ పడుతున్నాయి. ఘర్షణలో అగ్ని జనిస్తోంది. దావానలంలా జ్వలిస్తోంది. మనస్సును దహిస్తోంది. ఈ అగ్ని పరీక్షలో తానేమవుతుందో తనకు తెలియటంలేదు. కర్తవ్యం బోధపడటం లేదు. ఎన్నెన్నో పాత విషయాలు కళ్ళ ముందు మెదులుతున్నాయి. దిక్కులేని తనను ఆదరించిన ఎందరో వ్యక్తుల మంచితనం తన ద్రోహబుద్ధిని గేలిచేస్తున్నది. ఆలోచనలతో క్రిక్కిరిసి తల బద్దలైపోయేటట్లుంది. అశాంతితో అటూ ఇటూ దొర్లింది. లేచి కూర్చుంది. మళ్ళీ పడుకుంది. జుట్టు పీక్కుంది. దిండులో ముఖం దూర్చి కరువుతీరా ఏడవాలనుకుంది. కానీ కన్నీరు రాలేదు. అలసటతో, ఆయాసంతో రొజుతోంది.

తను ఇప్పుడు చైనా గూఢచారి. ఆ 'గూఢచారి' అనేపదం తలుచుకుంటే భయంతో శరీరమంతా గజగజ వణికిపోతోంది. ఎంత భయంకరమైన పదం అది! తను ఇప్పుడు ఎంత రాక్షసిగా మారిపోయింది! అమ్మో! తను రాక్షసా? భయంతో, పిచ్చిగా, కెవ్వన కేకపెట్టాలనుకుంది; కేకపెట్టాననుకుంది. గుండెలో ఎడతెరిపిలేకుండా పెద్ద పెద్ద పిడుగులు, ఉరుములు దద్దరిల్లుతున్నాయి. తుఫాను హోరుపెడుతున్నది. ఆ హోరులో తన కేక వినిపించలేదు గావును అనుకుంది. కానీ అసలు ఆ కేక నోటినుంచి బయటపడలేదు. గొంతులోనే బిగిసిపోయింది. నోటి తడి ఆరిపోయింది.

ఆ గుడిసెలో ఒంటరితనాన్ని భరించలేక పోతోంది. తన చుట్టూ వీచే తుఫాను గాలిలో ఏవో భూతాలు రివ్వన యీదుతున్నట్లు అనిపించింది. అవి తన అపరాధాన్ని పసిగట్టి భయపెడుతున్నాయి. తన గుడిసే తనకు బందిఖానాగా కనిపిస్తోంది తను ఈ ఉక్కుకోటనుంచి తప్పించుకు బయటపడలేనేమోననిపించింది. ఎలాగైనా ఇక్కడినుంచి తప్పించుకుని పరుగెత్తి

నండూరి పార్థసారథి

వెళ్ళి సీమాను కౌగలించుకుని పడుకోవాలనిపించింది. తన కెప్పుడూ యిలా భయం వెయ్యలేదు. అసలు భయమంటే ఏమిటో తెలీదు. ఒంటరి తనంలోకూడా ఎంతో ప్రశాంతంగా నిశ్చింతగా జీవించేది. మరి ఇప్పుడు తను ఎందుకు భయపడుతోంది? తనను ఎవరు భయపెడుతున్నారు? ఎవ్వరూ భయపెట్టడంలేదు. తనకు తానే భయపడుతోంది. తను మారిపోయింది.

రాజీ లేచి కూర్చుని అద్దంలో చూసుకుంది. జుట్టు చెరిగిపోయి దుబ్బులాగా వుంది. మాంత్రికురాలిలాగా, ద్రోహిలాగా, రాక్షసిలాగా, గూఢచారిలాగా ఉంది. తను ఎంత అందమైనది! ఎంత అమాయకురాలు! ఎవరైనా కన్నీళ్ళు పెట్టుకుంటే చూసి సహించలేదే. ప్రపంచంలో యే ప్రాణినీ యింతవరకూ ద్వేషించలేదే. తనలోని కరుణ, క్షమ, సేవాభావం, కోమలత్వం, స్నిగ్ధత్వం ఏమైనాయి? తన మొహంలో ఆ భావాలేమీ కనిపించవేం? అవన్నీ తనలోంచి పోయాయా? పోతే యిహ యేం చూసుకుని బతకాలి తను? పొద్దస్తమానం పిల్లలతో అమాయకంగా ఆడుతూ-పాడుతూ, కొండల్లో-గుట్టల్లో కేరింతలేస్తూ కాలక్షేపం చేసే తను చైనా గూఢచారా? తనకు తానే నమ్మలేకపోతోంది. ఇక్కడ గూడెంలో ఎవ్వరూ తనను అనుమానించరేం? తనలోని మార్పు వారికి కనిపించటంలేదా? ఎంత మంచివాళ్ళు. చెడును ఊహించలేని అమాయకులు వారు.

చైనాలో క్షామంవస్తే తినడానికి తిండిలేక భిక్షాటనకోసం తనూ, తన తండ్రీ కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడకు వలస వచ్చారు. భారత దేశం తమకు భిక్షపెట్టింది. ఆశ్రయమిచ్చింది. కన్నబిడ్డకంటే ఎక్కువగా ఆదరించింది. ఇక్కడి మోన్ పా జాతి ప్రజలు తమను — ఎక్కడనుంచి వచ్చారనికూడా అడగకుండా—తమలో కలుపుకున్నారు. తనతండ్రి చనిపోతే సానుభూతితో, ప్రేమతో తనను దగ్గరకు తీసుకున్నారు. వాళ్ళ ఇళ్ళల్లో భోజనం చేస్తూ, వాళ్ళ పిల్లలతో కలిసి ఆడుకుంటూ, 'నా' అన్నవాళ్ళు లేరన్న బాధ మరిచిపోయింది. ఇక్కడ ఒక్కొక్కరూ ఎంత అమృత హృదయులు. సీమా తనను సోదరిలా చూస్తుంది. తనంటే ఆమెకు ఎంత

సీరియల్

ఆపేక్షో. ఇదివరకు చాలా రోజులు ఇద్దరూ ఒక్కపక్కలో పడుకునే వారు. ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునే వారు. ఇంతమంది మంచివాళ్ళమధ్య ఉంటూ, తను వాళ్ళకి ఇస్తున్న ప్రతిఫలం చైనా గూఢచారిణిగా పని చేయటం.


అసలు తను ఈ పనికి ఎలా ఒప్పుకుంది? చైనా సోదరులు ఒకరోజు రహస్యంగా వచ్చి బలాత్కారంగా తనను లాక్కువెళ్ళారు. తనకేదో మత్తుజల్లి, దేశభక్తిని నూరిపోశారు. చైనాలో ఉన్న కోట్లాది సోదరుల కోసం, మాతృభూమి క్షేమంకోసం గూఢచారిణిగ పన్చేయమనిచెప్పారు. అలా పని చేయకపోవటం మాతృద్రోహమవుతుందని భయపెట్టారు. చైనా మొదటినుంచీ భారతదేశంతో స్నేహంగా ఉంటోందనీ, కానీ భారతదేశమే మిత్రద్రోహం తలపెట్టిందనీ, చైనాపై దాడి చేసిందనీ అబద్ధాలు చెప్పారు. రాజకీయాలేమీ తెలియనితాను వారి కల్లబొల్లి మాటలన్నీ నిజమేనని నమ్మి మోసపోయింది. తన మనస్సు విరిచేసి, తనచేత వాగ్దానంచేయించుకున్నారు చేతిలో చేయివేయించుకున్నారు. ధర్మం భారతదేశం పక్షానే ఉందని తెలుసుకోడానికి అట్టేకాలం పట్టలేదు తనకు. కానీ అప్పటికే అంతా అయిపోయింది. తను మాట ఇచ్చేసింది. మాటజారితే కూడదీసుకోడం సాధ్యం కాదు. ఆడినమాటను కాదనలేదు.

చేసేది తప్పు అని తెలిసినా, ఇంకొకపక్క మాతృదేశం మీది మమకారం చావదు. తనకు జన్మ ఇచ్చి, పాలిచ్చి పెంచినతల్లి అది. చిన్నప్పటి తన ఇల్లు, తను ఆడుకున్న ప్రదేశాలూ, తను చదువుకున్న బడీ ఎంతకూ మరపురావు. ఆ ప్రదేశాల మీద బాంబులు పడితే! ఆమాట తలుచుకుంటేనే గుండెవణికిపోతుంది. ఈమమకారానికీ, ఈబలహీనతకూ లొంగిపోవటం వల్లనే తను పైశాచికంగా ప్రవర్తించటానికి మాట ఇచ్చింది.

భారతీయ సైన్యాధికారులలో ఒక్కరుకూడా తనను అనుమానించటంలేదు. తనంటే అందరికీ ఎంతో విశ్వాసం, అభిమానం. ఆవిశ్వాసాన్నీ, అభిమానాన్నీ తాను ఈ విధంగా ఉపయోగించుకుంటోంది. గాయపడ్డ సైనికులకు ఎంతో దయతో శ్రద్ధతో సేవలుచేస్తున్నదని అందరూ మెచ్చుకుంటున్నారు. దీనావస్థలో ఉన్న ఆసైనికులనుచూస్తే ఎంతరాక్షసికైతే మాత్రం జాలికలగదా? వారి దైన్యం చూస్తుంటే, వారి ఆక్రందనలు వింటుంటే తనలోని కరుణ, సేవాభావం కట్టలు తెంచుకుని బయల్పడుతాయి. హృదయమంతా నింపి వారికి సేవ చేయటం తప్ప ఇంకొక విధంగా ప్రవర్తించలేదు, ఊహించలేదు. తను వారికి చేస్తున్న ద్రోహానికి ఈసేవ యేపాటిది? వారిస్థితికి తానూ కొంత కారణమేకదా? తనపాపానికి ఈసేవ నిష్కృతి కాగలదా? మనస్ఫూర్తిగా వారికి సేవలు చేస్తున్నానన్న తృప్తి








కూడా లేకపోతే యీపాటికి తన పాపం తనను దహించివేసేది.

కల్నల్ మహేశ్‌కికూడా తన మీద ఎంతో గౌరవం, వాత్సల్యం ఏర్పడ్డాయి. లెఫ్టినెంట్ తనని ఒక దేవతగాచూస్తాడు. ఆ అమాయకుడు తన నిజస్వరూపాన్ని గుర్తించలేక ప్రేమించాడు. హృదయాన్ని అంకితం చేశాడు. తను మోహినిరూపంలో ఉన్న రాక్షసి అని తెలిస్తే గుండెపగిలి చచ్చిపోతాడేమో! అతని అమాయకత్వాన్ని, ప్రేమనూ అలుసు తీసుకుని తను సైనిక రహస్యాలన్నీ సేకరిస్తోంది. అధికారులు చర్చించే రహస్యాలను తలుపుచాటునుంచి విని చైనావారికి అందిస్తోంది.

రాజీ చేస్తున్న తప్పుకు ఆమె అంతరాత్మ నిర్దాక్షిణ్యంగా చిత్రహింస చేసింది. ఆ రాత్రి అంతా నిద్రలేదు. క్షణం ఒక యుగంగా గడిచింది. కళ్ళు ఎర్రబడి, ఉబ్బిపోయాయి.

## 16

పొద్దున్నే రాజీ మామూలుగా స్థావరానికి వచ్చింది. రాత్రి నిద్రలేకపోవటంవల్ల కళ్ళు నిప్పుల్లావున్నాయి. మొహం చిక్కిపోయింది. తలకూడా సరిగా దువ్వుకోలేదు. మనిషి చాలా నీరసంగా, పదిరోజులు జ్వరంపడిన దానిలా వుంది. లేని ఓపిక తెచ్చుకుని ఎలాగో నడిచి వచ్చింది. రాగానే అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయింది. అక్కడ అందరిముఖాలలోనూ విషాదం అలముకునివుంది. ముందు స్థావరంలో క్రితంరాత్రి యుద్ధంలో ఒక ఆఫీసరు మరణించాడట. అందరూ గౌరవసూచకంగా

టోపీలుతీసి చేత్తోపట్టుకుని, తలలు వంచుకుని, మౌనంగా నుంచున్నారు. మరణించిన ఆఫీసరుకు గౌరవలాంఛనంగా బ్యూగిల్ విషాదగీతాన్ని ఆలాపిస్తోంది. రాజీ మౌనంగా ఒకపక్కన తలవంచుకుని నుంచుంది. క్రితంరాత్రి ఎంత భయంకరమైన యుద్ధం జరిగి ఉంటుందో, భారత సైన్యానికి ఎంతనష్టం వాటిల్లిఉంటుందో ఆమె ఊహించగలదు. ఆ నష్టం అంతా తినవల్ల జరిగినదేనని కూడా తెలుసు. బ్యూగిల్ గీతం ఆగిపోయింది. మళ్ళీ అందరూ కదిలారు. అందరిలోనూ ఆందోళన, విచారం కనిపిస్తున్నాయి.

యుద్ధంలో గాయపడ్డవారిని నలుగురిని స్ట్రెచర్లలో మోసుకు వచ్చారు. డాక్టర్ మామూలుగా వారికి చికిత్స ప్రారంభించారు. నర్సులు ఆయనకు సాయపడుతున్నారు. రాజీ వెళ్ళి వారి పక్కన నుంచుంది. డాక్టర్ ఆమెను గమనించలేదు. ఒకరికి చికిత్స పూర్తిచేసి తల ఎత్తగానే రాజీ కనిపించింది. ఆశ్చర్యంతో, ఆందోళనతో "ఏమ్మా నీకు ఆరోగ్యం బాగాలేదా? అలా అయిపోయావేమిటి ఒక్కరోజులో?" అని అడిగాడు. తనకేమీ జబ్బు లేదనీ, ఆరోగ్యంగానే ఉన్నాననీ చెప్పింది. కానీ ఆయన ఆత్రుతతో "నువ్వు ఇలా పొద్దస్తమానం పనిచేయకూడదమ్మా. విశ్రాంతి తీసుకోవాలి. చూడు ఎంత చిక్కిపోయావో" అంటూ నాడి పరీక్షిస్తున్నాడు. రాజీకి ఒకపక్క మనస్సులో అనుభవించే చిత్రహింసతోపాటు, కొంచెం చికాకు కూడా కలిగింది. వీరందరూ ఇంత దీనస్థితిలో ఉండటానికి తాను కూడా బాధ్యురాలు. అటువంటిది వాళ్ళకి చికిత్స చేయడం మాని డాక్టర్ తనవంటి ద్రోహిని గురించి ఆందోళన పడతాడేమిటి అని విసుక్కుంది. "నాకేమీ అనారోగ్యం లేదు. ముందు వాళ్ళ సంగతి చూడండి" అంటూ ఆయనను బలవంతం చేసింది. ఆయన మళ్ళీ తన పనిలో నిమగ్నుడయ్యాడు.

రాజీ ఒక్కొక్కరికీ కట్టుకడుతోంది. క్షతగాత్రులు అంత దీనస్థితిలోకూడా వీరావేశంతో మాట్లాడుతున్నారు. త్వరగా గాయాలు నయమైతే మళ్ళీ చైనా మూకలమీద పడి వారి అంతుచూస్తామని ప్రతిజ్ఞలు పలుకుతున్నారు. వారి మాటలు వింటున్న రాజీకి లోలోపల భయం పెరుకుంటోంది. ఈవీరుల ఆవేశం చూస్తే నిజంగానే వీరు తన సోదరులను మట్టుపెట్టగల సమర్థులని అనిపిస్తోంది. తానువీరికిత్వరగాగాయాలు మాన్పితే వీరుచేయబోయేది అదే. కానీ ఇప్పుడు చేస్తున్న ద్రోహం చాలక ఇంకా వీరికి సేవాలోపం చేస్తుందాతను! అలా చేస్తే అంతకు తగిన శిక్ష తన అంతఃకరణ తనకు విధిస్తుంది. క్షతగాత్రులను ఆవేశపడవద్దని మెల్లగా హెచ్చరించటం తప్ప ఏమీ చేయలేకపోతోంది.

నాలుగురోజులుగా ఆమె సేవలు పొందుతున్న ఒక సైనికుడు ఆమె దగ్గరకు వచ్చేసరికి కృతజ్ఞతను భరించలేక కళ్ళవెంటనీరు కారుస్తున్నాడు. ఆమె దయగా అతని చెక్కిళ్ళమీది కన్నీళ్ళని తుడిచింది. అతను ఆమె చేతిని ముద్దుపెట్టుకుంటూ "చెల్లాయ్! మాఊరినీ, మావారినీ అందరినీ విడిచి దేశం కోసం ఇక్కడికి వచ్చాను. ఇక్కడ ఈస్థితిలో నువ్వేలేకపోతే నేను ఏమైపోయేవాడినో" అంటూ పసిపిల్లాడిలా ఏడుస్తున్నాడు. "తప్పు! అలా ఏడవకూడదు" అన్నట్లు దయగాచూసి, రాజీ తలవంచుకుని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

## 17

మధ్యాహ్నంవేళ కల్నల్ గదిలో ఆఫీసర్లందరూ సమావేశమైనారు. టేబుల్ మధ్యలో ట్రాన్సిస్టర్ పెట్టి, చుట్టూచేరి వార్తలు వింటున్నారు. టేబుల్ నిండా వార్తాపత్రికలు పరుచుకునివున్నాయి. ఆఫీసర్లు పత్రికలు తిరగవేస్తూ రేడియో వింటున్నారు. పత్రికలనిండా సరిహద్దుకు సంబంధించిన వార్తలు, ఫొటోలు, మ్యాప్‌లు తప్ప మరేమీ లేవు. సరిహద్దుల రక్షణకు దేశంలో జరుగుతున్న కృషిని వివరిస్తోంది రేడియో. కెప్టెన్ ప్రసాద్ దేశంలోజరుగుతున్న సంరంభాన్ని మనోనేత్రంతో దర్శిస్తున్నాడు.

సరిహద్దులలో పోరాడుతున్న భారతసేనల ధైర్య-సాహసాలను యావద్భారత ప్రజానీకం ప్రశంసిస్తున్నది. దేశంలోని పిన్నలూ, పెద్దలూ, స్త్రీలూ, వృద్ధులూ,వికలాంగులుకూడా రక్షణకృషికి యథాశక్తిని తోడ్పడుతున్నారు. వ్యవసాయంలో, పరిశ్రమలలో ఉత్పత్తులను పెంచడానికి సమరోత్సాహంతో అందరూ కృషి చేస్తున్నారు.నాయకులు వాడవాడలా తిరిగి ఉపన్యాసాలు యిస్తున్నారు. ప్రజలను హెచ్చరిస్తున్నారు. పత్రికలు, రేడియోలు ప్రజలనుఎప్పటికప్పుడు ఉత్తేజపరుస్తున్నాయి. దేశం నలుమూలలా జాతీయ రక్షణనిధికి వసూళ్ళు ముమ్మరంగా సాగుతున్నాయి. ధనంకుప్పలు కుప్పలుగా వచ్చిపడుతున్నది. స్త్రీలు నగలు దానం చేస్తున్నారు. విద్యార్థులు డబ్బాలు పుచ్చుకు తిరుగుతూ విరాళాలు వసూలు చేస్తున్నారు. ఉద్యోగులు తమజీతంలో కొంత మొత్తం విధిగా నిధికి సమర్పించుతున్నారు. చిన్నపిల్లలు దిబ్బనలో

---

● "ఈ దొంగతనం నువ్వొక్కడివే చేశావా, వేరే ఎవరేనా ఉన్నారా?"

"ఒక్కణ్ణేనండి ... రోజులు మారిపోయాయండి. ఏ యిదవనీ నమ్మటానికి లేదు."

దాచుకున్న చిల్లర డబ్బులు యిచ్చేస్తున్నారు. ముసలమ్మలు వత్తుల పెట్టెల లోంచి డబ్బులు తీసి యిస్తున్నారు, కళాకారులు నాటకాలు ప్రదర్శిస్తున్నారు, వినోదప్రదర్శనలు ఇస్తున్నారు, పాటకచేరీలు చేస్తున్నారు. రక్షణ నిధికి వేలంపాడిన ఇటుకరాయికి కూడా వేలకువేలు ధర పలుకుతోంది. సినీతారలు సౌధాలు దిగివచ్చి నట్టి నడివీధులలో దేశంకోసం బిచ్చమెత్తుతున్నారు. బిచ్చగాళ్ళు సైతం విరాళా లిస్తున్నారు. రక్షణపత్రాలు, బంగారం ఋణపత్రాలు విశేషంగా అమ్ముడు పోతున్నాయి. విదేశాలలో కూడా భారత రక్షణనిధికి విరాళాలు సేకరిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో భారత దేశాన్ని సమర్థిస్తున్నాయి; సానుభూతి వ్యక్తం చేస్తున్నాయి.

దేశంలో వందలాది స్వచ్ఛంద సంస్థలు వెలిశాయి. కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు సైనిక శిక్షణ యిస్తున్నారు. ఎందరో వ్యక్తులు సైన్యంలో చేరుతున్నారు. మరొక వంక వేలాది నర్సులకు శిక్షణ యిస్తున్నారు. సైనికుల కోసం మహిళాసంస్థలు ఉన్నితో స్వెట్టర్లూ, మేజోళ్ళూ, టోపీలూ తయారు చేస్తున్నాయి. ఇతరసంస్థలు సైనికుల కోసం ప్రజలనుంచి రకరకాల వస్తువులను సేకరించి సరిహద్దుప్రాంతాలకు పంపుతున్నాయి. దేశంలోని కీలక పరిశ్రమలన్నింటిలోనూ రక్షణ ఉత్పత్తులకు హెచ్చు ప్రాధాన్యం యిస్తున్నారు. పాశ్చాత్య దేశాలనాయకులు, సైన్యాధికారులు, సాంకేతిక ప్రవీణులు వచ్చి భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. అమెరికా, బ్రిటన్, కెనడా దేశాలు ఆయుధ సహాయానికి హామీ నిచ్చాయి. దేశమంతటా వీరావేశం పరవళ్ళు తొక్కుతోంది. దేశం కల్లోలితమైన మహాసముద్రంలా ఉంది.

రేడియోలో వార్తలు ముగియగానే ఆఫీసరందరూ నిష్క్రమించారు. కెప్టెన్ అక్కడే కూర్చుని పత్రికలు తిరగేస్తున్నాడు. తనరాష్ట్రం, తన జిల్లా, తన పట్టణం వార్తల కోసం గాలిస్తున్నాడు. ఒక పత్రికలో తన ఊరుపేరు కనిపించింది. అక్కడ కూడా ఏదో బహిరంగసభ జరిగింది. ఎవరో మంత్రి ఉపన్యసించాడు. రక్షణ కృషికి సంబంధించిన నాటకం ప్రదర్శించారు. ఎవరో ఒక చిన్న పాప మెడలోని బంగారు గొలుసు తీసి రక్షణనిధికి విరాళమిచ్చిందట. కెప్టెన్ ఆలోచనల్లో మునిగి పోయాడు.

రాజీ గదిబయట వరండాలో ఒక బల్లమీద కూర్చొని ఉంది. ఆమె చేతిలో ఒక ఇంగ్లీషు వార్తాపత్రిక ఉంది. ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ ఉంది. రేడియో వార్తలు తనూవిన్నది. ప్రపంచమంతా చైనాను దూషిస్తున్నది. చైనా వారిని రాక్షసులుగా వర్ణిస్తున్నారు అందరూ. ఆ రాక్షసులలో తనూ ఒకతె. కానీ ఈ దూషణ సమంజసమేనా? చైనా ప్రజలకు హృదయాలు లేవా? వారికి ప్రేమ, కరుణ, మమకారం లేవా? స్వదేశంమీద, స్వగృహంమీద



వారికి మాత్రం మమత ఉండదా? వారంతా రాక్షసులా? కాదు—అలా అనటం అన్యాయం. చైనాలో కొందరు నాయకులూ, వాళ్ళచేతి కీలుబొమ్మలుగావ్యవహరిస్తున్న ద్రోహులూ చేస్తున్న మహాపాపానికి కోట్లాది అమాయక ప్రజలు నిందలు భరిస్తున్నారు. ఆ ద్రోహుల దుశ్చర్యలకు పర్యవసానాన్ని అనుభవించేదిప్రజలు. చైనా నాయకులు రాక్షసులు—ప్రజలు కాదు. కోట్లాది ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు ఆ రాక్షసులు. సహస్రాబ్దాల చరిత్రను, సంస్కృతిని కళంకితం చేస్తున్నారు. చైనా జాతికి అప్రతిష్ఠ తెస్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఈ అప్రతిష్ఠ శాశ్వతంగా ముద్రిత మవుతుంది. దానిని యిక ఎవ్వరూ చెరిపివేయలేరు. జారిన కాలును కూడదీసుకోవటం సాధ్యం కాదు. అంతిమవిజయం భారతదేశానిదేనని ప్రపంచం శంఖమై నినదిస్తోంది. ఆ నినాదం విన్నప్పుడల్లా తను భయంతో వణికి పోతోంది. రేడియోలో 'జైహింద్' అని వినిపించినప్పుడల్లా తను కంపించిపోతూంది. మనస్సు కల్లోలమైపోతూంది. ముఖమంతా చెమటపట్టుతోంది.

రేడియోలో వార్తలు ముగియగానే ఆఫీసరందరితోపాటు లెఫ్టినెంట్ కూడా బయటకు వచ్చాడు. అభివాదసూచకంగా తనను చూసి సన్నగా నవ్వాడు. ఎంతో ప్రయత్నంమీద మర్యాదకోసం తనూ నవ్వింది. కానీ అతని నవ్వుకూ, తన నవ్వుకూ ఎంత తేడా! అతను నిర్మలంగా, అప్పుడేపుట్టిన పాపాయిలా నవ్వాడు. తను సహజంగా నవ్వలేక, అతి ప్రయత్నంమీద నీరసంగా, మలినంగా, పేలవంగా నవ్వింది. శివరామ్ ఆమెను కొంచెం పరికించి చూసి ఆదుర్దాగా "ఏం రాంజీ నీ వంట్లో బాగాలేదా? అలావున్నావేం" అని అడిగాడు.

"బాగానేవున్నాగా. ఏమయింది యిప్పుడు?" అంది బలహీనంగా నవ్వుతూ.

"లేదు. నీ మొహం మామూలుగా లేదు. ఒక్కసారి అద్దంలో చూసుకో తెలుస్తుంది" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అతనూ మౌనంగా తలవంచుకుని నిలబడ్డాడు. ఇంకా ఏం మాట్లాడాలో యిద్దరికీ తెలియటంలేదు. ఆమె ముభావంగా ఉందని గ్రహించి, మాట్లాడటానికి జంకుతున్నాడు శివరామ్. అతనికి ఆమె అంటే ఒకరకమైన భయం

---

● గడ్డంగీసి మంగలి వెళ్ళిన తరవాత—

"అమ్మాయీ, నీళ్ళు పట్రా."

"స్నానానికేనా, నాన్నా?"

"నోట్లోపోసుకుని, పెదిమలు బిగించి, నీళ్ళుంటాయో కారిపోతాయో చూద్దామని."

కూడా ఉంది. అది గౌరవంవల్ల ఏర్పడే భయం. ఆమెతో చనువు పెంచుకుని, ఆమెను పెనవైచుకుపోదామని అతను ఎంత ఆరాటపడినా, ఆమెలోని ఆధిక్యత ఏదో తనను దూరంగా ఉంచుతోంది. ఆమెను సమీపించలేకపోతున్నాడు. ఆమె అతనిఅవస్థగ్రహించింది. అతనిపట్ల స్నేహం, వాత్సల్యం పొంగివచ్చింది. తనపట్ల అతనుచూపుతున్న గౌరవానికి తను అర్హురాలిని కానని ఆమెకు తెలుసు. తాను అతనిని వంచిస్తున్నట్లు తెలుసు. అయినా తన పాపానికి పరిహారంగా తన హృదయాన్ని అతనికి అర్పించుకోవాలనీ, అతని భయాన్ని పోగొట్టి, ఒడిలోకి తీసుకుని లాలించాలనీ అనిపించింది. తప్పు అని తెలిసి వంచించే వ్యక్తికి వంచితునిపట్ల ప్రేమ కలగటం సహజమేమో. అందుకేనేమో తను అతనిని ప్రేమించకుండా ఉండలేకపోతోంది.

కల్నల్ గది గుమ్మంపైన రాసివున్న అక్షరాలకేసి ఇందాకటినుంచి శూన్యంగా చూస్తున్నది ఆమె. ఆ అక్షరాలను తాను రోజూచూస్తూనే ఉంది. వాటికి అర్థం ఏమిటో, అది ఏ భాషోకూడా తనకు తెలియదు. దాన్ని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం కూడా తనకులేదు. కానీ ప్రతిరోజూ అవి కనిపిస్తూ ఉంటాయి. కనిపించకుండా ఉండవు. తను చూడాలని అనుకోకపోయినా, అసలు ఆ ఉద్దేశం లేకపోయినాసరే ఎందుకో అవి తప్పనిసరిగా కనిపించి తీరుతాయి. ఇన్నాళ్ళూ ఈ విషయం తనకు స్ఫురించలేదు. కానీ ఇప్పుడు ఉన్నట్టుండి ఎందుకో ఒక్కసారి ఆశ్చర్యంగా అనిపించింది. 'రోజూ ఆ అక్షరాలు ఎందుకు కనిపిస్తున్నాయి?' అని మొదటి సారిగా తనలో తను ప్రశ్నించుకుంది. శివరామ్‌తో యేదో ఒకటి మాట్లాడి, ఇద్దరిమధ్య మౌనాన్ని ఛేదించాలనుకుంటున్న తనకు యిది తగిన విషయంగా కనిపించింది.

'శివరామ్, ఆ అక్షరాలు ఏమిటి?' అని అడిగింది.

లెఫ్టినెంట్ ఒక్కసారి గంభీరంగా మారిపోయాడు. ఆవేశంతో చెప్పటం ప్రారంభించాడు. 'యతో ధర్మస్తతో జయః అనే ఆ అక్షరాలు మా భారతీయ సంస్కృతికి అంతటికీ మూలమైనవి. అది మా జాతి సిద్ధాంతం. ధర్మం యేపక్షాన ఉంటుందో ఆ పక్షానికి విజయం తథ్యం. అందుకు మా చరిత్ర, ప్రపంచచరిత్రకూడా సాక్ష్యం. కాలగతిలో తాత్కాలికంగా రాక్షస శక్తులు విజృంభించవచ్చు. ధర్మహాని జరగవచ్చును. కాని అంతిమవిజయం ఎప్పుడూ ధర్మానికే సిద్ధిస్తుంది. ఎన్ని పరీక్షలకు లోనైనా ధర్మం తన శక్తిని తప్పక నిరూపించుకుంటుంది. అధర్మానికి లోనైన ప్రజల కళ్ళు తెరిపిస్తుంది. కృతయుగంలో దేవాసుర యుద్ధం, త్రేతాయుగంలో రామరావణయుద్ధం, ద్వాపరయుగంలో మహాభారత యుద్ధం జరిగాయి. అన్నింటిలో ధర్మమే జయించింది. ప్రతి యుద్ధం







ధర్మాన్నే ప్రతిష్ఠితం చేసింది. సామ్రాజ్య దాహంతో దురాక్రమణకు పూనుకొన్న యే దేశమూ బాగుపడలేదు. ప్రపంచం ఉన్నంతకాలం ధర్మం వుంటుంది. ధర్మం అనే ఇరుసు మీదనే భూమి పరిభ్రమిస్తోంది. అధర్మం జయించినరోజున ప్రపంచంలోని సముద్రాలన్నీ ఒక్కసారిగా

పొంగుతాయి. అగ్నిపర్వతాలన్నీ ప్రజ్వరిల్లుతాయి. భూమి బ్రద్దలవుతుంది. ప్రపంచానికదే ఆఖరురోజు. అధర్మానికి పాల్పడిన చైనా నాశనం కావటం తథ్యం. పరాభవమే దానికి దక్కే ప్రతిఫలం. ఈయుద్ధం ప్రపంచానికే గుణపాఠం నేర్పుతుంది. అటంబాంబులూ, హైడ్రోజన్ బాంబులూ ధర్మాన్ని జయించలేవు. వాటికంటే ధర్మం శక్తి గొప్పది."

లెఫ్టినెంట్ చెప్పుకుపోతున్నాడు. రాజీ కళ్ళు తిరిగి, స్పృహ తప్పినట్లు తూలిపడింది. లెఫ్టినెంట్ ఆమెను పట్టుకుని నెమ్మదిగా నడిపించుకుని దూరంగా తీసుకువెళ్లాడు. ఎవ్వరూ లేనిచోటయేకాంతస్థలంలో యిద్దరూ కూర్చున్నారు. ఆమె అలసటగా తల చేత్తో పట్టుకుని కూర్చుంది. ఆమెకు యేమయిందోనని ఆందోళనతో చూస్తున్నాడు శివరామ్. అతను మాట్లాడిన ఒక్కొక్కమాట ఒక్కొక్క ఈటెలా ఆమెను గాయపరిచాయి. సుకుమారమైన ఆమె వ్యక్తిత్వం ఆ గాయాలను తట్టుకోలేక పోయింది. తనను గాయపరచిన శివరామ్‌పై ఆమెకు క్రోధం చెలరేగలేదు. అతని అమాయకత్వం ముందు ఆమె కుటిలత్వం సిగ్గుతో తలవాల్చుకుంది. ధర్మం ముందు అధర్మం యెప్పటికైనా తలవాల్చక తప్పదని గ్రహించుకుంది. నిష్కల్మషమైన శివరామ్ ప్రేమకు ఆమెలోని స్త్రీత్వం లొంగిపోతూంది. నెమ్మదిగా తలఎత్తి అతని కళ్ళలోకి చూసింది. ఏం చెబుతుందోనని అతను ఆత్రంగా చూస్తున్నాడు.

"నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా శివరామ్?" అని అడిగింది. ఆమె కంఠ స్వరంలో యే మాత్రం ఆవేశం ధ్వనించలేదు. ఆమెముఖంలో యేభావం వ్యక్తం కాలేదు. గొంతు స్తిమితంగా, ముఖం గంభీరంగా వుంది. అతను ఆశ్చర్యపోయాడు. ఆమె అలా మాట్లాడుతుందని అతను అనుకోలేదు. ఇంత హఠాత్తుగా నిగ్గదీసి అటువంటి ప్రశ్న వేస్తుందని అతను వూహించలేదు. కొంచెం సిగ్గుతో, బిడియంతో "నీకు తెలియదా రాజీ" అన్నాడు.

"తెలుసు. కానీ ఎందుకు ప్రేమించావు శివరామ్? నన్ను గురించి నీకు యేం తెలుసునని? నేనుచాలా మంచిదాన్నని అనుకుంటున్నావు కదూ?"

---

● ఇంత రాత్రిదాకా ఎక్కడున్నారండీ?"
"ఎందుకూ అడుగుతావు, నీకు తెలీదా ఏమిటి?""
"తెలుసులెండి. అయినా మీరేం చెబుతారోనని."



"అవును రాజీ. నిన్ను చూసిన మొదటిరోజే, మొదటి చూపులోనే నీమీద నాకుయెంతో గౌరవం, అభిమానం కలిగాయి. నీ చూపుల్లో, మాటల్లో, చేష్టల్లో ఎంతో సంస్కారం కనిపించింది. నీది ఉదాత్తమైన వ్యక్తిత్వం అని అనిపించింది. నా మనస్సు నన్ను మోసగించదనే అనుకున్నాను. నీవ్యక్తిగత జీవితాన్ని గురించి ఏమీ తెలియకపోయినా నిన్ను ప్రేమించాను. ఎందుకుప్రేమించానో, ఎలా ప్రేమించానో సంజాయిషీ చెప్పుకోలేను. ప్రేమకు కారణంతో నిమిత్తం లేదు. తల్లి బిడ్డని ప్రేమించటం ఎంత సహజమో నేను నిన్ను ప్రేమించటంకూడా అంత సహజం. నిగ్గదీసి అడిగితే ఎవరూ తమ ప్రేమకు అర్థం చెప్పలేరు."

శివరామ్ మాట్లాడే ప్రతి మాటా అతని హృదయంలోనుంచి వస్తున్నట్లు అతని హృదయమే మాట్లాడుతున్నట్లూ అనిపించింది ఆమెకు.

"కానీ శివరామ్—నా మంచితనాన్ని గురించి నువ్వు కట్టుకునే గాలిమేడలన్నీ కూలిపోయేరోజు త్వరలోనే వస్తుంది. నా నిజస్వరూపాన్ని తెలుసుకున్నరోజున నువ్వే నాపై తుపాకీ గురిపెట్టవలసివస్తుంది."

శివరామ్ చకితుడైనాడు—"రాజీ నువ్వే మంచిదానివి కాకపోతే ఇక నేను ప్రపంచంలో మంచిని ఊహించలేను. తప్పుకానీ, మంచికానీ—నిన్ను ప్రేమించకుండా ఉండలేను. ఇది తప్పే అయితే—దీని పర్యవసానం ఎంత భయంకరమైనా అనుభవిస్తాను. అంతేకాని ప్రేమించినందుకు పశ్చాత్తాప పడను. అపాత్రులనైనా సరే ప్రేమించటం తప్పుకాదు. ప్రేమించటంకంటే గొప్పవిషయం లేదు" అన్నాడు.

అతని మాటల్లో స్థిరంగా వ్యక్తమయ్యే నిజాయితీకి, అతని కళ్ళలో వెలిగే ప్రేమకు విస్మయం పొందింది ఆమె. "నేను ఎంత తప్పుచేసినా, ఎంత చెడ్డదాన్నైనా, నీకు ఎంత ద్రోహం తలపెట్టినా కూడా నన్ను ఎప్పుడూ యింతగా ప్రేమించగలవా శివరామ్" అని అడిగింది. అతను సమాధానంగా ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకుని మృదువుగా నొక్కాడు. ఆమె కన్నులవెంట జల జల నీళ్ళు రాలాయి. అతని ఒడిలో తల దాచుకుంది. "ఇంక నేను ఎంతశిక్షనైనా ఎదుర్కోగలను. ఇంతకంటే నాకు యింకేమీ అక్కర్లేదు" అనుకుంది మనస్సులో.

## 18

ఉదయం సుమారు 9 గంటల వేళ. కల్నల్ మహేశ్ ఒక్కడే తన గదిలో టేబుల్ దగ్గర కూర్చుని మ్యాప్‌లు పరిశీలిస్తున్నాడు. సిగరెట్ పీలుస్తూ ఏదో తీక్షణంగా ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఒక వృద్ధ సైనికుడు బూట్లు టకటక శబ్దంచేస్తూ వచ్చాడు. అటెన్షన్ పొజిషన్‌లో నిలబడి శాల్యూట్ చేశాడు. కల్నల్ తలఎత్తి "ఎవరు నువ్వు?" అన్నాడు.

"ఈ రోజు పొద్దున్న ఢిల్లీ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన దళంలో

వాడిని సార్' అంటూ అతను తన ప్లాటూన్ నంబరు, బెటాలియన్ నంబరు చెప్పాడు. 'ఎక్స్ సర్వీస్ మన్‌ని సార్, నాయక్‌గా ఇక్కడికి పోస్ట్ చేశారు. తమ దర్శనం చేసుకుందామని వచ్చాను' అన్నాడు.

కల్నల్ మళ్ళీ తలవంచుకుని తన పని చూసుకుంటూ అడిగాడు: 'ఏ ప్రాంతం వాడివి?'

'పంజాబ్ సార్.'

'పేరు?'

'జయసింగ్ సార్.'

'వయస్సెంత?'

'55 సార్.'

కల్నల్ తలఎత్తి అతని ముఖంలోకి పరకాయించి చూశాడు. జయ్‌సింగ్ టర్బన్ పెట్టుకున్నాడు. గడ్డం బాగా నెరిసింది. నుదుటిమీద ముడతలు పడి ఉన్నాయి. కాని కళ్ళల్లో ఉత్సాహం, అమాయకత్వం, చిలిపితనం కనిపిస్తున్నాయి. ముఖం చాలా కళావంతంగా, తేజోవంతంగాఉంది. మనిషి ఆరడుగుల పొడుగు, అంతకు తగ్గ లావూ ఉన్నాడు. శరీరం దృఢంగా కండలు తిరిగివుంది. యాదృచ్ఛికంగా అతన్ని చూసినవాళ్ళు మళ్ళీ ఒకసారి వెనక్కి తిరిగి అతన్ని చూస్తారు. అటువంటి ఆకర్షణ అతనిలో ఉంది.

'ప్రభుత్వం పిలిస్తే వచ్చావా? నువ్వే వచ్చావా?' అని ప్రశ్నించాడు కల్నల్.

'నేనే వచ్చానుసార్. వయస్సు 55 అనే సరికి మొదట ఒప్పుకోలేదు కానీ, నేనే బతిమాలానుసార్. చివరికి ఆఫీసర్‌గారు సరేనన్నారు.'

కల్నల్ కుతూహలంగా నవ్వుతూ 'ఈపెద్దవయస్సులో యిటువంటి చోటికి రాకపోతే శుభ్రంగా మీ ఊళ్ళోనే విశ్రాంతి తీసుకోకపోయావా?' అన్నాడు.

'మాయింటావిడికి కాశీలో చచ్చిపోవాలని కోరికసార్, నాకుయిక్కడ యుద్ధరంగలో చచ్చిపోవాలనికోరిక. అందుకని మా ఆవిడని కాశీకి పంపించేసి నేను యిటు వచ్చేశానుసార్.'

కల్నల్ ముఖంలో నవ్వు మాయమయింది. కాసేపు మౌనంగావుండి మళ్ళీ అడిగాడు. 'నీకు ఆస్తి ఏమీ లేదా?'

'మావూళ్ళో కాస్తపొలం, యిల్లు

---

● 'ఏమిటోయ్ ఆ ఉత్తరం? గంటన్నరనించి ఏకదీక్షగా చదివేసి నీలో నువ్వే ఆశ్చర్యపోతున్నావ్? ప్రేమలేఖా?'

'అలాటిదే. మా అమ్మాయితో సరససల్లాపాలు ఆపుజెయ్యకపోతే కూలీల్ని పెట్టి తన్నించేస్తానంటున్నాడు.'

'ఎవరు?'

'అది తెలియకేగదా ఈ బాధంతాను? సంతకంలేదు.'



వుంటే రక్షణనిధికి రాసిచ్చేశానండి. ఇప్పుడు ఆ బాదరబందీ యేమీలేదు.'

'సరే నువ్వు వెళ్ళు. అవసరమైతే పిలిపిస్తాను రా.'

సింగ్ టక టక బూట్లు శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయాడు. కల్నల్ మహో అతను వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు. నాయక్ సింగ్ తన శిబిరానికి వెళ్ళి, తోటి సైనికులతో పాటు పనుల్లో నిమగ్నుడైపోయాడు. కల్నల్ టేబుల్ యెదురుగా వున్న కిటికీలోంచి నాయక్ సింగ్ ఎవరూ చేయలేని మోటుపనులన్నీ చకచకా చేస్తున్నాడు. ఎవరూ మోయలేని బరువులు మోసి బలప్రదర్శన చేస్తున్నాడు. ఇద్దరు ముగ్గురు సైనికులు మోసే బరువులను అతను ఒక్కచేత్తో అవలీలగా మోస్తున్నాడు. అటువైపు ఎవరైనా ఆఫీసరు వస్తే టక్ మని బూటు కొట్టి, అటెన్షన్ పొజిషన్‌లో నుంచుని శాల్యూట్ చేస్తున్నాడు. ఛలోక్తులు విసురుతూ యువకులను హుషారు చేస్తున్నాడు. వాళ్ళని నవ్విస్తూ, తను నవ్వుతూ, మరీ హుషారు హెచ్చినప్పుడు ఖంయ్‌మని ఈల కొట్టుతూ చిలిపిచేష్టలు చేస్తున్నాడు. వృద్ధుడి వుత్సాహాన్నీ, చిలిపితనాన్నీ చూస్తూ కల్నల్ తనలో నవ్వుకున్నాడు. అక్కడి మాటలు యిక్కడిగదిలోకి వినిపించటంలేదు కానీ, నాయక్ చేష్టలనుబట్టి అతను మాటాడుతున్న విషయాలేమిటో ఊహించుకోగలుగుతున్నాడు కల్నల్.

కొందరు యువకులు నాయక్ చుట్టూ గేలిచేస్తూ, నవ్వుతున్నారు. నాయక్ పౌరుషంగా ఒక పెద్ద యినపకడ్డీ తీసుకుని అమాంతంగా దాన్ని రెండుచేతులతో వంచి పారేశాడు. 'దీన్ని యెవరైనాసరే వంకర తీయండి చూద్దాం' అని సవాలు చేస్తున్నట్లు దాన్ని యువకుల ముందు పడేశాడు. యువకులు తెల్లమొహాలు వేశారు. నాయక్ సింగ్ గర్వంగా చొక్కా చేతులు పైకి మడిచి కండలు ప్రదర్శించాడు. మీసం దువ్వాడు. 'ఈ కాలపు కుర్రాళ్ళు ఎందుకు పనికొస్తారు?' అంటూ ఒక యువకుడి వీపుమీద చరిచాడు సరసంగా. యువకుడి వీపుపేలిపోయింది. 'అయ్యబాబోయ్' అని వీపు తడుముకున్నాడు. ఇంతలో మేజర్ అక్కడకు వచ్చాడు. హెలికాప్టర్ వచ్చి ఆహార పదార్థాలూ, యితరవస్తువులు బంగీలు పడవేస్తున్నదనీ, వాటిని తీసుకు రమ్మనీ సైనికులకు పురమాయించాడు. సైనికులంతా బయలుదేరారు. వాళ్ళతో పాటు నాయక్ కూడా పరుగెత్తాడు. అతన్ని గమనిస్తున్న కల్నల్ మళ్ళీ తలవంచుకుని తన పనిలో నిమగ్నుడైనాడు.

## 19

మధ్యాహ్నం సైనికుల భోజనాలు అయ్యాయి. కెప్టెన్ ప్రసాద్ తన శిబిరంలో తీరుబడిగా పడక మీద చేరగిలబడి చెల్లినుంచి వచ్చిన వుత్తరాన్ని చదువుకుంటున్నాడు. మేజర్ రాయ్ కూడా ఆ శిబిరంలోనే యింకొకవైపుకూర్చుని వాల్తా

పత్రికలు తిరగవేస్తున్నాడు. సరిహద్దు పరిస్థితిని గురించిన వార్తలు దీక్షగా చదువుతున్నాడు లడఖ్ రంగంలోనూ, ఈశాన్య ప్రాంతంలోని యితర ప్రదేశాలలోనూ యుద్ధ పరిణామాలు యేవిధంగావున్నాయో అవగాహన చేసుకుంటూ, వాటిదృష్ట్యా ఈ స్థావరం వద్ద చేసుకోవలసిన సన్నాహాలను గురించి ఆలోచిస్తున్నాడు. అంతకంటే ఆలోచించేందుకు వేరే విషయమేమీలేదు తనకి. బెంగ పెట్టుకునేందుకు తనకు తల్లీ, తండ్రీ, తోబుట్టువులూ లేరు. ప్రేయసి లేదు. తను బెంగపడడమేకాదు— తనకోసం బెంగపడే వాళ్లుకూడా యెవ్వరూలేరు. కాబట్టిఆబెంగకూడా లేదు. స్నేహితుడని చెప్పుకోతగ్గ ఒక్కవ్యక్తి తన ప్రక్కనే ఉన్నాడు. అతన్ని గురించికూడా ఆలోచించనక్కర్లేదు. రాయ్ తలఎత్తి కెప్టెన్ కేసిచూశాడు. కెప్టెన్ చెల్లెలు రాసిన ఉత్తరాన్ని చదువుకుంటున్నాడు. అతని ముఖంలో రకరకాల భావాలు రంగులు మార్చుకుంటున్నాయి. "పాపం బెంగపడుతున్నట్టున్నాడు." అనుకున్నాడు మేజర్. "ప్రసాద్‌కి తల్లీ, తండ్రీ, చెల్లెలు ఉన్నారు. కొత్తగా ప్రేయసికూడా వచ్చినట్లుంది. కాబట్టి అతను వారికోసం దిగులు పడటం, వారు అతనికోసం దిగులు పడటం సహజమే. ఏ బంధాలూ లేని నాకంటే, అన్నిబంధాలూ వున్న ప్రసాద్ మనోనిగ్రహమే గొప్పది" అనుకున్నాడు మనసులో.

ప్రసాద్ చెల్లెలు లలిత చాలాపెద్ద ఉత్తరం రాసింది. ఇంటిదగ్గర పరిస్థితీ, ఊళ్ళో విశేషాలూ వివరంగారాసింది. ఉత్తరం చదువుతూ ప్రసాద్ అందులోని విశేషాలకు మనస్సులో రూపకల్పన చేసుకుంటున్నాడు.

"ప్రియమైన అన్నయ్యా! నీ దగ్గర్నించి ఉత్తరం వచ్చినదగ్గర్నుంచీ, నువ్వు యుద్ధానికి వెళ్ళావని తెలిసినప్పటినుంచీ అమ్మకు దిగులు పట్టుకుంది. పొద్దస్తమానం నిన్ను కలవరించటంతప్ప యింకో ధ్యాసేలేదు. నీ మీద బెంగతో చిక్కి సగమైపోయింది. అమ్మ ఆరోగ్యం అసలే అంతంతమాత్రం. నీకు తెలుసుగా. ఇప్పుడు మరీయిదిగా ఉంది. రోజూ గుడికి వెళ్ళి నీకోసం పూజలుచేస్తోంది. రాత్రిళ్ళు ఏమిటో పిచ్చిగా కలవరిస్తుంది. ఆవిడ నిద్రపోదు. మమ్మల్ని పోనీదు. అర్ధరాత్రివేళ ఆమెకు ఏదో సందేహం కలుగుతుంది. లేచి నాన్నగారిదగ్గరకు వెళ్ళి నిద్ర లేపుతుంది. "ఏమండీ మనవాడున్నచోటునుంచి చైనావాళ్ళు ఎంతదూరంలో ఉన్నారండీ" అని అడుగుతుంది. లేకపోతే "అక్కడ బాగా చలిగా వుంటుందిట కదండీ. వీడు యేం తిప్పలు పడుతున్నాడో" అంటుంది. ఒక్కొక్కప్పుడు నా మంచందగ్గరకు వచ్చి ఏమిటేమిటో ప్రశ్నలు అడుగుతుంది. "ఊరుకోమ్మా. అవన్నీ ఆలోచించకు వూరికే" అంటే మౌనంగా వెళ్ళిపోయి తనలో తనే కుమిలిపోతుంది. రోజూ పేపర్లు చూస్తుంది యుద్ధంలో చనిపోయినవారిపేర్లు చూసి వణికిపోతూవుంటుంది. అన్నయ్యా... నాన్న పైకి అలా బింకంగా కనిపిస్తారుగానీ ఆయనకీ లోలోపల నిన్నుగురించి ఆందోళనగానే వుంది. ఎవరికి తెలియకపోయినా ఆ విషయం నాకు తెలుసు. తను పోలీసు ఆఫీసరు కనుక భయపడకూడదనీ, పైగా తనే భయాన్ని బైటపెట్టితే అమ్మ మరీ దిగులుతో క్రుంగిపోతుందనీ ఆయన పైకి ఏమీ బాధలేనట్లు నటిస్తారు. అమ్మకు ధైర్యం చెప్తూవుంటారు. నిన్ను గురించి ఆయనకు యేమీఆదుర్దాలేదని అమ్మకు కోపం. కానీ నాన్నకు కూడా రాత్రిళ్ళు నిద్రపట్టటంలేదు. అటూ ఇటూ దొర్లుతూ ఉంటారు. కానీ నిద్రపోతున్నట్లు నటిస్తారు. ఆయన ఎప్పుడూ నిన్నుగురించే ఆలోచిస్తూ ఉంటారు కాబోలు—ఎన్నడూలేనిది ఈ మధ్య చాలా పరాకుగా ఉంటున్నారు. పలకరిస్తే ఉలిక్కిపడుతున్నారు. నా పరిస్థితీ అలాగే ఉంది. నిద్రరాదు, తిండి సయించదు. ఎప్పుడూ నువ్వే కళ్ళముందు మెదులుతూ ఉంటావు. అంతదూరం వెళ్తూ ఒక్కసారి ఇంటికి వచ్చి మమ్మల్ని చూసేందుకు కూడా అవకాశం చిక్కలేదంటే చాలా విచారంగా ఉంది. నిన్ను చూసి అప్పుడే ఏడాది దాటింది. యుద్ధం చాలా తీవ్రంగా ఉందిట. నిన్ను మళ్ళీ చూస్తామో లేదోనని అమ్మ వణికిపోతోంది. నాకూ చాలా భయంగా ఉందన్నయ్యా. రెక్కలు కట్టుకుని నీదగ్గరికి వచ్చేయాలనిపిస్తోంది.

శత్రువులు మీ స్థావరానికి దగరగా వచ్చేశారటగా. నాన్న రోజూ చెబుతూ ఉంటారు. కానీ అమ్మతో చెప్పవద్దంటారు. నీగురించి మేము ఏమీ చెప్పకుండా దాస్తున్నామని అమ్మకి కోపంగా ఉంది. నీకు ఏదో అపాయం జరిగిందనీ, మేము చెప్పటంలేదనీ ఆమె అనుమానం.

"దేశరక్షణకోసం ఇక్కడ చాలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా కోలాహలం. రక్షణ నిధికి విరాళాలు పోగుచేస్తున్నారు. నేను కూడా ఒకరోజు డబ్బా పుచ్చుకుని ఇంటింటికీ తిరిగాను. నేను నా మెడలో గొలుసు ఇచ్చేశాను. నాన్నగారు తన వాచీ బంగారం గొలుసు ఇచ్చారు. అమ్మ చేతి గాజు ఒకటి ఇచ్చింది.

"నర్సింగ్ కోర్సు చదివిన వాళ్ళందరినీ రెడ్‌క్రాస్‌లో చేరమని చెబుతున్నారు. నేను వెళ్తానంటుంటే అమ్మ ఒప్పుకోవటంలేదు. నేను తటపటాయిస్తూవుండగానే వాళ్ళే డిప్లొమాకోర్సు ప్యాసయినవారి అడ్రనులు కనుక్కుని వచ్చేశారు. నేను సరేనన్నాను. నాన్నగారు చేరమని చెప్పారు. ప్రతిరోజూ శిక్షణ ఇస్తున్నారు. సొసైటీకి వెళ్ళి అక్కడ పని

---

● "ఇచ్చట ప్లాట్లు అమ్మబడును" — మాజీ రచయితగారింటి ముందు అట్ట బోర్డు

నేర్చుకుంటున్నాను. నాన్నకి పగలంతా ఆఫీసులోపని. పాపం అమ్మ ఒక్కతే ఉంటోంది ఇంట్లో. ఏం చెయ్యం చెప్పు. ఇక్కడ మహిళా సంఘంలో అంతా సైనికులకోసం స్వెట్టర్లూ, మేజోళ్లూ అల్లుతున్నారు. తీరిక సమయాల్లో నేనూ అల్లుతున్నాను. అవి త్వరలోనే మీకు చేరుతాయనుకుంటాను. నేనుఅల్లినవాటి మీద 'ఎల్' అని గుర్తు ఉంటుంది. వెతికి తీసుకో. మీ స్నేహితులకు కూడా నేను అల్లినవే ఇవ్వాలి.

'అన్నయ్యా ... నువ్వు రాసిన ఉత్తరాన్ని ఎన్ని వందలసార్లు చదువుకున్నానో చెప్పలేను. అంతా కంఠోపాఠం వచ్చేసింది. అంత ప్రమాదకరమైన ప్రదేశంలో ఉండి కూడా అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని వర్ణిస్తూ కవిత్వం ఎలారాయగలిగావు అన్నయ్యా. నాకు బలే ఆశ్చర్యం వేసింది. యుద్ధం ఇంకా తీవ్రమైతే నేనురాసే ఉత్తరాలు నీకు ఇవ్వరుట కదూ. నాన్న చెప్పారు. అసలు ఈ జీవితంలో మళ్ళీ మనం కలుసుకుంటామో లేదోనని భయం వేస్తుంది. ఇంక కొద్ది రోజులుపోతే కనీసం ఇలా ఉత్తరాలు రానుకునే అవకాశం కూడా ఉండదేమో. అప్పుడు నీ క్షేమసమాచారంకూడా మాకు తెలియదు. అందుకే ఎన్నెన్నో విషయాలు ఇప్పుడే నీకుపేజీలతరబడి రాసేయాలనిపిస్తోంది. మనం రాసుకునే వుత్తరాలని మధ్యలో ఆఫీసర్లు చింపి చదువుతార్ట కదూ. అన్నయ్యా! ఈ వుత్తరం చూసినవెంటనే నీ విషయాలన్నీ యేమీ దాచకుండా వివరంగా రాస్తావుకదూ. ఏమైనా దాస్తే నా మీద ఒట్టు. ఉత్తరం అమ్మకీ, నాన్నకీ చూపించనులే. ఈ చెల్లాయి రోజూ నీ కోసం, నీ మిత్రులకోసం ప్రార్థిస్తూ వుంటుంది. అన్నట్లు— నువ్వు నీ మిత్రులతోకలిసి తీయించుకున్న ఫొటోని అమ్మ తన దగ్గరే వుంచేసుకుంది. ఎప్పుడూ దాన్నే చూస్తూ కూర్చుంటుంది. ఇవ్వమంటే యివ్వదు. అందుకని నాకు యింకో ఫొటో పంపించు. ఉత్తరం త్వరగా రాస్తావుకదూ. ఎదురుచూస్తూంటాను.

—నీ చెల్లి–లలిత'

ఉత్తరం చదువుతుంటే కెప్టెన్‌కి తను తన యింటోవుండి అందరినీ చూస్తున్నట్టు అనిపించింది. చెల్లెలి కన్నీటిచుక్కలు వుత్తరంలో అక్కడక్కడా పడి అక్షరాలని చెరిపేశాయి. ఉత్తరంతోపాటు ఒక ఫొటోని కూడా పంపింది లలిత. అందులో ఆమె, తల్లి, తండ్రి వున్నారు. అది యిటీవల కొత్తగా తీయించుకున్న ఫొటో. ప్రసాద్ బెడ్డింగులోనుంచి ఆల్బమ్ తీసి అందులో యీ ఫొటోను అంటించాడు. మేజర్‌ని పిలిచి ఆ ఫొటోను చూపించాడు. తర్వాత ఆల్బమ్‌లోని ఫొటోలన్నీ చూపించాడు. అవన్నీ మేజర్ యిదివరకే చాలాసార్లు చూశాడు. ఫొటోల ద్వారా ప్రసాద్ కుటుంబం అంతా అతనికి పరిచయమే. చెల్లెలి వుత్తరం రాగానే ప్రసాద్ అందులోని విశేషాలన్నీ యింగ్లీషులోకి అనువదించి చెబుతూవుంటాడు. ప్రసాద్ యిల్లు విడిచి సైన్యంలో చేరేటప్పుడు తన యింటిలోని గదులన్నింటినీ ఫొటోలు తీశాడు. అవన్నీ ఆల్బమ్‌లో అతికించాడు. 'ఇది మా హాలు, ఇది మా నాన్నగారి ఆఫీసుగది, ఇది నా గది, ఇది వంటగది, ఇది తులసికోట' అని మేజర్‌కి చూపిస్తువుంటాడు.

ఫొటోలుచూస్తూ మేజర్ ఆలోచనలో పడ్డాడు. 'అంతమందిప్రేమకు నోచుకున్న కెప్టెన్ ఎంత అదృష్టవంతుడు' అనుకున్నాడు. తనచెల్లెలు బ్రతికివుంటే ఆమెకూడా యిలాగే వుత్తరాలు రాసేదికదా. అయినా ఒకవిధంగా తనూ అదృష్టవంతుడే. చచ్చిపోవడానికి తనకి ఉన్నంత స్వేచ్ఛ ఎవరికీ లేదు. తనకు దేశమే తల్లి, దేశమే ఇల్లు, అందరూ తల్లికోసం, ఇల్లుకోసం బెంగపడినట్లు తను దేశంకోసం తాపత్రయ పడుతున్నాడు. మరి తను చచ్చిపోతే దేశం ఏడుస్తుందా? ఎందుకు ఏడవాలి? తనకోసం ఏడిచేవాళ్ళు ఎవరైనా ఉండాలని ప్రతివ్యక్తి కోరుకుంటాడు. ఎందుకో ఆ స్వార్థం?

ప్రసాద్ చెల్లెలుఫొటో చూపిస్తూ అన్నాడు, 'ఇంతమంచిచెల్లెలు ఉన్నందుకు నేనెంతో అదృష్టవంతుణ్ణని అనుకుంటూ ఉంటాను మేజర్. కానీ మళ్ళీ ఈ జన్మలో ఆమె ముఖం చూస్తానో లేదో. ఆమెకి గొప్ప ధీరోదాత్త నాయకుణ్ణి తెచ్చి పెళ్ళి చేయాలని కలలు కనేవాణ్ణి. ఆమె పెళ్ళి చూసేవరకైనా ఈ యుద్ధం రాకుండా ఉంటే ఎంతో బాగుండేది.'

మేజర్ మితభాషి. ఏమీ మాట్లాడలేదు. ప్రసాద్ ఆల్బమ్ మూసివేసి, చెల్లెలికి వుత్తరం రాయటంలో మునిగిపోయాడు.

(సశేషం)

చిత్రరథుని

# చైత్రయాత్ర

## • అరవై నాలుగులో ఇరవై నాలుగు మెట్లు

అరవైనాలుగులో నికార్సు తెలుగు చిత్రాలు ఇరవయి నాలుగు, లేదా మహా అయితే ఇరవయ్ అయిదు విడుదల అయినవి; లేదా సెన్సార్ అయినవి.

అరవయినాలుగు మొత్తంమీద చలనచిత్ర కళాలక్ష్మిని ఇరవయి నాలుగు మెట్లు సింహాసనం ఎక్కించిందనే చెప్పాలి. పేరాగ్రాఫ్ ఒక మెట్టు లెక్కన 64 లో...

1. ఈస్ట్‌మన్ కలర్ చరిత్ర ప్రారంభమైంది. "అమరశిల్పి జక్కన్న" ఆరంభం శుభప్రదం. శతదినోత్సవం ఇందుకు సాక్షి.

2. మొట్టమొదటి సాంఘిక వర్ణ చిత్రం (ఈస్ట్‌మన్ కలర్) "తేనె మనసులు" ప్రారంభించారు. ఇంకా ఎన్ని విధాల ఈ హైదరాబాద్ చిత్రం తేనె జల్లు కురిపించేదీ "జ్యోతి" పాఠకులకు విదితమే.

3. "లవకుశ" గేవాకలర్ చిత్రం వరుసగా సంవత్సరకాలం హైదరాబాద్‌లో ప్రదర్శించబడింది. ఈమధ్య ఏ భాషా రంగంలోను యింతటి రంగుల రికార్డు లేదు.

4. పల్లెటూరికి చెందిన ఒకనటుడు అమెరికా స్టుడియోలలో అతిథ్యం పొందారు. "క్లియోపాట్రా" వంటి బ్రహ్మాండమైనచిత్రం టెక్నీషియనులతో చర్చించారు; భారతదేశానికి తిరిగి వచ్చేటప్పుడు జపానువంటి దేశాలలో "తుపాను" పర్యటన జరిపారు.

5. ఓ హీరో పట్టభద్రుడు తొలిసారి ఓ సాంఘికంలో ద్విపాత్రాభినయంచేసి కొత్త రుచు లిచ్చారు. ఆ అగ్గిపిడుగు ఓ జానపదంలోను "రిపీట్ పెర్ఫార్మెన్స్" యిచ్చి రిపీటెడ్ ఆడియన్స్‌కు అమితాహ్లాదం కలిగించారు. రెండేసి పురుషపాత్రలు రెండు చిత్రాలలో ధరించిన యీ నిండుమనిషి ఓ పాండవకథలో అరపురుషుడి వేషం వేసి 25 వారాల మెలురాయి దాటించారు. ఆ చిత్రం 1963 లో రజతోత్సవం, రాష్ట్రపతి యోగ్యతాపత్రం, ఇంకేవేవో అవార్డులు పొందింది.

6. కొత్త టెక్నీషియన్‌లు, తారలు పరిచయమయ్యారు. "బొబ్బిలి యుద్ధం"తో దర్శకులు-నటులుకూడా





వి. ఎన్. ఫిలిమ్సువారి "భక్త రామదాసు"లో భక్త రేలంగి

అయ్యారు సీతారాం. నందనరావు దర్శకుడుగా, రాధ కథా రచయిత్రిగా, ఎమ్. బి. శ్రీనివాస్ సంగీత దర్శకుడుగా పరిచయమైనారు. పసల సూర్యచంద్రరావు, శీర్ల బ్రహ్మయ్య మొదలైనవారు వయసుతెరపరిచయానికి అవరోధం కాదని తెలపారు. "పూజాఫలం" ఓ ఛాయాగ్రాహకుని ప్రతిభకు పండిన ఫలం. మునిపల్లె రాజుకూ అంతే.

7. టెక్నీషియన్‌నులు అవార్డులు, బిరుదులు పొందారు. చిత్రాలు అవార్డులు పొందాయి. శ్రీ వేదాంతం రాఘవయ్య, శ్రీ టి. వి. యస్. శర్మ యిందుకు నోచుకొన్నారు. శ్రీకమలాకర కామేశ్వరరావు దర్శకత్వంవహించిన "నర్తనశాల"నటుడు రంగారావు, టెక్నీషియన్ టి. వి. యస్. శర్మ అంతర్జాతీయ అవార్డులు అందుకొన్నారు. తెలుగుచిత్రబృందం మూకుమ్మడిగా ఓ విదేశం సందర్శించి అవార్డులతో తిరిగిరావడం యిదే మొదటిసారి.

8. తారల జీవితచరిత్రలు గ్రంథస్థమైనవి. నాగేశ్వరరావు అమెరికాలో తను చూచిన విశేషాలగురించి కలం

బలం చూప మొదలెట్టింది కూడా 64 లోనే.

9. కొన్ని శోకగీతాలు వినబడ్డాయి. గాన తార కన్నాంబ, గాన దర్శకుడు గాలిపెంచల మనకిక లేరు. అయితే, వారు చూపిన గాన, నట, సంగీత సంప్రదాయాలు ఏనాటికైనా తెలుగు చిత్రకళాలక్ష్మికి అందలమే.

10. తెలుగు దనానికి, తెలుగు జాతీయతకు మూగ నివాళి అర్పించబడింది. ఆ మూగ మనసుల చిత్తశుద్ధికి ప్రేక్షకులు బహుళంగా విత్తమిచ్చారు. "షావుకారు" వంటి చిత్రాల తర్వాత చాలా కాలానికి తెలుగుదనాన్ని మూర్తీభవించినట్టు ముమ్మూర్తులా చూచాము.

11. డబ్బుకొద్దీ రొట్టె కదా అని చిన్నవారు నిరుత్సాహపడనవసరం లేదని ఓ ధైర్య నినాదం వినబడింది. చిన్న బడ్జెట్ చిత్రాలు, సినీ పరిభాషలో అయితే "బి" ఆర్టిస్ట్సుతో తీసే చిత్రాలూ విజయవంతం కాగలవని "బంగారు తిమ్మరాజు," "తోటలోపిల్ల కోటలో రాణి" నిరూపించాయి.


12. మనం ఔట్‌డోర్‌కు కేరళకు మరోచోటికి పోకుండా మన గోదావరి, మన నాగార్జునసాగర్, మన దగ్గరి తుంగభద్ర, మన హార్సిలీహిల్స్ లొకేషన్‌లయ్యాయి.

13. అలనాడు లక్ష్మమ్మ ద్వయాన్ని పోటాపోటీగా కొలది వారాలలో నిర్మించాము. ఇప్పుడు 'క్విక్'లకు శ్రీధర్, విఠలాచార్య పెట్టిందిపేరు. 64 లో ఆ స్థానం వహించారు "మైరావణ" సుబ్బారావు. సినిమాలలో 'జెట్' రేస్‌కు మనమూ సిద్ధమే. క్వాలిటీ కూడా కాలానుగుణంగా పెరుగుతుందని ఆశించుదాము.

14. అంత మాత్రంచేత 'ట్రీట్‌మెంట్'లో మనం వెనుకపడి వున్నామని కాదు. "మూగమనసులు," "డాక్టర్ చక్రవర్తి," "పూజాఫలం," "అమరశిల్పి జక్కన్న," "మంచిమనిషి," "రాముడు భీముడు," "సుమంగళి" చక్కగా 'ట్రీట్' చెయ్యబడిన సినిమాలు. ట్రీట్‌మెంట్ స్థాయి 64 లో పెరిగింది. దర్శకత్వం, కథాసంవిధానం రెండూ ఈ పేరాగ్రాఫ్‌కు రెండు కళ్ళు అయినవి. ("సుమంగళి" డిసెంబర్‌లో సెన్సార్ అయింది.)

15. క్షమ, సహనాలు మొత్తానికి గమ్యం చేర్చగలవని 64 లో మూడు చిత్రాలు ధైర్యం కలిగించాయి. పెక్కు సంవత్సరాలు నిర్మాణానికి పట్టినా సినిమా పీటలు ఎక్కినవి "పీటల-మీది పెళ్ళి," "బభ్రువాహన," "వారసత్వం," "రామదాసు."

16. మేటి తారల సంగతి అటుంచండి. తక్కిన వారిలో కొందరికి 64 చాలా ప్రాధాన్యమిచ్చినది. రాజశ్రీ అమాంతం హీరోయిన్ అయింది. తమిళంలో రంగుల చిత్రాలలోను ఆ స్థాయిలో నటిస్తూన్నది. వాణిశ్రీ, వాసంతి, గీతాంజలి స్థాయి పెరిగింది.



వీనస్ పిక్చర్సు సమర్పించే అశోకమూవీస్ "సుమంగళి" లో నాగేశ్వరరావు, సావిత్రి

17. సున్నితపు నటనకు, సన్నివేశాలకు ఒకప్పుడు పేరుండేది తెలుగుసినిమాకు. కాని ఆ లాలిత్యం తగ్గి కొంత మొరటుతనం వచ్చింది. మళ్ళీ లాలిత్యానికి ఓటు వేసిన సినిమాలు "వివాహబంధం", "డాక్టర్‌చక్రవర్తి", "కలవారికోడలు", "అమరశిల్పి జక్కన్న", రామదాసు", "సుమంగళి", "పూజాఫలం".

18. 64 లో అభినయప్రమాణం పెరిగిందనడానికి "మూగమనసులు" "ఆత్మబలం", "అగ్గిపిడుగు", "రామదాసు", "సుమంగళి" సాక్ష్యాధారాలు.

19. 64ను సంగీతసంవత్సరమంటే బాగుంటుంది. "మూగమనసులు", "పూజాఫలం", "డాక్టర్ చక్రవర్తి", "రామదాసు", "బొబ్బిలియుద్ధం" ఆ కీర్తిని తెచ్చినవి; "ప్రజా పాటలు" (పాప్యులర్ సాంగ్స్) వినిపించినవి. "ఆత్మబలం", "దాగుడుమూతలు" ప్రజలను కూడగట్టుకు నేటట్లుగా సినిమా పాటల సాహిత్యస్థాయి పెరిగింది.

20. 64 ప్రధానంగా రెండు రకాల చిత్రాలకుఒరవడిపెట్టింది. ఐతే సూక్ష్మంలో మోక్షం. డిటెక్టివ్ కథలు, సినిమా పరభాషలో అయితే సాధారణ తారాగణంతో యీజీ సబ్జెక్టులను వడివడిగాతెర కెక్కించడం. లేదా భారీ ఆడంబరాలతో పెద్ద స్టార్ కాస్టుతో చిత్రం తయారుచెయడం. ఇంత స్పష్టమైన విభాగం మున్నెన్నడూ తెలుగుసీమలో లేదు.

21. పెద్ద బడ్జెట్ చిత్రాలకు వుదాహరణగా పాండవ వనవాసం, వీరాభిమన్య, శ్రీకృష్ణపాండవీయం, విశాల నేత్రాలు, ఆంధ్రమహావిష్ణువు, సత్య హరిశ్చంద్ర మొదలైనవి వుదహరించవచ్చు. ఈవరకు రామాయణ గాథలు బాక్స్ ఆఫీస్ హిట్స్ అనుకొనేవారు. "నర్తనశాల" విజయంతో భారతంపై బాక్స్ ఆఫీస్ భారం యెక్కువ వేస్తున్నారు.

22. సన్మానాలు, సత్కారాలు వలె త్యాగాలూ 64 లో బాగా కానవచ్చినవి. యువకులకు యివి ఆసక్తిజనకం కావచ్చు. రామారావు 1,10,000 రూపాయల విరాళం బాధితులకు సహాయంగాను, ఉత్తమ కార్యాలకుగాను ప్రకటించారు.

23. "దాగుడుమూతలు" ఓ కొత్త వొరవడి పెట్టింది. టిపికల్ క్యారక్టర్స్‌ను సృష్టించారు. ఆద్యంత ఆనంద చిత్రాలకు సూత్రధారి అయింది. పద్మనాభం హాస్యంలో ఓ కొత్తపుంత తొక్కారు. 65 యీ "వుప్పు" న్ను అందుకొని "బరి"కి గురిగా పరుగిడే సూచనలు కానవచ్చినవి.

24. చాలా కొత్త సంస్థలు చిత్రాలు తీసి కొత్తవారికి అవకాశాలిస్తున్నాయి హైదరాబాద్‌లోకూడా కార్యక్రమాలు సమధికోత్సాహంగా జరుగుతున్నవి. కొన్ని కొత్త సంస్థలు బిగ్ బడ్జెట్ పిక్చర్స్ తలపెట్టడంబట్టి సినిమా సిరిపై నమ్మకం హెచ్చుతున్నదనే చెప్పవచ్చు.

మొత్తంమీద 1964 లో తెలుగు సినిమా తమిళం, బెంగాలీ, హిందీ, మరాఠీ, ఆంగ్ల రంగాల్నుంచి,సాక్షాత్తూ తెలుగు సాహితీ రంగంనుంచీ సబ్జెక్టులు తీసుకొని విశ్వజనీనతను నిరూపించుకొన్నది.

● ● ●

## జానపదంలో "కొత్త" విలన్

శివశక్తి ఫిలిమ్స్‌వారి జానపద చిత్రంలో "కొత్త" విలన్ కానరానున్నాడు. నాగభూషణం ఆ భూమిక ధరిస్తారు. డీసెంబర్ నాల్గవ వారంలో మద్రాసులో షూటింగ్ ప్రారంభమైంది. అంతకు ముందు ముళ్ళపూడి వెంకటరమణ రచించిన రెండు పాటలు రికార్డు చెయ్యబడినవి. సుశీల బృందం కోరస్ పాట ఒకటి. పి. బి. శ్రీనివాస్ స్వతంత్రగానం ఒకటి. సంగీత దర్శకుడు కోదండపాణి. కాంతారావు, రాజశ్రీ, ధూళిపాళ, బాలకృష్ణ మొదలైనవారు తారాగణంలో కలరు. దర్శకుడు పుట్టన్న, ఛాయాగ్రహణం వెంకట్, కథ సంభాషణలు ఆదుర్తి నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి. బి. నారాయణ.



స్కెచ్

# సుమతి భానుమతి సుగతి

సినిమారంగంలో ప్రవేశించిన పావు శతాబ్దానికి "ఓహో పావురమా తార" హైదరాబాద్ చిత్రం షూటింగ్‌లో పాల్గొని అంతస్తుల ప్రస్తావనకు కారకులైనారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి "వివాహ బంధం" ముఖ్యతార వేదిక నలంకరించిన సభలో మాట్లాడుతూ "భానుమతి అంతటి అంతస్తుకల తార హైదరాబాద్‌లో స్థిరపడితేనే రాజధాని సినిమా అంతస్తు పెరుగుతుం" దన్నారు.

జగపతీవారి "అంతస్తులు" ప్రధాన పాత్రధారిణి అందుకు సమాధానమిస్తూ మద్రాసుతో దాదాపు సరి సమానమైన అంతస్తును హైదరాబాద్ అందుకొన్న మరుక్షణంలో భానుమతి ఎడ్రసు భాగ్యనగరం కాకమానదన్నారు.

ఐతే అప్పటికి యెంతకాలమవుతుందని పాఠకులు అడగవచ్చు. 40 ఏళ్ళు వచ్చిన భానుమతి యింకా కొన్నేళ్ళకు రాజధానీ నగరం వచ్చి ప్రయోజన మేమిటని యింకొందరు అభిమానులు అడుగవచ్చు.

కాని కాలాన్ని జయించిన తార భానుమతి. "స్టార్స్ మేకమ్ అండ్ స్టార్స్ మె గో, బట్ ఐ గో ఆన్ ఫర్ ఎవర్" అన్న నానుడి యీ సుమతి సుగతికి సుగీతిక.

అటు హిందీ, బెంగాలీ రంగాలు చూస్తే అశోక్ కుమార్,పహారిసన్యాల్, జయరాజ్‌లు "బేబీ" దశలో వున్న తారలకు అన్నలుగా, "యువ" దశకు వచ్చిన అదే తారలప్రక్కన హీరోలుగా, ఆ దశలోనే వున్నవారిప్రక్క



తండ్రులుగా, తాతలుగా నటించారు. అంతే వయసుబట్టి పస తగ్గగా పురుష తారలు అన్నలనుంచి తాతలదాకా రంగులు మార్చారు.

లీలాచిట్నీస్, దుర్గా ఖోటే, మొలీనావంటి తారలు హీరోయిన్ లుగా జీవిత మారంభించి అత్యల్ప కాలంలోనే అమ్మల, అమ్మమ్మల సినీఅవతారా లెత్తారు.

భానుమతివిషయంలో మాత్రం ఆ రెండింటికీ భిన్నమైన సంఘటనలు జరిగినవి.

(సినీ జూబిలీ (25 ఏళ్ళ సినీ అనుభవం) చేసుకొన్నా రవరవలాడే హీరోయిన్ పాత్రలు ధరిస్తూనే వున్నారు. ఆమె ప్రక్కన నటించినవారు రకరకాల తరగతులలోకి వెళ్ళిపోయారు.

అక్కినేని నాగేశ్వరరావు జూనియర్‌గావుండి తొలిసారి భానుమతి చిత్రం "ధర్మపత్ని" లో నటించారు. అప్పటికే ఆమె సీనియర్ తార. ఐదారు మంచి చిత్రాలలో నటించి వున్నారు. ఈ మధ్యకాలంలో జూనియర్-సీనియర్ అయినా సీనియర్ అలానే వుండి కొన్ని సినిమాలలో జంటనాయికత్వం వహించారు. "ధర్మపత్ని" హీరో హనుమంతరావు వెండి తెరనుంచి యేనాడో నిష్క్రమించారు.

ఆ రోజుల్లో భానుమతి-నాగయ్య కాంబినేషన్—బాక్స్ ఆఫీస్‌కు స్వర్ణసీమ. అలనాటి హీరో నాగయ్య యీనాడు ఆ భానుమతికే ("వివాహబంధం"లో) తండ్రిగా నటించారు. రామనాను తప్పిస్తే హీరోగా ఆయన నిష్క్రమించి పుష్కర మౌతున్నది.

భానుమతిప్రక్కన నటించిన నారాయణరావు, రంజన్, ఎమ్. కె. రాధ మొదలైనవారు స్వంత శైలులు తప్పారు.

మగవాళ్ళకంటె ఆడవాళ్ళకు గ్లామర్ త్వరగా పోతుందనే వాదన శుద్ధాబద్ధమని నిరూపించిన యేకైక తార భరణీవారి ఆభరణం.

భానుమతి సర్వజ్ఞురాలు. అన్ని విషయాలు సంపూర్ణంగా తెలుసునని మేముకాని ఆమెకానిఅనరు. ఎంచేతనంటే "లైఫ్ ఈజ్ షార్ట్, ఆర్ట్ ఈజ్ లాంగ్" (జీవితకాలం తక్కువ, కళాసాగర విస్తీర్ణం ఎక్కువ) అన్నారు పెద్దలు. బహుశా భానుమతికి వున్న సినీ పరిజ్ఞానం చాలా మంది తారలకు లేదంటే అపార్థం చేసుకోరాదు.

మెట్టుమెట్టుగా పైకి వచ్చి, సాంకేతిక రంగములను ఒక్కటొక్కటిగా తెలుసుకొంటూ అపార అనుభవజ్ఞానం పొందిన అందాల భామ భానుమతి.

1933 ప్రాంతాలకు కూడా అందమైనవారు, ఆడగలవారు, వాటికి మించి పాడగలవారు మాత్రమే సినిమాలకు అర్హులు. ఆ మూడు యోగ్యతలూ ఆమెకు వున్నాయి. ఈ మధ్యకాలంలో (1948 తర్వాత) పాటరావాలన్న పరతు పోయింది. పి. సుశీలో, జానకో పాడితే పెదవి కదిపే శక్తి వుంటే చాలు. ఐతే అన్నింటికి మించి "ఫొటోజెనిక్" అందం వుండేవాలు. యోగ్యతలు తరిగేసరికి పోటీదారులసంఖ్య పెరుగు



తుందికదా. అయినా యీ పోటీని యెదుర్కొంటూ భానుమతి మాత్రం తనకంతశక్తినే నమ్ముకొని వున్నారు. సినిమారంగంలో అనేక దశల అనుభవం కళ్ళారా చూచిన కాంత భానుమతి.

1943 లో (అప్పటికి ఆమె వయసు 18 సంవత్సరాలు) "కృష్ణప్రేమ" లో నటిస్తూ "రామకృష్ణప్రేమ"ను చూరగొని ఆ అసిస్టెంట్ డైరెక్టర్ పి. రామకృష్ణరావును వివాహమాడి సాంసారికజీవితంలోని కష్ట-సుఖాలు తెలుసుకొన్నారు భానుమతి. సాంసారిక జీవితంలోని పాత్రల్లో ఆమెకు మైత్రి యెక్కువ. సంసారానుభవంకూడా ఆమెకు హెచ్చు. నేటికీ బొమ్మలకొలువు-పేరంటాలు జరుపుతూ వుంటారు. భర్త సంపూర్ణదర్శకుడై భానుమతితో చిత్రాలు తీస్తూవుంటే భర్త అన్న చనువుకొద్దీ చొరవతీసుకొని దర్శకత్వాది శాఖలన్నింటిని స్పృశించారు.

భరణీ స్టుడియోస్ నెలకొల్పేటుప్పటికి ప్రొడక్షన్ లైనంతా క్షుణ్ణంగా తెలుసుకొని వున్నారు. ఆ మీదట స్టుడియోవిజ్ఞానంకూడా పొందారు.

"చండీరాణి" ద్విపాత్రాభినయ భాషాచిత్రానికి కథ, సంగీతం, దర్శకత్వంశాఖలకు అధ్వర్యం వహించారు.

ఎక్కడో పై అంతస్తులో చాలా కాలంగా వుండిపోయినందువల్ల ఆ గంధర్వగాయనికి గీర్వాణంకొంచెం హెచ్చు అంటారు. కొందరు. కాని అది గీర్వాణం కాదు. "మంగమ్మ



డి. వి. యస్. ప్రొడక్షన్సువారి "మంగమ్మ శపథం"లో యన్. టి. రామారావు

శపథం" (అలనాటిది) తారకు మంగమ్మ పాత్రకుగల పంతం మటుకు కొంతవుంది. ఆ పంతం మూలాన రెండు, మూడు చిత్రాలలో హీరోయిన్ పాత్రలనుంచి తప్పుకొన్నారు. మంచో చెడో కాని రాజేశ్వరరావు సంగీతానికి టైటిల్స్‌లో పర్య[illegible] వహించారు.

తారలు ప్రభులకు [illegible]

దంతపుకోటలలో వుంటేనే మోజు నిలుపుకొంటారనే సినీసూక్తిని అక్షరాలాపాటించినతారభానుమతి. ఆమె ఎక్కువగా సభలకు వెళ్ళరు. అవార్డులు తీసుకొనే సభలలోనే ప్రభుత్వాధిపతులు ఈమెకోసం వేయి కళ్ళతో ఎదురుచూసే పరిస్థితి కల్పించడం కద్దు.

భానుమతిపై ఇంకో అభాండం కూడావుంది. అంతస్తుతార. అంచేత ఆలస్యం అంటారు కొందరు. ఐతే "అలస్యాదమృతం విషం" సూక్తిలో చివరి మాటను ఆమె తీసివేశారు.

స్వానుభవంపై బి. యన్. రెడ్డి గారు అన్నదేచాలు. "నేనూ, భానుమతి, మా రాజేశ్వరరావు ఒక పిక్చర్‌కు వున్నామూ అంటే కనీసం పంచవర్ష ప్రణాళికే" అన్నారు మల్లీశ్వరి బ్రహ్మ. "అయితేయేం, క్వాలిటీ చూచుకొంటే ఎంత 'డిలే' అయితే అంత మేలే" అన్నారు "కుంజరః" స్థాయిలో. "స్వర్గసీమ" కథకులు మన చక్రపాణే.

శివాజి గణేశన్ సినిమా రంగంలో ప్రవేశించకముందు భానుమతి, నాగయ్య, బి. యన్. రెడ్డీలపై మోజుకొద్దీ "ఓహో పావురమా" సినిమా (స్వర్గసీమ) 19 పర్యాయాలు చూచారు. ఇప్పటికీ ఆమోజుపోక, పార్టీనితెచ్చి తమిళంలో ఆ చిత్రాన్ని పునర్నిర్మించవలసిందని బి. యన్. ను కోరుతున్నారు. అయితే అప్పటి భానుమతి అంతస్తు యిప్పటి సరోజ మించగలదనే ధైర్యం ఒకటి రావలసి వుంది బి.యన్. కు. వస్తే, యితర యేర్పాట్లుకూడా సంతృప్తికరంగా వుంటే బి. యన్. నమ్మిన "స్వర్గసీమ" తీయవచ్చు.

ఎంతయినా వయసు మహా చెడ్డది. మేకప్‌కు కూడా పరిమితులున్నాయి. అంచేత ఆ హద్దులలోనే భానుమతి నటించి బెట్టిడేవిస్, వివియన్‌లీల స్థాయిలో వుండగలరనుకొంటున్నారు. భరణీ తీయనున్న కొత్తచిత్రం ఈ ధోరణిది. ఈ అసాధారణ వార్త రహస్యాలు అత్యల్ప కాలంలో వెల్లడి కాగలవు.

భానుమతి అసలుపేరు భానుమతే కాదు. వేరేవున్నది. ఆ పేరును భానుమతి తన ఆత్మకథలో బైటపెట్ట దలచారట.


నిన్న మొన్నటి వరకు భూమికలో భానుమతి లీనమై నటించేవారు. ఈ మధ్య భానుమతిలోనే భూమిక ఇముడుతున్నది. హైదరాబాద్ మద్రాసు అంతస్తు చేరేసరికి మళ్ళీ భూమికలో భానుమతి లీనమైపోవడం తథ్యం.

• • •

## ఆంధ్రమహావిష్ణువు

శంభూవారి "ఆంధ్రమహావిష్ణువు" పాటల రికార్డింగ్ దశకు వచ్చింది. రామారావు, సావిత్రి, విజయలక్ష్మి, దండమూడి తారాగణంలో కలరు. రచన పింగళి, దర్శకుడు శేఖర్, నిర్మాత లక్ష్మీనారాయణ చౌదరి.





మాధవీ ప్రొడక్షన్స్‌వారి "పాండవ వనవాసము"లో గుమ్మడీ, కొంతారావు, రామారావు, బాలయ్య

## చిత్రసమీక్ష

# బొబ్బిలి యుద్ధం

రాజ్యకాంక్ష బంధువులను, దేశాలను, స్వాతంత్ర్యాన్ని ఎలా నిర్మూలిస్తుందో గుణపాఠం చెప్పేది 18 వ శతాబ్దపు మధ్య గాథ "బొబ్బిలి యుద్ధం".

చరిత్ర, చలనచిత్రము—ఈ రెండింటిలో రెండవదే యెక్కువగా కన్పించే "బొబ్బిలియుద్ధం" కథలో విజయనగరాధీశుడు రామరాజు తన బంధువైన బొబ్బిలి రాజకుటుంబంపై పగబట్టి, ఫ్రెంచి బుస్సీ బలగంతో వారి నిర్మూలనకు కారకుడై తుదకు బొబ్బిలి బెబ్బులి తాండ్ర పాపారాయుడుచే వధించబడతాడు. నాడు

పాపారాయుడు అన్నది—బొబ్బిలి వీరులు చిందించిన ఒక్కొక్క రక్త బిందువు భారతదేశంలో విదేశపరిపాలనను హతమార్చే ఒక్కొక్క వీరుని సృష్టిస్తుంది. బోసు, గాంధీజీ, నెహ్రూలను—తెలుగువారు తప్ప తక్కినవారిని— "బొబ్బిలి యుద్ధం" చూపుతుంది.

మనమాట :—ప్రభుత్వపు అవార్డు చిత్రం. పౌరుషప్రధాన చిత్రం. ఈ సంవత్సరపు యేకైక చారిత్రక చిత్రం. ఈ విషయాలూ, తల్లిగా భానుమతి నటన, భార్యగా ఆ మల్లమదేవిపాడిన "ఊయల లూగినదోయీ మనసే" అనే పాట, పాపారాయుడుగా పావుగంట సేపు రంగారావు నటన, చరిత్ర వున్నంతకాలం ప్రేక్షక స్మరణీయం.

సాంఘిక, జానపద, పౌరాణిక చిత్రాలనే చూస్తున్నవారికి మాంఛి రిలీఫ్ యిస్తుంది యీ చిత్రం. జాతీయత వున్నందున సాంఘికాలపై స్ట్రోక్ చేస్తుంది. డీవియేషన్‌గా జానపద, పౌరాణికాలపై స్ట్రోకు చేస్తుంది. అంతా సబ్జెక్టు వాల్యూయే!

ముగింపుమాట :—మన చరిత్రపై పరంపరగా చిత్రాలు తీసేందుకు యిక "యుద్ధం" ప్రారంభంకావచ్చు.

# చలన చిత్ర వార్తలు

## రిపబ్లిక్ తదుపరి చిత్రం

రిపబ్లిక్ ప్రొడక్షన్స్‌వారు "సత్యం, శివం, సుందరం" అనే సాంఘికాన్ని స్క్రిప్టుతోసహా తయారుచేసి వుంచుకొన్నారు. జూనియర్ సముద్రాల రచన సాగించారు. రిపబ్లిక్ వారు కాబట్టి జనవరి 26 న షూటింగ్ ప్రారంభించవచ్చు" "బొబ్బిలి యుద్ధం" విజయవంతమైనందున అడవి బాపిరాజుగారి చారిత్రకనవల నొకదానిని ఆధారంగా తీసుకుని చిత్రం తీయాలని దర్శక - నిర్మాత సీతారామ్ ఆలోచిస్తూ వున్నారు.

## అన్నపూర్ణావారి కొత్త చిత్రాలు

అన్నపూర్ణావారి తదుపరి చిత్రానికి స్టోరీ డిస్కషన్ మద్రాసులో డిసెంబర్ రెండవ, మూడవ వారాలలో జరిగింది. విశ్వనాథ్ దర్శకత్వం వహించే ఈ చిత్రానికి ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలు సమకూర్చుతున్నారు. నిర్మాత : దుక్కిపాటి మధుసూదనరావు. ఫిబ్రవరి లో హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభం కాగలదు. మరి కొలది నెలల పిమ్మట ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంతో ఇంకో చిత్రం తీయనున్నారు.



విజయలక్ష్మి పిక్చర్స్‌వారి "విజయసింహ"లో
రాజశ్రీ, కాంతారావు

## హైదరాబాద్, ఊటీలలో "తేనె మనసులు"

బాబూ మూవీస్ వారి 'తేనె మనసులు' ఈస్ట్‌మన్ కలర్ చిత్రం షూటింగ్‌లో మరొక ఘట్టం డిసెంబర్ మూడవ వారంలో ప్రారంభమైంది. అది పూర్తిచేసికొని ఉదకమండలం వెడుతున్నారు. ఈ సంచిక వెలువడేసరికి ఊటీలో కూడా షూటింగ్ పూర్తి అవుతుంది. మొత్తానికి జనవరిలో షూటింగ్ యావత్తూ ప్యాచ్ వర్కుతోసహా పూర్తిచేసి ఫిబ్రవరికి విడుదల చేస్తారు. ఈ షెడ్యూల్సుకు ముందు శ్రీనివాస్, సుశీలపాడిన 'ఎందుకని' అనేపాటలో (రచన ఆత్రేయ) ఒక భాగాన్ని బంజారాహిల్స్ (హైదరాబాద్) సమీపాన సుకన్య, సంధ్యారాణీలపై చిత్రీకరించారు. ఈ పాటలోనే వేరొక భాగాన్ని శ్రీసారథిస్టుడియోస్‌లో రామమోహన్, సంధ్యారాణీలపై చిత్రీకరించారు. కృష్ణ, రోజారాణి స్కూటర్‌యాన దృశ్యాలు కూడా సుందర నగరంలో "షూట్" చేశారు.

సాంకేతిక సిబ్బంది వివరం: దర్శకత్వం: ఆదుర్తి, కథ: ఆదుర్తి, ఆత్రేయ, ముళ్ళపూడి. సంభాషణలు: ఆత్రేయ, పాటలు: ఆత్రేయ, దాశరథి, సంగీతం: కె. వి. మహదేవన్, ఛాయాగ్రహణం: సెల్వరాజ్, నిర్మాత: సి. సుందరం.

## పోప్ సమక్షంలో ఆంధ్రుల విద్యాప్రదర్శన

ప్రపంచక్రైస్తవ మహాసభ సందర్భంగా పోప్‌పాల్ ఆమధ్య బొంబాయి వచ్చినప్పుడు ఫిలిమ్స్ డివిజన్ సంగీత దర్శకుడు, ఆంధ్రుడు శ్రీ ఏ. విజయరాఘవరావు ఆధ్వర్యాన సంగీతవాద్య ప్రదర్శనం జరిగింది. పి. సుశీల, ఎస్. జానకి పాటలు (రికార్డు చెయ్యబడినవి.) పోప్‌కు వినిపించబడినవి.

## జనవరి షెడ్యూల్

'సుమంగళి' డిసెంబరులోనే సెన్సార్ అయింది. ఈవార్త రచించే సరికి జనవరి ఒకటవ తేదీన విడుదల చెయ్యాలనినిర్మాతలు తలపోస్తున్నారు.

'నాదీఆడజన్మే' సంక్రాంతికి ముందే విడుదల అవుతుంది.

'పాండవ వనవాసం'లో డిసెంబర్ అంతంలోకూడా ముఖ్యమైన షూటింగ్‌లు జరుగుతున్నవి. అంచేత సంక్రాంతి ముందుకాక తర్వాత విడుదల అవుతుంది.

పి. ఏ. పి. వారి కొత్త చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జనవరిలో ప్రారంభమౌతుంది.

'వీరాభిమన్యు' ఔట్‌డోర్ షెడ్యూల్ జనవరిలో పెట్టుకొన్నారు.

ఎన్. ఏ. టి. వారి 'శ్రీకృష్ణ పాండవీయం' షూటింగ్ జనవరిలో పోకానపడుతుంది. యూనిట్ వివరం: రచన: సముద్రాల రాఘవాచార్య, సంగీతం: టి. వి. రాజు, ఛాయాగ్రహణం: రవికాంత్, కళ: టి. వి. ఎస్. శర్మ. కృష్ణుడు రామారావు, నారదుడు కాంతారావు, శిశుపాలుడు రాజనాల, జరాసంధుడు ముక్కామల, రుక్మి సత్యనారాయణ, భీముడు ఉదయకుమార్, రుక్మిణి: కె. ఆర్. విజయ, సఖి: గీతాంజలి.


హైదరాబాద్ మూవీస్ వారు తమ సాంఘిక చిత్రానికి 'ఆడదై పుట్టకు' అనే పేరు మొదట పెట్టదలచారు. కానితుదకు 'కీలుబొమ్మలు' నిర్ణయించారు. జనవరిలోనే ఈ చిత్రం సిద్ధమౌతుంది.

శ్రీ రామా పిక్చర్స్‌వారి 'లవంగి పండిత రాయలు' చారిత్రక చిత్రం షూటింగ్ కూడా జనవరిలోనే ప్రారంభమౌతుంది.

## "సత్యహరిశ్చంద్ర"

విజయవారి 'సత్యహరిశ్చంద్ర' షూటింగ్ శరవేగంపై సాగుతున్నది. మార్చి ప్రాంతాలకుచిత్రంపూర్తికాగలదు. రామారావు, ఎస్. వరలక్ష్మి ప్రధానపాత్రధారులు, రచన పింగళి, దర్శకుడు కె. వి. రెడ్డి. నిర్మాతలు: నాగిరెడ్డి, చక్రపాణి.





పి. ఎస్. ఆర్. పిక్చర్స్ వారి "రాజద్రోహి"లో శివాజి గణేశన్, సావిత్రి.

## సావిత్రి స్వంత చిత్రం

నటి సావిత్రి తన కుమార్తె పేరిట విజయ చాముండేశ్వరీ పిక్చర్స్ అనే సంస్థ నెలకొల్పారు. 'నవరాత్రి' అనే తమిళ సాంఘిక చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మిస్తారు. దర్శకుడు ఆదుర్తి. నాగేశ్వరరావు ఇందులో తొమ్మిది భూమికలు ధరిస్తారు.

## "ప్రేమించి చూడు"

హార్సిలీహిల్స్‌లో దాదాపు 3000 అడుగుల వరకు రాగల దృశ్యాలు చిత్రీకరించిన 'ప్రేమించి చూడు' యూనిట్ వారు తిరిగి డిసెంబర్ 26 వ తేదీ నుంచి ఇంకో సుదీర్ఘపు ఔట్‌డోర్ షూటింగ్ షెడ్యూల్ సాగిస్తున్నారు. కోయంబత్తూర్ సమీపానకల ఓ ప్రాజెక్టు లొకేషన్ లోను, అచ్చుతేకల ఓ సుందర భవనం వద్దను షూటింగ్ జరుగుతున్నది. జంటలలో మార్పువచ్చింది. నాగేశ్వరరావు, రాజశ్రీ ఒక జంట, జగ్గయ్య, కాంచన ఒక జంట. 'ప్రేమించిచూడు పిల్ల' అనే ముఖ్యమైన పాటను హార్సిలిహిల్స్‌లో జగ్గయ్యపై షూట్ చెశారు. పాడినది ఘంటసాల, పి. బి. శ్రీనివాస్ పాడిన 'అందాల చేతులు' పాటను నాగేశ్వరరావుపై చిత్రీకరించారు. ఇంకా చలం, రేలంగి, గిరిజ, లంక సత్యం, రావి కొండలరావు తారాగణంలో కలరు. దర్శకుడు: పి. పుల్లయ్య.

# ఎలిజబెత్ టేలర్ అపూర్వపాత్ర

# "క్లియోపాత్ర"

క్రీస్తు పూర్వము 48-30 సంవత్సరాలలో ఈజిప్ట్, రోమ్‌లకుచెందిన క్లియోపాత్రా, జూలియస్ సీజర్, మార్క్ ఆంటోనీ, ఆక్టేవియస్‌ల రాజకీయ, ప్రేమ, ద్వేష గాథలను ఆధారంచేసుకొని అమెరికా ఫిలింసంస్థ ట్వెన్‌టియత్ సెంచరీ ఫాక్స్ "క్లియోపాత్రా" పేరిట ఓ బ్రహ్మాండమైన చిత్రం తీశారు.

లోగడ షా, షేక్స్‌పియర్‌ల నాటకాలపై రెండు చిత్రాలువచ్చి విజయవంతమైనవి. 1953 లో షేక్స్‌పియర్ నాటకం ఆధారంగా "జూలియస్ సీజర్" తీసిన శ్రీ మెంకో విక్జ్, ఈ నాటి అనుపమ వ్యయంతో చిత్రం డైరెక్ట్ చేశారు. ఇందులో సీజర్, ఆంటోనీలపై ప్రాచీన చరిత్రలోకల గాథలను, అనంతర పరిశోధనలవల్ల ప్రచారంలోకి వచ్చిన గాథలను సేకరించి కథ అల్లడం జరిగింది. అంతే కాక ప్లూటార్క్, సూటోనియస్‌లు రచించిన ఆధునికచరిత్రలను, సి.ఎమ్. ఫ్రాంజరో రచించిన "ది లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్. క్లియోపాత్రా" ను ఆధారంచేసుకొని సంఘటనలు, సన్నివేశాలు, పరిణామాలు రూపొందించినారు. ఈ కొత్తచిత్రంలో నాయిక ఎలిబెత్ టేలర్. ఈమె మాజీ భర్త విమాన ప్రమాదంలో మృతిచెందిన కోటీశ్వరుడు టాడ్ కనిపెట్టిన "టాడ్-ఏ. ఓ." ప్రాసెస్‌లో 70 మిల్లిమీటర్లలో—అనగా యిప్పటి చిత్రాలలో కంటే రెట్టింపు ప్రమాణంకల ఫిల్ముపై తీశారు. ఎలిజబెత్ టేలర్ ప్రస్తుత భర్త రిచర్డ్ బర్టన్ (ఆంగ్లేయుడు) ఆంటోనీగా నటించాడు.

మద్రాసులో కొత్తగా నిర్మితమైన "సెఫైర్" థియేటర్‌లో క్లియోపాత్రా ప్రదర్శించబడుతున్నది.

"క్లియోపాత్రా" గురించి ముఖ్యంగా చెప్పదగింది టాడ్—ఏ. ఓ. పద్ధతి, షణ్మార్గశబ్దము, 62 అడుగుల వెడల్పు, 29 అడుగుల ఎత్తు కల కాన్‌వెక్స్ తెరపై ప్రదర్శన జరుగుతుంది. పాత్రధారులు స్వయంగా మన ముందు నిండు రూపంతో నటిస్తున్నట్లు, దృశ్యాలు మన ముందు వున్నట్లు త్రీ-డి చిత్రమంతటి భ్రాంతి కలుగుతుంది. ముఖ్యంగా క్లోజప్‌లలో సినిమా పాత్రధారి నాటక పాత్రధారి వలె కన్పిస్తాడు. కెమేరా ముందుకు గాని, వెనుకకుగాని వెడుతున్నప్పుడు రైలులో మనం (ప్రేక్షకులు) వున్నట్లు, కెమేరా క్రిందు-మీదులకు వెడుతున్నప్పుడు మనం విద్యుత్ ఉయ్యాలలో అలా వెడుతున్నట్లు అన్పిస్తుంది. షణ్మార్గశబ్దమువల్ల అంత సువిశాల స్థలిలో పాత్ర ఎటునుంచి మాట్లాడుతుంటే అటునుంచి వినిపిస్తుంది.





ప్రప్రథమంగా సావిత్రి ద్విపాత్రాభినయం చేసిన బాబా ఆర్ట్ థియేటర్స్‌వారి "అందీఅందని ప్రేమ"లో సావిత్రి

కాగా ఆర్కెస్ట్రాలో ఏ వాద్యం ఎంత దూరంలో పెట్టితే అంతదూరంనుంచి అదే ధ్వనితో వినిపిస్తుంది. ఈగ రెక్క కదిపినా వినిపిస్తుంది. రహస్యములు (విస్పర్స్) కూడావినిపిస్తాయి. టాడ్-ఏ. ఓ. పద్ధతి దక్షిణ భారతానికి రావడం యిదే ప్రథమం కాబట్టి యీ వింత గురించి యింతగా వ్రాయవలసి వచ్చినది.

కథ : ఈజిప్టులో రాజుకు రాజ సోదరి రాణి క్లియో పాత్రాకు పడక పోయి నందువల్ల ఈ జిప్టు నుంచి రోమ్‌కు గోధుమ, బంగారం, రవాణా ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. కలహ నిర్మూలనకై వచ్చిన రోమన్ నియంతసీజర్ క్లియో పాత్రాను ఏకైక పాలకురాలిగాచేసి ఆమెను మోహించి, ఈజిప్షియన్ సంప్రదాయంలో వివాహమాడుతాడు. ఆమెకు పుత్రోదయమౌతుంది. సీజర్ రోమ్‌కు బయలుదేరుతాడు. కాని త్రోవలో యుద్ధాలవల్ల రెండేళ్ళకు కాని రోమ్ చేరుకోడు. అనంతరం క్లియో పాత్రా, తన పుత్రుని రోమ్ సింహాసన వారసుని చేసేయత్నంలో రోమ్ వస్తుంది రోమ్‌లో ఆమెకు సెనెటర్‌లలో కొందరు తప్ప తక్కిన వారు బ్రహ్మాండమైన స్వాగత మిస్తారు. సీజర్ తనను చక్రవర్తిగా (ఎంపరర్) గుర్తించవలసిందని సెనెటర్‌లనుకోరి, వారిఅసూయ ద్వేషములకు కుట్రలకు బలిఅయిపోతాడు. క్లియోపాత్రా ఈజిప్టుకు తిరిగివెళ్ళి పోతుంద. సీజర్ కుడి భుజమైన అంటోనీ, సీజర్ విల్లు ప్రకారము అతని మేనల్లుడు ఆక్టేవియస్ ఇంకొకరు కలిసి రాజ్యపాలన సాగిస్తారు. తూర్పురంగంలో ససైన్యంగా ఉన్న ఆంటోనీకి తన దళాలకు సహాయం అవసరమై ఈజిప్టువెళ్ళి క్లియోపాత్రాను కలునుకొంటాడు. ఉభయులకు సీజర్‌పై ఉన్న అభిమానం చిత్రమైన మోహముగా వికసిస్తుంది. ఆంటోనీ రోమ్‌కు తిరిగివెళ్ళినప్పుడు ఆక్టేవియస్ రాజకీయపు ఎత్తులను ఎదుర్కొనడానికి ఆతడి సోదరి ఆక్టేవియాను వివాహమాడుతాడు. ఈ వార్తవిన్న క్లియోపాత్రా తోక త్రొక్కిన త్రాచైనది. వారి పవిత్ర అమృత ప్రేమకుంభంలో విషబిందువు పడింది. ఆక్టేవియస్ ఆంటోనీని తుద ముట్టించ దలచాడు. క్లియో పాత్రా ఆంటోనీని దరిచేరనివ్వలేదు. ప్రేయసీ ప్రేమికులమధ్యఇనుపతెరలు తొలగిపరలోకంలో ఎలాఏకమైనారు అన్నవిషయం తర్వాతకథ.

క్లియోపాత్రాకు రోమ్‌లో జరిగినసన్మానం, సీజర్‌హత్య, ఆంటోనీ ఆక్టేవియాను వివాహమాడినట్లు తెలుసుకొన్న మీదట క్లియోపాత్రా ప్రళయచర్యలు, ముఖ్యపాత్రత్రయం నటన, చిత్రం భారీతనం "క్లియోపాత్రా"ను నూరేళ్ళు నిలచే చిత్రం చేసినవి. సీజర్‌గా నటించింది రెక్స్ హారిసన్. ఛాయా గ్రహణం, కళా దర్శకత్వం, దుస్తుల నిర్మాణం, స్పెషల్ ఎఫెక్ట్సుకు ఆస్కార్ అవార్డులుయిచ్చారు. నిర్మాత వేంజర్ కలర్ డిలక్స్.





శ్రీ వాణీ ఫిలింస్ వారి "నాదీ ఆడజన్మే" చిత్రంలో సావిత్రి, రామారావు.

# "గీత్ గాయా పత్థరోనే"

డిసెంబరు రెండో వారంలో దర్శక-నిర్మాత వి. శాంతారాం, రాజశ్రీ, జితేంద్ర, సంగీత దర్శకుడు రామ్‌లాల్, కథారచయిత కె. నారాయణ్, సంభాషణా రచయిత విశ్వామిత్ర అదిల్ మొదలైన వారితో కలిసి ఢిల్లీ వెళ్ళారు. ఢిల్లీలో చలి ఎంత తీవ్రంగావుందో చూడ్డానిక్కాదు వారు వెళ్ళింది; "గీత్ గాయా పత్థరోనే" చిత్రం 11వ తేదీన విడుదల అయిన సందర్భంలో వారు వెళ్ళారు.


విడుదలకు రెండురోజులు ముందు రాష్ట్రపతి భవనంలో డాక్టర్ రాధాకృష్ణన్ ఈ చిత్రాన్ని తిలకించారు. కొద్దిసేపు మాత్రమే కూర్చుని వెళ్ళడానికి వచ్చిన రాష్ట్రపతి చివరివరకు చూసి "ఇంతమంచి చిత్రం తీసినందుకు" శాంతారాంను అభినందించి, ఆశీర్వదించారు.

విడుదలనాడు శాంతారాం, రాజశ్రీ తదితరులు రీగల్, అంబా, సుదర్శన్ థియేటర్లకు స్వయంగా వెళ్ళినప్పుడు ప్రేక్షకులు వారిని అభినందనలలో ముంచెత్తారు. ఢిల్లీలో వుండగానే శాంతారామ్‌ను మహారాష్ట్ర విద్యా సంఘంవారు ఘనంగా సత్కరించారు. ☐☐☐






Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2.




Wrapper Printed at Neo Art Press, Madras - 2